పరీక్ష కోసం దివ్యాంగురాలిని ఎత్తుకొని వస్తున్న కుటుంబ సభ్యుడు

ఒంగోలులోని ఓ పరీక్షా కేంద్రం వద్ద తమకు కేటాయించిన గదిని చూసుకుంటున్న అభ్యర్థులు





8

మొంథా ఫైటర్స్‌కు అభినందనలు

మొంథా తుఫాన్ సమయంలో సమర్థవంతంగా పనిచేసిన సచివాలయాల సెక్రటరీలు, ఇంజనీరింగ్ సిబ్బంది, పారిశుధ్య కార్మికుల అభినందన సభను ఒంగోలులోని బాలాజీరావు కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. వారి సేవలను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒడా చైర్మన్ రియాజ్, మేయర్ గంగాడ సుజాతతోపాటు పలువురు అధికారులు కొనియాడారు.



నేడు దోర్నాలకు మంత్రి నిమ్మల

- రేపు వెలిగొండ పనుల పరిశీలన
- అక్కడే అధికారులతో సమీక్ష

త్రిపురాంతకం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండ ప్రాజెక్ట్ పనుల పరిశీలన కోసం గురువారం దోర్నాలకు రానున్నారు. రాత్రికి అక్కడ బస చేస్తారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు దోర్నాల నుంచి బయల్దేరి కొత్తూరు వద్ద వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెళ్లను పరిశీలిస్తారు. అక్కడే అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. గత నెలలో రెండుసార్లు ప్రాజెక్ట్ వద్దకు వచ్చిన మంత్రి.. పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. పని తీరు తెలుసుకునేందుకు తరచూ వస్తానని, ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ పూర్తికి కృతనిశ్చయంతో ఉందని అధికారులను హెచ్చరించారు. ఈనేపథ్యంలో మంత్రి నిమ్మల మరోసారి వస్తున్న సందర్భంగా అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు అవసరమైన నివేదికలతో సిద్ధమయ్యారు.



సజావుగా టెట్

- 549 మంది హాజరు
- ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్న అభ్యర్థులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టీచర్స్ ఎలిజిబులిటీ టెస్ట్ (ఏపీ టెట్) బుధవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 8 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లు ఉండగా మొదటి రోజైన బుధవారం ఉదయం సెషన్ మాత్రమే నిర్వహించారు. 605 మంది అభ్యర్థులను కేటాయించగా 549 మంది హాజరయ్యారు. 56మంది గైర్హాజరయ్యారు. గంట ముందుగానే అభ్యర్థులు ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన నోటీసు బోర్డుల్లో వారికి కేటాయించిన నెంబర్లను పరిశీలించుకున్నారు. కనిగిరికి చెందిన ఒక దివ్యాంగురాలిని ఆమె కుటుంబ సభ్యుడు ఎత్తుకొని పరీక్షా కేంద్రానికి తీసుకొచ్చారు. టెట్ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరుగుతుండటంతో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మొదటి రోజు పరీక్ష సజావుగా ముగియడంతో విద్యాశాఖ అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.



ఫైళ్ల పరిష్కారంలో మంత్రి బెస్ట్

- మంత్రివర్గంలో ప్రథమస్థానంలో నిలిచిన డాక్టర్ బాలవీరాంజనేయస్వామి
- 24వ స్థానంలో కలెక్టర్, 9వ స్థానంలో జేసీ
- సీఎం సమీక్షలో ఈ-ఆఫీసు ఫైళ్ల పరిష్కార నివేదికను ప్రకటించిన ప్రభుత్వం

ఒంగోలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఫైళ్ల పరిష్కారం విషయంలో రాష్ట్ర మంత్రివర్గంలోనే డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి ముందు వరసలో ఉన్నారు. అధికార యంత్రాంగంలో జిల్లాలో కీలకమైన కలెక్టర్ రాజాబాబు నెమ్మదిగా ఉన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక 17 నెలల్లో శాఖాపరమైన ఫైళ్లను పరిశీలించి పరిష్కరించడంలో మంత్రి డాక్టర్ స్వామి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచారు. వివిధ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం అమరావతిలోని సచివాలయంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ప్రజలు మెచ్చే విధంగా ప్రతి విభాగం పని చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా చెప్తున్న సీఎం.. మంత్రులు, రాష్ట్రస్థాయిలోని శాఖాధిపతులు, జిల్లాలో అత్యంత కీలకమైన

మిగతా 8వ పేజీలో



మరోసారీ మొక్కుబడి

- డీసీసీబీలో సెక్షన్ 51 విచారణ
- బ్యాంకు అధికారులు, డీసీవో ఆఫీసు సిబ్బందితో విచారణాధికారి భేటీ

ఒంగోలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో ప్రభుత్వ ఆదేశాలతో సెక్షన్ 51 విచారణ చేస్తున్న సహకారశాఖ అడిషనల్ కమిషనర్ గౌరీశంకర్ మరోసారి విచారణకు వచ్చారు. అయితే ఈసారి కూడా ప్రక్రియ మొక్కుబడిగానే సాగుతున్నట్లు తెలుస్తోంది. అందిన సమాచారం మేరకు బుధవారం ఉదయం పీడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయానికి వచ్చిన గౌరీశంకర్.. తొలుత బ్యాంకు సీఈవో శర్మ, ఇతర అధికారులతో భేటీ అయ్యారు. ప్రధాన ఆరోపణలలో భాగంగా ఉన్న స్వయం సహాయక సంఘాలు, రైతుగ్రూపులు, పాలవెల్లువ పథకం కింద ఇచ్చిన రుణాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను ఇవ్వాలని వారిని కోరినట్లు సమాచారం. అలా మధ్యాహ్నం వరకు గడిపిన విచారణాధికారి సాయంత్రం జిల్లా సహకారశాఖ అధికారి కార్యాలయానికి వెళ్లి అక్కడ సిబ్బందితో భేటీ అయినట్లు తెలిసింది. గతంలో విచారణకు వచ్చిన సమయంలో ఆయన డీసీవో కార్యాలయ సిబ్బందిని కొన్ని అంశాలను

మిగతా 8వ పేజీలో



దోచేశారు!

మెప్మాలో అక్రమాలు రోజుకొకటి బయటకొస్తున్నాయి. అమాయక పొదుపు సభ్యులను పావులుగా వాడుకొని ఇష్టారాజ్యంగా గ్రూపులు తయారు చేసి, బ్యాంకులలో భారీగా రుణాలు పొందిన ఆర్పీల వ్యవహారం తవ్వేకొద్దీ వెలుగు చూస్తోంది. తాజాగా మరో ఆర్పీ పీడీసీసీ బ్యాంకు టౌన్ బ్రాంచ్‌లో చేసిన బోగస్ బాగోతం బహిర్గతమైంది. దీంతో బాధిత మహిళలు లబోదిబోమంటున్నారు. గత కొన్నేళ్లుగా జరుగుతున్న అవినీతి వ్యవహారం ఇటీవల వరకు గుట్టుచప్పుడు కాకుండా సాగింది. ఆ సంస్థ ఉన్నతాధికారి, ఓ ఉద్యోగి మధ్య నెలకొన్న వివాదం పోలీసు కేసుల దాకా వెళ్లడం.. ఆపై ఆరోపణలు చేసుకోవడంతో ఒక్కసారిగా రుణ మోసం బయటపడింది. దానికితోడు 'ఆంధ్రజ్యోతి' ప్రచురిస్తున్న వరుస కథనాలతో బాధితులు బయటకొస్తున్నారు. రూ.కోట్లలో నగదు కాజేసి, దర్జాగా తిరుగుతున్న వారిపై ఎలాంటి చర్యలు లేకపోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

- మెప్మాలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ఆర్పీలు
- వెలుగులోకి మరికొన్ని బోగస్ గ్రూపులు
- రోజూ ఒక్కొక్కరి అవినీతి బాగోతం బహిర్గతం
- చీమకుర్తిలో అర్హత లేని వ్యక్తికి టీఎంసీగా బాధ్యతలు
- నేడు జేసీ ఆధ్వర్యంలో విచారణ

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో బోగస్ గ్రూపుల వ్యవహారం తవ్వేకొద్దీ బయటపడుతోంది. రోజుకో అక్రమం వెలుగుచూస్తోంది. మొన్న పేర్నమిట్టకు చెందిన పార్వతి అనే ఆర్పీ, నిన్న కేశవస్వామిపేట బాధ్యతలు చూసే ఆర్పీ దివ్యశాంతి అవినీతి దందాను 'ఆంధ్రజ్యోతి' ఆధారాలతో సహా బయటపెట్టింది. తాజాగా మరికొందరు సభ్యులు తామూ మోసపోయామంటూ రోడ్డెక్కుతున్నారు. మామిడిపాలెంకు చెందిన ఆర్పీ విజయలక్ష్మి పీడీసీసీ బ్యాంక్ టౌన్ బ్రాంచ్‌లో తమకు తెలియకుండా, సంతకాలు కూడా లేకుండా తమ ఆధార్ కార్డులతో గ్రూపులు తయారు చేసి భారీగా రుణాలు తీసుకున్నట్లు బాధితులు వెల్లడిస్తున్నారు. లక్ష్మీనరసింహ స్వశక్తి సంఘం, లక్ష్మి పొదుపు గ్రూపు, పోలేరమ్మ స్వశక్తి సంఘం, శ్రీకృష్ణ స్వశక్తి సంఘం, గ్లోరీ స్వశక్తికి చెందిన సభ్యులు తాము మోసపోయినట్లు గుర్తించి బ్యాంకర్ల వద్దకు వెళ్లి గోడు వెళ్లబోసుకున్నట్లు సమాచారం. తమకు సంబంధం లేకున్నా బ్యాంకుల్లో రూ.లక్షల్లో అప్పు ఉన్నట్లు తెలిసి వారందరూ లబోదిబోమంటున్నారు. దీనిపై విచారణ చేపట్టి తమను రుణవిముక్తులను చేయాలని కోరుతున్నారు. అయితే ఆర్పీ విజయలక్ష్మి కేవలం ఈ ఐదు గ్రూపుల సభ్యులతో చేసినవే కాకుండా మరికొన్ని బోగస్ గ్రూపులు కూడా సృష్టించి నెల్లూరు బస్టాండులోని ఇంకో జాతీయ బ్యాంకులో కూడా రుణాలు తీసుకున్నట్లు సమాచారం.

గ్రూపు ఫొటోలు లేకుండా... సంతకాలు ఫోర్జరీతో

పైన పేర్కొన్న ఐదు గ్రూపుల సభ్యుల విన్నపాన్ని పరిగణనలోకి తీసుకున్న పీడీసీసీ బ్యాంకు టౌన్ బ్రాంచ్ అధికారులు విచారణ చేపట్టగా బోగస్ విషయం వాస్తమని తేలినట్లు

మిగతా 8వ పేజీలో

చెన్నై టూ చీమకుర్తి

- ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ ఆయిల్‌ను డీజిల్‌గా విక్రయిస్తున్న వైనం
- రెండు ఆయిల్ ట్యాంకర్లు సీజ్
- ముగ్గురిపై కేసు నమోదు
- రూ.2.70 లక్షల జీఎస్టీ ఎగవేత

8



లంకోజనపల్లిలో అలంకారప్రాయంగా ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రం

కేంద్రాలు తెరిచారు.. కొనుగోళ్లు మరిచారు!

- సివిల్ సప్లయీస్ అధికారుల నిర్లక్ష్యం
- గోతాలు కూడా చేర్చని దయనీయం
- లభించని గిట్టుబాటు ధర
- భారీగా నష్టపోతున్న అన్నదాతలు

దర్శి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అట్టహాసంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన పౌరసరాల శాఖ అధికారులు కొనుగోళ్లను మరిచారు. వారి నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పండించిన ధాన్యాన్ని ఎక్కడ విక్రయించాలో దిక్కుతోచక అయోమయంలో ఉన్నారు. జిల్లాలో వారం క్రితం సివిల్

మిగతా 8వ పేజీలో

నల్లి భయం!

- కలవరపెడుతున్న స్క్రబ్ టైఫస్
- జిల్లాలో ఇప్పటికే ఇద్దరు మృతి
- నాలుగు యాక్టివ్ కేసులు.. రిమ్స్‌లో చికిత్స
- మరో ఇద్దరు డిశ్చార్జి
- ఈ ఏడాది ఇప్పటి వరకూ 29 కేసులు నమోదు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలను స్క్రబ్ టైఫస్ కలవరపెడుతోంది. గతంలో కూడా అడపాదడపా ఈ కేసులు నమోదైనప్పటికీ ప్రాణాంతకంగా ఉండేది కాదు. కానీ ఇప్పుడు వ్యాధి మరింత విజృంభిస్తుండటంతోపాటు ప్రాణాలు కోల్పోతుండటం ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతుండటంతో రైతులు, కూలీలు నల్లిపురుగు బారిన పడుతున్నారు. ఆ పురుగు కుట్టినప్పుడు పెద్దగా నొప్పిలేకపోవడంతో పట్టించుకోవడం లేదు. ఆతర్వాత ఐదారు రోజులకు జ్వరం వస్తోంది. దానితోపాటు తలనొప్పి, ఒళ్లు నొప్పులు ప్రారంభమవుతున్నాయి. వైద్యశాలకు వెళ్లే సమయానికి వ్యాధి తీవ్రత పెరిగి ప్రాణాంతకమవుతోంది. జిల్లాలో ఈనెల 1వ తేదీ నుంచి 10వతేదీ వరకు మొత్తం ఎనిమిది కేసులు నమోదయ్యాయి. అందులో ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో ఇద్దరు వైద్యశాల నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఇంకో నలుగురు వైద్యసేవలు పొందుతున్నారు. వీరిలో బేస్తవారపేటకు చెందిన మహిళను గుంటూరుకు తరలించగా మిగిలిన ముగ్గురు ఒంగోలులో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈనెల 6వ తేదీన యర్రగొండపాలేనికి చెందిన దానమ్మ, 9వ తేదీన సంతనూతలపాడు మండలం రుద్రవరానికి చెందిన నాగేంద్రం మృతి చెందారు. ప్రస్తుతం యాక్టివ్ కేసులు

మిగతా 8వ పేజీలో



అంబాపురంలో రోగి ఇంటి వద్ద వివరాలు తెలుసుకుంటున్న వైద్య సిబ్బంది

అంబాపురంలో కలకలం

- ఓ మహిళకు రిమ్స్‌లో వైద్య పరీక్షలు
- స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా నిర్ధారణ
- గ్రామంలో పారిశుధ్య పనులు చేయించిన అధికారులు
- ప్రజల నుంచి రక్త నమూనాల సేకరణ

8



నిమ్మకునీరెత్తినట్టుగా!

- దారుణంగా పడిపోయిన నిమ్మ ధర
- పదిరోజుల క్రితం కేజీ రూ.40.. ఇప్పుడు రూ.15 మాత్రమే
- మద్దతు ధర ప్రకటించాలని రైతుల వేడుకోలు
- పట్టించుకోని అధికారులు

9



పోలీసు అధికారులతో ఐజీ త్రిపాఠి, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దు

- గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి
- సింగరాయకొండ సర్కిల్‌లో పోలీసుల పనితీరుపై సమీక్షా సమావేశం

8



అర్హులకు గ్యాస్ కనెక్షన్లు

- వెంటనే ఇవ్వాలి
- జేసీ గోపాలకృష్ణ ఆదేశం
- గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశం

9

దోచేశారు!

(7వ పేజీ తరువాయి)

సమాచారం. ముఖ్యంగా గ్రూపుసభ్యుల ఫొటోలు లేకుండా, సంతకాలు ఫోర్జరీ చేయడంతోపాటు, బ్యాంకర్లను సైతం బురిడీ కొట్టించి రూ.లక్షల్లో దోచేసినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతానికి కొందరు ఆర్పీల అక్రమాలు మాత్రమే బయటకొస్తుండగా, ఇంకా అనేకమంది ఇదే తరహా అవినీతికి పాల్పడినట్లుగా సమాచారం. వారి చేతిలో మోసపోయిన మహిళలకు ఇంకా బ్యాంకుల నుంచి నోటీసులు రాకపోవడంతో బయటకు పొక్కలేదు.

గతంలో చర్యలు లేకపోవడంతో మరిన్ని అక్రమాలు

గతంలో అవినీతికి పాల్పడ్డ ఆర్పీలపై నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా వారు బొక్కేసిన సొమ్మును తిరిగి కట్టించలేదు. దీంతో మిగతా వారు మరింత రెచ్చిపోతున్నారు. అమాయక మహిళలను మోసం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మెప్మాలో చోటుచేసుకున్న అవినీతిపై క్షేత్రస్థాయి నుంచి లోతుగా అధ్యయనం చేస్తే మరి కొంతమంది ఆర్పీల మోసాలు బయటకొచ్చే అవకాశం ఉందని బాధితులు అంటున్నారు.

చీమకుర్తిలో మరికొన్ని బోగస్ గ్రూపులు

చీమకుర్తి మునిసిపాలిటీలోని మెప్మాలోనూ అంతులేని అవినీతి చోటుచేసుకుంది. అక్కడి టౌన్ మిషన్ కోఆర్డినేటర్ కనుసన్నల్లో ఈ వ్యవహారం జరిగినట్లు తెలుస్తోంది. 12 బోగస్ గ్రూపులు తయారుచేసి భారీగానే బొక్కేసినట్లు సమాచారం. చీమకుర్తి మునిసిపాలిటీ టౌన్ మిషన్ కోఆర్డినేటర్‌గా పూర్తిస్థాయి అధికారి లేరు. దీంతో అర్హత లేని వారికి ప్రత్యేకించి మొన్నటి వరకు ఒంగోలులో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా (సీవో)గా పనిచేసిన ఓ ఉద్యోగికి ఇన్‌చార్జి టీఎంసీగా బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీని వెనుక జిల్లా అధికారి చేతివాటం భారీగానే ఉందన్న ప్రచారం జరుగుతోంది. ఆ అధికారి అండదండలను ఆసరాగా చేసుకుని సదరు ఇన్‌చార్జి టీఎంసీ రెచ్చిపోయారు. అక్కడి కార్యాలయ సిబ్బందిని ఇబ్బందులకు గురిచేయడంతోపాటు ఒంగోలు మెప్మా కార్యాలయంలోనూ ఆమె పెత్తనం చేయడంపై జిల్లావ్యాప్తంగా మెప్మాలో చర్చ నడుస్తోంది. ఆమె ప్రభుత్వం ఆదేశించిన కార్యకలాపాలకన్నా బోగస్‌పైనే కన్నేసినట్లు తెలుస్తోంది. అయితే చీమకుర్తి మెప్మాలో చోటుచేసుకున్న అవినీతి, టీఎంసీ నియామకంపై విచారణ చేస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

నేడు జేసీ ఆధ్వర్యంలో విచారణ

పట్టణ పొదుపు మహిళల పేరుతో గత కొన్నేళ్లుగా జరిగిన అవినీతి బాగోతం బయటకు రావడం, బాధితులు న్యాయం చేయాలని రోడ్డెక్కడంపై కలెక్టర్ పి.రాజాబాబు, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సీరియస్‌గా దృష్టి సారించారు. ఈక్రమంలో జేసీ గోపాలకృష్ణ చైర్మన్‌గా, జడ్పీ సీఈవో చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ నారాయణతో కూడా త్రిసభ్య కమిటీని కలెక్టర్ విచారణకు నియమించారు. వారం క్రితం మెప్మా కార్యాలయానికి జేసీ తనిఖీ చేశారు. అధికారుల నుంచి కొన్ని వివరాలను సేకరించారు. అయితే పూర్తిస్థాయి సమాచారం మెప్మా నుంచి లభించడం లేదని గుర్తించిన ఆయన లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడారు. పొదుపు సభ్యులకు రుణాలు మంజూరు చేసిన అన్ని బ్యాంకుల నుంచి సమాచారం సేకరించినట్లు సమాచారం. ఈ మేరకు ప్రకాశం భవన్‌లో జేసీ ఆధ్వర్యంలో గురువారం విచారణ జరగనుంది.

కేంద్రాలు తెరిచారు.. కొనుగోళ్లు మరిచారు!

(7వ పేజీ తరువాయి)

సప్లయీస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. దర్శి నియోజకవర్గంలో 13 కేంద్రాలను తెరిచారు. గతనెల 3న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మండలంలోని సామంతపూడిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మిగిలిన కేంద్రాలను స్థానిక అధికారులు ఏర్పాటు చేశారు.

వారంలో 575 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు

నియోజకవర్గంలో వారం క్రితం 13 కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ దర్శి మండలంలోని బొట్లపాలెం కేంద్రంలో మాత్రమే 575 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మిగిలినచోట్ల కొనుగోళ్ల ప్రారంభించలేదు. అనేక కేంద్రాలకు ఇప్పటివరకు గోతాలు కూడా చేర్చలేదు. డేటా ఆపరేటర్లను ఏర్పాటు చేయలేదు. దీంతో కొనుగోళ్ల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. కొంతమంది రైతులు శ్యాంపిల్స్ తీసుకెళ్లినప్పటికీ స్థానిక వీఏఏలు తేమ శాతాన్ని పరిశీలించి తేమ ఎక్కువగా ఉందని తిప్పిపంపుతున్నారని రైతులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటైతే గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశించిన రైతులకు నిరాశ మిగులుతోంది.

ప్రైవేటు వ్యాపారుల దోపిడీ

అవకాశాన్ని ఆసరా చేసుకొని ప్రైవేటు వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారు. ప్రభుత్వం గ్రేడ్-1 రకం 75 కేజీల బస్తా ధర రూ.1,792, సాధారణ రకం రూ.1,777 మద్దతు ధర నిర్ణయించింది. రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకుంటే ఆమేరకు మద్దతు ధర లభిస్తుంది. ఇక్కడ కొనుగోళ్లు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తున్నారు. 75 కేజీల బస్తాను ప్రైవేట్ వ్యక్తులు రూ.1,400కే కొనుగోలు చేస్తున్నారు. అదనంగా తేమ శాతం కింద మరో 3 కేజీలు తీసుకుంటున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను విక్రయించుకునేందుకు వనరులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు అవసరమైన నిధులు విడుదల చేసింది. దర్శి మండలంలోని బొట్లపాలెంలో కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతులకు మరుసటి రోజే నగదు జమ అయింది. సివిల్ సప్లయీస్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఉన్నతాధికారులు ఈవిషయాన్ని గుర్తించి వెంటనే కొనుగోళ్ల ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నల్లి భయం

(7వ పేజీ తరువాయి)

పొదిలి, కొనకనమిట్ల, ముండ్లమూరు, బేస్తవారపేటల్లో ఒక్కొక్కటి చొప్పున నమోదయ్యాయి. బుధవారం ఒంగోలుకు చెందిన 35 ఏళ్ల యువకుడికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్ అని తేలింది. దీంతో ఆయన్ను రిమ్స్‌కు తరలించారు.

ఈ ఏడాది 29 కేసులు

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ ఆఖరు వరకూ స్క్రబ్ టైఫస్ కేసులు 20 నమోదయ్యాయి. వారందరికీ సమీప వైద్యశాలలతోపాటు ఒంగోలులోని జీజీహెచ్‌లో చికిత్స చేశారు. త్వరగా కోలుకోవడంతో వైద్యశాఖ అధికారులు కూడా ఊపిరిపీల్చుకున్నారు. ఒక్క డిసెంబరులో స్క్రబ్ టైఫస్ వ్యాధితో ఇరువురు మృతి చెందారు. మరో ఏడుగురు ఆ వ్యాధి బారినపడటంతో అటు ప్రజానీకం, ఇటు వైద్యాధికారుల్లోనూ ఆందోళన నెలకొంది. పూర్వకాలంలో నల్లిపురుగు పేడదిబ్బలపై ఉండేది. అయితే అప్పట్లో ఆ పరుగు కనిపిస్తే చంపేవారు. కానీ ప్రస్తుతం ఆ పరుగులు వ్యవసాయ భూముల్లోకి చేరాయి. వ్యవసాయ పనులు చేసే సమయంలో కుడుతుండటంతో ప్రారంభంలో పెద్దగా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. తాజాగా ఆ నల్లిపురుగు ప్రాణాలను తీస్తుండటంతో ఇప్పుడు ప్రజల్లో మరింత ఆందోళన నెలకొంది.

అంబాపురంలో స్క్రబ్ టైఫస్ కలకలం

- ఓ మహిళకు రిమ్స్‌లో వైద్య పరీక్షలు.. వ్యాధి నిర్ధారణ
- ప్రజల నుంచి రక్త నమూనాల సేకరణ

కొనకనమిట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబాపురం గ్రామంలో స్క్రబ్ టైఫస్ వ్యాధి ఒకరికి నిర్ధారణ అయినట్లు కొనకనమిట్ల పీహెచ్‌సీ వైద్యురాలు సురేఖ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని అంబాపురం గ్రామానికి చెందిన మహిళ కొద్ది రోజుల నుంచి జ్వరం తగ్గకపోవడంతో మంగళవారం ఒంగోలులోని రిమ్స్ వైద్యశాలకు వైద్యపరీక్షలకు వెళ్లింది. బుధవారం ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా స్క్రబ్ టైఫస్ వ్యాధిగా నిర్ధారణ అయింది. దీంతో అధికారులు స్పందించారు. గ్రామంలో కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టారు. వైద్య సిబ్బంది ప్రజల నుంచి రక్తనమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేఖ మాట్లాడుతూ ఈ వ్యాధి పట్ల ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని, చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు. లక్షణాలు ముందుగా గుర్తించి మెరుగైన వైద్యం తీసుకుంటే ప్రాణాపాయం లేదని చెప్పారు. ఈ వ్యాధి సోకితే జ్వరం 6 నుంచి 21 రోజుల వరకు తగ్గకపోవడం, ఒళ్లు నొప్పుల వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ పురుగు గ్రామీణ ప్రాంతాల్లో పొలాల్లో ఎక్కువగా ఉంటుందని, పొలం పనులకు వెళ్లే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పొదలు, గడ్డి ఎక్కువగా ఉన్న చోట ఈ పురుగులు తిరుగుతుంటాయని చెప్పారు. శరీరం పూర్తిగా కనిపించకుండా దుస్తులు ధరించాలని చెప్పారు.

చెన్నై టూ చీమకుర్తి

ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ ఆయిల్‌ను డీజిల్‌గా విక్రయాలు

- రెండు ఆయిల్ ట్యాంకర్లు సీజ్
- ముగ్గురిపై కేసు నమోదు
- రూ.2.70 లక్షలు జీఎస్టీ ఎగవేత



అక్రమంగా తరలిస్తున్న ఆయిల్ ట్యాంకర్లను సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

ఒంగోలు క్రైం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ మిక్సిడ్ అయిల్‌ను డీజిల్‌గా విక్రయిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న ముఠా గుట్టును విజిలెన్స్ అధికారులు రట్టు చేశారు. బుధవారం చెన్నై నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇండస్ట్రియల్ ఆయిల్ రెండు ట్యాంకర్లను సీజ్ చేసి ముగ్గురిపై 6ఏ కేసుకు సిఫార్సు చేశారు. చెన్నై నుంచి అక్రమంగా తరలించి జీఎస్టీ రూ.2.70 లక్షలు చెల్లించకుండా ప్రభుత్వానికి గండి కొడుతున్నారు. ఈ మేరకు సంతనూతలపాడు సమీపంలో రెండు ట్యాంకర్లను నిలిపి విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయగా ఈ బాగోతం బట్టబయలు అయింది.

ముగ్గురిపై కేసు నమోదు

ఒంగోలుకు చెందిన శ్రీనివాస ల్యూబ్స్ అండ్ ఆయిల్ ప్రోడక్ట్స్ యజమాని ఏల్చూరి శ్రీనివాసరావు, నారయణ, చెన్నై, తిరుమన్నమలై దివ్వ ఇండస్ట్రీస్ రాజమణిలపై 6ఏ కేసు జ్యుడీషియల్ కోర్టులో దాఖలు చేస్తున్నారు. జీఎస్టీ చెల్లించకుండా అక్రమరవాణా చేసినందుకు అధికారులు అయిల్ శాంపిల్స్ విశ్లేషణ కోసం నమూనాలు సేకరించారు. శాంపిల్స్ నివేదికలు అందిన తరువాత క్రిమినల్ చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. రెండు టిప్పర్లను సీజ్ చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐలు రాఘవరావు, రవిబాబు, డీసీటీవో రామారావు, ఎస్సై నాగేశ్వరావు, సివిల్ సప్లయీస్ ఏఎస్‌వో పుల్లయ్య సిబ్బంది ఉన్నారు.

డిజిల్ బదులుగా ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ ఆయిల్

తక్కువ ధరకు దొరికే ఇండస్ట్రియల్ మిక్సిడ్ ఆయిల్‌ను డిజిల్ పేరుతో తక్కువ ధరకు విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. చెన్నైకు చెందిన రాజమణి ఒంగోలులో ఉన్న శ్రీనివాస లూబ్రికెంట్స్ పేరుతో ఏల్చూరి శ్రీనివాసరావుకు ఇండస్ట్రియల్ మిక్సిడ్ ఆయిల్ ను పంపిస్తున్నారు. శ్రీనివాసరావు, చీమకుర్తిలో ఎర్రా నారయణ అనే ఏజెంటు ద్వార అక్కడ క్వారీలు, క్వారీలలో పనిచేసే వాహనాలు, టిప్పర్లకు డిజిల్ తక్కువ ధరకు వస్తుందని విక్రయిస్తున్నారు. చెన్నై నుంచి లీటరు రూ.70కు కొనుగోలు చేసి ఇక్కడ రూ.87 విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో దొరికే డిజిల్ కంటే తక్కువ ధర కావడంతో టిప్పర్ యజమానులు క్వారీ యజమానులు ఇండస్ట్రియల్ మిక్సిడ్ అయిల్‌ను కొనుగోలు చేస్తున్నారు.

బస్టాండు స్థలాన్ని పరిశీలించిన ఆర్ఎం

పెద్దదోర్నాల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు స్థలాన్ని రీజనల్ మేనేజర్ సత్యనారాయణ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్టీసీ బస్టాండు నిర్మాణం కోసం హద్దులు పరిశీలించినట్లు చెప్పారు. 119,120 సర్వేనెంబరులో గల 94సెంట్లలో నిర్మాణం కోసం పరిపాలన అనుమతులు మంజూరు అయ్యాయని తెలిపారు. అందుకుగానూ క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించామని, నిర్మాణానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. త్వరలోనే బస్టాండు నిర్మాణానికి పనులు నిర్వహించే అవకాశముందని ఆయన చెప్పారు.

ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో గంజాయి పట్టివేత

ఒంగోలు క్రైం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో గంజాయి, గంజాయి చాకెట్లను తరలిస్తున్న ఇరువురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో సీసీఎస్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా చెన్నయ్‌కు చెందిన ఇరువురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండటంతో వారిని గుర్తించి పట్టుకున్నారు. నిందితులు ఒడిశా నుంచి చెన్నయ్‌కి కిలో గంజాయి తీసుకొని ఒంగోలు వరకు రైలులో వచ్చారు. అయితే వారి వద్ద టిక్కెట్ లేకపోవడంతో రైల్వే టీసీ ఒంగోలు రైల్వేస్టేషన్‌లో దించివేశాడు. దీంతో వారు ఇరువురు చెన్నయ్‌కు బస్సులో వెళ్లాలని ఆర్టీసీ డిపోకు వచ్చి సీసీఎస్ పోలీసులకు దొరికిపోయారు. ఈ సందర్భంగా నిందితుల వద్ద నుంచి కిలో గంజాయి, గంజాయి చాక్లెట్లలను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్‌లో అప్పగించారు. ఇరువురిని పోలీసులు విచారిస్తున్నారు.

పశ్చిమ ప్రాంత యువత భవిష్యత్తు కోసం కృషి

- ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి

మార్కాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రాంతంలోని యువత భవిష్యత్తు కోసమే శాయశక్తులా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. స్థానిక 13వ వార్డులోని అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద బుధవారం మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపిన నేపథ్యంలో కృతజ్ఞత సభ జరిగింది. ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ మార్కాపురం జిల్లాతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. వెనుకబడిన జిల్లాల జాబితాలో రాష్ట్రంలోనే మార్కాపురం అగ్రస్థానంలో ఉండే అవకాశం ఉంటుందన్నారు. అప్పుడు కేంద్ర ప్రభుత్వ నిధులతో సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఏర్పడుతుందని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ దిశగా చర్యలు చేపడతారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో మార్కాపురం ప్రాంతం ఇంకా ఎంతో వెనుకబడిందని చెప్పారు. ఓట్లు వేయించుకుని గద్దెనెక్కి ఈ ప్రాంత అభివృద్ధిని వైసీపీ నాయకులు విస్మరించారన్నారు. మార్కాపురం అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం ఇన్ని చర్యలు తీసుకుంటుంటే వైసీపీ నాయకులు మాత్రం లేనిపోని విమర్శలు చేస్తుండడాన్ని తప్పుబట్టారు. వారికి ఉనికి భయం పట్టుకుని అసత్యాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. భవిష్యత్తులో వారికి ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ ఇబ్రహీం ఖాన్, మేడిద రంగస్వామి, టీడీపీ నాయకులు డాక్టర్ షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, సయ్యద్ గఫార్, జనసేన నాయకులు సయ్యద్ సాదిక్, ఖాశింవలి తదితరులు పాల్గొన్నారు.

మొంథా ఫైటర్స్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్
- పారిశుధ్య కార్మికులు, సచివాలయ, ఇంజనీరింగ్ సిబ్బందికి సన్మానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నగరానికి ముప్పు వాటిల్లకుండా ముందస్తు చర్యలతో సమర్థవంతంగా పనిచేసి, ఒంగోలుకు అవార్డు సాధించిన మొంథా ఫైటర్స్ సేవలు అభినందనీయం అని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సచివాలయ సెక్రటరీలు, ఇంజనీరింగ్ సిబ్బంది అభినందన సభ బుధవారం స్థానిక బాలాజీరావు తిరుపతి కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ రాష్ట్రానికి మొంథా తుఫాన్ ముప్పు హెచ్చరికతో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బంది జరగలేదన్నారు. నగరంలో కొంతమేర రోడ్లు దెబ్బతిని నష్టం వాటిల్లినప్పటికీ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి, ఒంగోలుకు మంచి పేరు తీసుకొచ్చారన్నారు. ప్రజారోగ్యం కోసం ప్రతిరోజు కష్టపడి పనిచేసే కార్మికులు, సెక్రటరీలు ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కారానికి తాను ఎల్లవేళలా అండగా ఉంటానని దామచర్ల హామీ ఇచ్చారు. ప్రత్యేక గుర్తింపుకార్డులు మంజూరు చేయడంతోపాటు మూడు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరం నిర్వహించి కార్మికుల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తామని, అలాగే కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే దిశగా అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తామని స్పష్టం చేశారు. పలు అభివృద్ధి పనులతో నగర సుందరీకరణతో తీర్చి దిద్దుతుండగా, వాటికి మరింత కొత్త రూపు తీసుకురావాలంటే కార్మికులు కష్టపడి పనిచేయాలన్నారు. వీధుల్లో ఎక్కడా చెత్త లేకుండా చూడాలని, ప్రధాన రహదారుల వెంట వెళ్ళేటపుడు ప్రతి ఒక్కరూ మెచ్చుకునేలా ఉండాలన్నారు. ప్రతిరోజూ ఇంటింటి చెత్త సేకరణతో ప్రజల్లో మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా పనిచేసి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర స్ఫూర్తితో స్వచ్ఛ ఒంగోలుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనార్దన్ పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులకు బియ్యంతోపాటు, నిత్యావసర సరుకులు అందజేసి సత్కరించారు. వారితోపాటు పలువురు సచివాలయ సెక్రటరీలను ప్రత్యేకంగా అభినందించారు. నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షత జరిగిన సభలో ఒడా చైర్మన్ షేక్ రియాజ్, మేయర్ గంగాడ సుజాత, ఎంతః ఐసయ్య, శానిటరీ సూపర్ వైజర్లు షేక్ బాబ్జి, పిచ్చయ్య, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

పలువురికి గాయాలు

నాగులుప్పలపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు మండల పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మద్దిపాడు మండలం తిమ్మనపాలెం ఎస్సీకాలనీకి చెందిన బోజెపల్లి కోటయ్య(32) బుధవారం రాత్రి ఉప్పుగుండూరులో స్నేహితుడిని వదలిపెట్టి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని హైవే రాగా రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొని తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108వాహనంలో ఒంగోలుకు తరలించారు. అప్పటికే కోటయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య నక్షత్ర, నాలుగురోజుల క్రితం జన్మించిన పాప ఉన్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

మట్టిగుంట రోడ్డులో...

ఉప్పుగుండూరులోని ఎస్టీకాలనీకి చెందిన కట్టా వెంకటేశ్వర్లు స్థానిక మట్టిగుంట రోడ్డులోని పెట్రోలు బంక్‌లో తన బైక్‌కు పెట్రోలు పోయించుకొని తిరిగి వస్తున్నాడు. ఇదే సమయంలో ముప్పాళ్ల గ్రామానికి చెందిన నూకతోటి కోటి ఉప్పుగుండూరుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. కోటికి తీవ్రగాయాలు, వెంకటేశ్వర్లుకు స్వల్పంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు.

త్రోవగుంట వద్ద..

బి.నిడమానూరు గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వర్లు, మురళి ద్విచక్ర వాహనంపై బుధవారం ఒంగోలు వెళుతున్నారు. ఈక్రమంలో త్రోవగుంట వద్ద రహదారి-216 పై గేదెలు అడ్డురాగా వాటిని తప్పించే క్రమంలో బైకు అదుపుతప్పి రోడ్డుపై పడి గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.



సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్న ఐజీ త్రిపాఠి

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దు

గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

సింగరాయకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎటువంటి రాజీలేకుండా పటిష్టంగా పనిచేయాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సూచించారు. సింగరాయకొండ సర్కిల్ కార్యాలయంలో బుధవారం రాత్రి జిల్లాలోని పోలీసుల పనితీరు, నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు, కీలక కేసుల పురోగతి, గంజాయి రవాణా, పలు అంశాలపై ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో నమోదైన కేసుల వివరాలు, వాటి ప్రస్తుత పరిస్థితులపై ఆరాతీశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో అత్యధికంగా నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో పెట్రోలింగ్, గస్తీ పెంచాలని సూచించారు. ప్రజా భద్రతకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి కేసులు తగ్గించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. చెడు నడతగల వ్యక్తులపై నిత్యం నిఘా ఉంచాలన్నారు. గంజాయి రవాణా, సరఫరా అరికట్టేందుకు కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ చెకింగ్ వాహన తనిఖీలు, బారికేడ్లు రిఫ్లెక్టెడ్ డ్రమ్ములు ఏర్పాటు చేయాలని, డ్రంకన్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఒంగోలు, దర్శి, కనిగిరి డీఎస్పీలు రాయపాటి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, సాయి ఈశ్వర్, సీఐలు చావా హజరత్తయ్య, నాగారాజు, రామారావు, ప్రసాద్, రాజేష్‌కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

రేపు చీమకుర్తిలో ఖోఖో జిల్లా జట్ల ఎంపికలు

చీమకుర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో ఈనెల 12వ తేదీన ఖోఖో జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రఘుబాబు, కరిచేటి హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలు, మహిళల విభాగంలో ఎంపికలు జరగనున్నాయి. పూర్తి వివరాలకు 9839856656 సెల్ నంబర్‌ని సంప్రదించాలని వారు కోరారు.

జీజీహెచ్‌లో త్రీ సీటర్ చైర్స్ ఏర్పాటు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జీజీహెచ్‌కు విచ్చేసే రోగులు, వారి సహాయకుల కోసం అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాలతో అధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం ఆసుపత్రిలో త్రీసీటర్ చైర్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ ఏబీజీ, ఐసీయూలో వేచి ఉండే రోగులు, వారి సహాయకుల కోసం వీటిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటికే ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చొరవతో అనేక మంది దాతలు ముందుకొచ్చి అవసరమైన కుర్చీలు బహూకరించారన్నారు. అలాగే కలెక్టర్ ఆదేశాలతో నూతనంగా 18 ప్రత్యేక చైర్‌లను అందుబాటులో ఉంచామన్నారు. ఇటీవల కాలంలో జీజీహెచ్‌లో అందుతున్న మెరుగైన వైద్యసేవలతో రోగుల సంఖ్య పెరిగిందన్నారు. అందుకు అనుగుణంగా అవసరమైన సౌకర్యాలను, వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలరావు పాల్గొన్నారు.

ఫైళ్ల పరిష్కారంలో మంత్రి బెస్ట్

(7వ పేజీ తరువాయి)

కలెక్టర్, జేసీల పనితీరును ఆయా అంశాలపై బేరీజు వేసి సమీక్ష చేస్తున్నారు. అందులో ఈ-ఆఫీసు ద్వారా వచ్చే ఫైళ్లను సత్వరం పరిశీలించి పరిష్కరించాలన్న అంశం కూడా ప్రభుత్వ ప్రాధాన్యతలలో ముందు వరుసలో ఉంది. దీనిపై బుధవారం సీఎం సమీక్షలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం ఈ-ఆఫీసు ఫైళ్ల పరిష్కారంపై మంత్రులు, శాఖాధిపతులు, జిల్లాలో కలెక్టర్లు, జేసీల పనితీరును నివేదించారు. రెండు భాగాల్లో నివేదికలు ఇచ్చారు.

17 నెలల పనితీరు ప్రామాణికం

ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక 2024 జూలై 15 నుంచి ఈనెల 9 వరకు సుమారు 17 నెలల కాలంలో ఆయా స్థాయిల్లో ఈ-ఆఫీసు ద్వారా వారికి వచ్చిన ఫైళ్ళు ఎన్ని, వాటిలో ఎన్నింటికి పరిష్కారం చేశారన్నది పరిగణనలోకి తీసుకున్నారు. ఐఏఎస్‌ల విషయంలో రెండు విభాగాలను తీసుకున్నారు. అందులో కలెక్టర్ రాజాబాబు ఇటీవలనే జిల్లాకు రావడంతో ఆయన మూడు నెలల విభాగంలో ఉండగా జేసీ గతం నుంచి ఉండటంతో ఆయన పనితీరు రెండు విభాగాల్లోనూ విశ్లేషించారు. కలెక్టర్ రాజాబాబు ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తనకు వచ్చిన ఫైళ్ల పరిష్కారంలో మందగమనంతో ఉన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల కలెక్టర్లలో రాజాబాబు ఏకంగా 24వ స్థానానికి పడిపోయారు.

గత ఏడాది జూలై 15 నుంచి ఈనెల 9వతేదీ వరకు సుమారు 17 నెలల్లో ఈ ఆఫీసు ఫైళ్ల పరిష్కారంలో మంత్రివర్గ సభ్యులందరిలోనూ జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి ప్రథమస్థానంలో నిలిచారు. ఈ కాలంలో ఆయనకు ఈ ఆఫీసు ద్వారా 629 ఫైళ్లు రాగా అప్పటికి మరికొన్ని ఉన్నాయి. ఆ మొత్తంలో 651 పరిష్కరించారు. సగటున ఒక్కో ఫైల్ పరిష్కారానికి రెండు రోజుల 41 నిమిషాలు సమయం తీసుకున్నారు.

కలెక్టర్ రాజాబాబుకు ఈ ఏడాది సెప్టెంబరు 9 నుంచి ఈనెల 9వతేదీ వరకు 383 ఫైళ్లు రాగా 356 పరిష్కరించారు. అయన ఒక్కో ఫైలుకు సగటున 9 రోజుల 8గంటల 32 నిమిషాల సమయం తీసుకున్నారు.

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ 17నెలల అంశంలో రాష్ట్రంలో 5వ స్థానంలోనూ, మూడు నెలల విషయంలో 9వ స్థానంలో ఉన్నారు. ఆయనకు 17నెలల విభాగంలో 3,755 ఫైళ్లు ఈ ఆఫీసు ద్వారా రాగా 3,695 పరిష్కరించారు. అలాగే మూడు నెలల విభాగంలో 494 ఫైళ్లు రాగా 441 పరిష్కారం చేశారు.

మరోసారీ మొక్కుబడి

(7వ పేజీ తరువాయి)

పరిశీలించాలని చెప్పినట్లు సమాచారం. వాటి వివరాలను కూడా అడిగినట్లు తెలిసింది. అయితే నాలుగు నెలల్లో ఆయన విచారణ పూర్తి చేయాల్సి ఉండగా ఆ గడువు సమీపిస్తున్నప్పటికీ విచారణ ఒక కొలిక్కి రాలేదు. గతంలో మూడుసార్లు విచారణ పేరుతో వచ్చినా తూతూమంత్రంగానే సాగింది. ఈసారి కూడా అలాగే మొక్కుబడిగానే జరిగిందన్న చర్చ సహకారశాఖ వర్గాల్లో సాగుతున్నది.



కోతకోసే స్థోమత లేక చెట్లపైనే పచ్చరంగుకు చేరుకుంటున్న నిమ్మకాయలు

నిమ్మ ధరలు పడిపోతున్నాయి. పంట సాగు చేపట్టిన రైతులు ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. నిన్నమొన్నటి వరకు కిలో రూ.40 ఉన్న ధర, వారం రోజులుగా కిలో రూ.15లకు దిగజారిపోయింది. దిగుబడులు బాగున్నప్పటికీ రోజుకో విధంగా ధరలు ఉండటంతో పాటు దళారుల వైఖరితో తీవ్ర నష్టాల పాలవుతూ అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తోడ్పాటుగా నిలిచి మద్దతు ధర కల్పించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం గిడ్డంగుల సౌకర్యం కల్పిస్తే నిల్వ చేసుకుని మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చు. ఆ విధమైన చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ప్రజాప్రతినిధుల నుంచి స్పందన కనిపించడం లేదు.



కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలి



నిమ్మకాయల ధరలు పడిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి సమయంలో కోల్డ్‌స్టోరేజీలు ఉంటే నిల్వ చేసుకుని రేటును బట్టి ఎగుమతి చేసుకునే వెసులుబాటు ఉంటుంది. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి ఆశించినంత దిగుబడి వచ్చినా, ధరలు లేక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం వారిని ఆదుకుని గిట్టుబాటు ధరలు కల్పించటంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలి.

- నరసయ్య, లెమన్‌మర్చంట్, కనిగిరి

నిమ్మకు నీరెత్తినట్టుగా!

- దారుణంగా పడిపోయిన నిమ్మ ధర
- పదిరోజుల క్రితం కేజీ రూ.40.. ఇప్పుడు రూ.15 మాత్రమే
- మద్దతు ధర ప్రకటించాలని రైతుల వేడుకోలు
- పట్టించుకోని అధికారులు

కనిగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి ప్రాంతంలో సరాసరిన 3 వేల ఎకరాల్లో రైతులు నిమ్మతోటల సాగును చేపట్టినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. దశాబ్దకాలంతో పోలిస్తే నిమ్మ సాగు ఏటికిఏడు తగ్గిపోతోంది. పదేళ్ల క్రితం కేవలం హనుమంతునిపాడు మండలంలోనే 5వేల ఎకరాలకుపైగా నిమ్మసాగు చేపట్టడంతో నిమ్మవనంగా హనుమంతునిపాడు పేరొందింది. కనిగిరి ప్రాంతం నుంచి నిమ్మకాయల బస్తాలు ముంబయ్, కలకత్తా, చైన్నైలకు ఎగుమతి అయ్యేవి. కడప, కర్నూలు ప్రాంతాల నుంచి కూడా గతంలో కౌలు రైతులు వచ్చి మండలంలో నిమ్మ సాగుచేపట్టేవారు. గడచిన పదేళ్లలో సరైన వర్షాలు లేక నిమ్మసాగుకు నీరు లేక ఎంతోమంది రైతులు తీవ్రంగా నష్టపోయి సాగుపై అనాశక్తి కనపరిచారు. నేడు పరిస్థితి భిన్నంగా మారి హనుమంతునిపాడు మండలంలో 2వేల ఎకరాల్లో మాత్రమే రైతులు నిమ్మసాగు చేపట్టారు. వెలిగండ్ల, కనిగిరి మండలాల్లో అక్కడక్కడ మరో వెయ్యి ఎకరాల్లో నిమ్మసాగు దిగిపోయింది. గడచిన ఏడాదిన్నర కాలంగా వర్షాలు పడి భూగర్భ జలాలు పెరిగి విరివిగా నిమ్మసాగుకు నీరంది పంట దిగుబడి పెరిగింది. ఈ సమయంలో మంచి రేటుతో ఆదాయాలు లభిస్తాయనుకున్న రైతులకు నిమ్మ ధరలు పడిపోయి నట్టేట ముంచింది.

ధరలు తగ్గి విలవిలలాడుతున్న నిమ్మ రైతులు

ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా ఉండగా ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. వారం రోజులుగా కిలో రూ.15 మించి ధర పలకడం లేదు. పండు నిమ్మధర కిలో రూ.10 పలుకుతోంది. ప్రస్తుతం ధర సగుటున కిలో రూ.20లకు పడిపోవటంతో సరుకు ఉన్నా కోతల కూలి కూడా రావటం లేదని రైతులు వాపోతున్నారు. కోతలు నిలిపివేస్తే కాయలు పండు బారి రాలిపోతున్నాయని రైతులు అంటున్నారు. రూ.లక్షలు పెట్టి తోటలు కౌలుకు తీసుకున్న రైతులు కుదేలవుతున్నారు. పంట పొలాల్లో 50 కేజీల బస్తా రూ.300లకు కొనుగోలు చేసి మధ్య దళారులు మార్కెట్‌లో రూ.500, రూ.600కు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని వాపోతున్నారు. ఆ విధంగా కూడా తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.



తోపుడుబండిపై నిమ్మకాయలను అమ్ముకుంటున్న కూలీ

సోలార్‌డ్రయర్స్ ద్వారా ఆదాయం పొందవచ్చు



ప్రభుత్వం సబ్సిడీ ద్వారా ఉద్యానపంటలు సాగు చేసే రైతులకు సోలార్ డ్రయర్స్‌ను అందిస్తోంది. 100 కేజీలు సామర్థ్యం కలిగిన మిషన్ రూ.3లక్షలు ఉంటుంది. రైతులకు సబ్సిడీ ద్వారా రూ.1.40లక్షకు అందిస్తోంది. నిమ్మకాయలు సాగు చేసే రైతులు ఈ మిషన్‌ను కొనుగోలు చేసుకుని నిమ్మకాయలను డ్రయర్‌లో వేస్తే నలుపురంగు చేరుకున్న నిమ్మకాయకు అబ్రాడ్ లాంటి దేశంతో పాటు విదేశాల్లో కేజీ రూ.300 వరకు గిరాకి ఉంటుంది. డ్రయర్ అయిన నిమ్మకాయలను చిన్న, చిన్న ముక్కలుగా చేసి వైజాగ్, విజయవాడ లాంటిచోట కొనుగోలు చేసుకునే కంపెనీలు ఉన్నాయి.

- విష్ణుప్రియ, హార్టికల్చర్ ఏవో



దొంగలు పగలకొట్టిన హుండీ

అర్ధరాత్రి ఆగంతకుల హల్‌చల్

- ఒకేరాత్రి 5 ఆలయాల్లో చోరీ
- కోదండరామాపురం, అన్నపురెడ్డిపల్లి, అడవిలోపల్లి గ్రామాల్లో కలకలం

పీసీపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న పీసీపల్లి మండలంలో ఆగంతకుల హల్‌చల్‌తో మంగళవారం రాత్రి కలకలం రేగింది. కోదండరామాపురం, అన్నపురెడ్డిపల్లి, అడవిలోపల్లి గ్రామాల్లోని 5 దేవాలయాల్లో మంగళవారం అర్ధరాత్రి దుండగులు చోరీలకు పాల్పడి స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. ఆలయాల తలుపులు పగలకొట్టి హుండీలను ధ్వంసంచేసి అందులోని నగదు, కొంత బంగారాన్ని ఎత్తుకెళ్లారు. మండలంలోని అడవిలోపల్లిలో ఉన్న అమ్మవారి గుడి, రామాలయంలో తలుపుల తాళాలు పగలగొట్టిన దొంగలు ఆ రెండు ఆలయాల్లో ఉన్న అమ్మవారి తాళిబొట్లను చోరీ చేశారు. హుండీలను గుడికి దూరంగా తీసుకెళ్లి వాటిని పగలకొట్టి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లిపోయారు. అన్నపురెడ్డిపల్లి గ్రామంలో ఉన్న రామాలయం, బ్రహ్మంగారి గుళ్లలో చొరబడిన దుండగులు అక్కడ ఉన్న హుండీలలోని నగదును, బంగారాన్ని ఎత్తుకెళ్లారు. కోదండరామాపురం గ్రామంలోని ఆంజనేయస్వామి గుడిలో చొరబడ్డ దొంగలు అక్కడ హుండీలో ఉన్న సుమారు రూ.40వేలు నగదును దోచుకుని వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న కనిగిరి సీఐ శ్రీనివాసులు, పీసీపల్లి ఎస్సై కోటయ్య తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాలకు చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంను పిలిపించి హుండీలపై ఉన్న వేలిముద్రలను సేకరించారు. దొంగల ఆనవాళ్ల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఒకేరోజు రాత్రి వరుసగా 5 దేవాలయాల్లో దొంగలు చోరీకి పాల్పడడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దుండగులను గుర్తించేందుకు సీసీటీవి ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

పల్స్‌పోలియోపై శిక్షణా తరగతులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 21వ తేదీ నుంచి జరగనున్న పల్స్ పోలియో నిర్వహణపై స్థానిక సర్వజన మెడికల్ కాలేజీలో సోమవారం వైద్యాధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వేలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవానీ పల్స్‌పోలియోపై శిక్షణ ఇచ్చారు. ఈనెల 21వ తేదీన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్టాండ్‌లు, సచివాలయాలు, మొబైల్ వాహనాల ద్వారా జీరో నుంచి ఐదేళ్లలోపు పిల్లందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. ఈనెల 22,23 తేదీల్లో ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. అందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రతినెల 1వ తేదీనే జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఖజానా, లెక్కల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెజరీ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షుడు కాజారాజ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు లక్షల మంది ఉద్యోగులు, మూడున్నర లక్షల మంది పెన్షనర్లు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రతినెలా రూ.6వేల కోట్లు జీతాలు, పెన్షన్లకు చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటికే రూ.5,500 కోట్లమేర ప్రభుత్వం చెల్లింపులు చేసిందన్నారు.అ యితే మరో రూ.500 కోట్లు చెల్లిస్తే ఉద్యోగుల జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ చెల్లింపులు పూర్తవుతుందని తెలిపారు. వచ్చే ఏడాది నుంచైనా ప్రభుత్వం 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పింఛన్లు చెల్లింపులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రాజ్‌కుమార్ కోరారు.

వైపాలెం పోలీసు అధికారులకు ఎస్పీ క్లాస్

- ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని హితవు

ఒంగోలు క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు యర్రగొండపాలెం సర్కిల్ పోలీసు అధికారులకు క్లాస్ పీకారు. ఈనెల 7న తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం నియోజకవర్గం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పుట్టినరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు విధులను పక్కన పెట్టి టీడీపీ నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్పీ హర్షవర్ధనరాజు వైపాలెం సీఐ అజయ్‌కుమార్, ఎస్సైలు సంపత్‌కుమార్, చౌడయ్య, మహేష్‌లను మంగళవారం ఎస్పీ కార్యాలయానికి పిలిపించారు. పోలీసు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితులకు భరోసా కల్పించేలా చర్యలు చేపట్టి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని హితవు పలికారు.

అర్హులకు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలి

- జేసీ గోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి యోజన పథకం కింద ఎల్‌పీజీ గ్యాస్‌లేని నిరుపేద కుటుంబాలకు గ్యాస్ సిలెండర్లు మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. జిల్లాలో అర్హులైన వారి జాబితాను రూపొందించి ఈకేవైసీ పూర్తిచేసి గ్యాస్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో బుధవారం గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో జేసీ మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఐవీఆర్ఎస్ గ్యాస్ డెలవరీ బాయ్స్ ప్రవర్తన బాగున్నదా? లేదా? అని ఫోన్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తుందని తెలిపారు. ఈ సర్వేలో ప్రతిగ్యాస్ ఏజెన్సీలపై ప్రవర్తన బాగాలేదని ఫీడ్‌బ్యాక్ వస్తుందన్నారు. అందువల్ల డెలివరీ బాయ్స్‌ను మార్చడంతో కొంతమేర తగ్గిందని, ఇంకా సమస్య ఉన్నందున ఏజెన్సీలు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్‌వో పద్మశ్రీ, ఆయిల్ కంపెనీ సెల్స్ అధికారి రోహితాష్ బాగోరియా, సహాయ సరఫరా అధికారి పుల్లయ్య, జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు ఉన్నారు.

ఎంఎస్ఎంఈ పార్క్‌కు కేటాయించిన భూమి పరిశీలన



ఎంఎస్ఎంఈ పార్క్‌కు కేటాయించిన భూమి మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ

కొండపి, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెన్నూరుపాడులో ఎంఎస్ఎంఈ పార్క్‌కు కేటాయించిన సర్వే నంబర్ 433లోని 44.31సెంట్ల భూమిని జేసీ గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. భూమిని పార్క్‌కు అనుకూలంగా రికార్డు పరంగా కేటాయించడంతోపాటు, అనువుగా మర్వే కార్యక్రమంలో భాగంగా జేసీ ఫీల్డ్ మ్యాపు, స్థలాన్ని భౌతికంగా పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామస్థులు, అధికారులతో మాట్లాడారు.



విద్యార్థులకు తెలుగు పదాలు నేర్పుతూ

తెలుగుకు సూర్యకళ!

అమ్మను మించిన దైవం, అమ్మభాషకు సమానమైన అమృతం లేదంటారు. అటువంటి అమ్మభాష తెలుగుకు ప్రస్తుతం లభిస్తున్న ఆదరణ అంతంత మాత్రమే. ఇలాగే కొనసాగితే కొన్ని దశాబ్దాల తర్వాత తెలుగు భాష వెలుగులు కోల్పోయే ప్రమాదం ఉందని గ్రహించిన విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు తెలుగు లిపిని కాపాడేందుకు నడుం బిగించారు. స్వతహాగా ఆమె రచయిత్రి కూడా కావడంతో తెలుగు భాష పట్ల నేటి తరం విద్యార్థులలో ఆసక్తిని పెంపొందించాలని, భావితరాలకు తెలుగు లిపిని అందించాలని తలపెట్టి తనవంతుగా 'తెలుగు లిపిని కాపాడుదాం(తెలికా)' సంస్థను స్థాపించారు. ఈ సంస్థ ద్వారా ఒక విధంగా తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమాన్నే జిల్లాలో నిర్వహిస్తున్నారు ఒంగోలుకు చెందిన మారేపల్లి సూర్యకుమారి.

-ఒంగోలు కల్చరల్ (ఆంధ్రజ్యోతి)

- విద్యార్థుల్లో మాతృభాష పట్ల ఆసక్తి పెంచుతున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు
- ఇందుకోసం తన నెలవారీ పింఛన్ ఖర్చు చేస్తున్న వైనం
- జిల్లాలో పలు పాఠశాలల్లో వివిధ కార్యక్రమాల నిర్వహణ

అవిశ్రాంతంగా అడుగులు వేస్తూ

ఒంగోలుకు చెందిన 78 సంవత్సరాల మారేపల్లి సూర్యకుమారి వృత్తిరీత్యా చేకూరపాడు శ్రీ వేణుగోపాలస్వామి సంస్కృత ఉన్నత పాఠశాలలో ఆంగ్లం, సైన్స్ ఉపాధ్యాయినిగా అనంతరం ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేశారు. 2005వ సంవత్సరం ఆగస్టులో పదవీవిరమణ చేసిన ఆమెకు చిన్నతనం నుంచి తెలుగుభాష పట్ల ఎంతో మక్కువ. దీనితో ఆమె రచయిత్రిగా ఎన్నో కవితలు, పుస్తకాలు రచించారు. గత సంవత్సరం ఆగస్టులో 'తెలుగు లిపిని కాపాడుదాం (తెలికా)' అనే సంస్థను స్థాపించారు.

గ్రామీణ విద్యార్థులే లక్ష్యంగా

తెలుగు లిపిని కాపాడాలంటే అందుకు ముఖ్యంగా విద్యార్థి దశ ఎంతో కీలకమని భావించిన సూర్యకుమారి గ్రామీణ ప్రాంత విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్నారు. తాను పనిచేసిన చేకూరపాడు, కొత్తపట్నం మండలంలోని గవండ్లపాలెం, రాజుపాలెం, యానాదికాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఒంగోలు వడ్డెపాలెంలోని పురపాలక ప్రాథమిక ఉన్నతపాఠశాల, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు మండలాలలోని పాఠశాలలో విద్యార్థులకు తెలుగు అక్షర వర్ణమాల మొదలు పద్యాలు, బాలగేయాలు నేర్పిస్తూ ముందుకు సాగుతున్నారు సూర్యకుమారి. ప్రస్తుతం ఆరుగురు మహిళలు ఆయా పాఠశాలల్లో వాలంటీర్లుగా పనిచేస్తుండగా వారికి తన నెలవారీ పింఛన్ నుంచి ఒక్కొక్కరికీ నెలకు రు.2 వేలు చొప్పున రు.12 వేలు జీతంగా ఆమె ఇస్తున్నారు. ఎనిమిది పదుల వయసులోనూ తెలుగు భాషను, లిపిని కాపాడటానికి మారేపల్లి సూర్యకుమారి చేస్తున్న కృషిని పలువురు భాషాభిమానులు కొనియాడుతున్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సూర్యకుమారి

విద్యార్థుల స్పందన అద్భుతం



'తెలుగు లిపిని కాపాడుదాం' సంస్థ ద్వారా నేను చేస్తున్న ప్రయత్నానికి విద్యార్థుల నుంచి చాలా బాగా స్పందన వస్తోంది. తమ పిల్లలు తెలుగు లిపిని, పద్యాలను, గేయాలను నేర్చుకోవటం పట్ల తల్లిదండ్రులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నా కార్యక్రమాలను గుర్తించిన పలువురు నా పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి ఇటీవల ధనరూపంలో, వస్తురూపంలో సహాయం అందిస్తున్నారు. వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నాను.

-మారేపల్లి సూర్యకుమారి

గెలాక్సీ గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా శిద్దా సుధీర్‌కుమార్



సుధీర్‌కుమార్ సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గెలాక్సీ గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా శిద్దా సుధీర్‌కుమార్ ఎన్నికయ్యారు. ఒంగోలులోని కేబీ రెస్టారెంట్‌లో బుధవారం రాత్రి అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా శిద్దా సుధీర్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా అనంతరం ఆయన ప్రమాణ స్వీకారం అట్టహాసంగా నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా శ్రీధర్ ఆనంద్, శిద్దా భరత్, శిల్పారెడ్డి, జనరల్ సెక్రటరీగా రవిచంద్రన్, జాయింట్ సెక్రటరీగా భాస్కర్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, ట్రెజరర్‌గా బదరీనారాయణతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం జరిగిన సభలో నూతన అధ్యక్షుడు సుధార్ కుమార్ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో రావిపూడి లక్ష్మీనారాయణ, కె.సుబ్బారెడ్డి, సురేంద్రరెడ్డి, శిద్దా హనుమంతరావు, ఎం.శివరామ్, అజీమ్, చంద్రారెడ్డి, మైనింగ్‌శాఖ అధికారులు రాజశేఖర్, రామచంద్ర, వర్మ తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు : డీఏవో



మాట్లాడుతున్న డీఏఈవో శ్రీనివాసరావు

మద్దిపాడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు విత్తన శుద్ధి చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం దొడ్డవరం గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డీఏవో మాట్లాడుతూ దొడ్డవరంలో వరి విత్తన కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వరి కోతలు అనంతరం కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మాలన్నారు. ఎ గ్రేడ్ ధర క్వింటాకు రూ.2,389, సాధారణ రకం రూ.2,369కి ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందని చెప్పారు. ఒంగోలు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.రమేష్ బాబు మాట్లాడుతూ రబీకాలంలో సాగుచేసిన పంట వివరాలను గ్రామాల్లోని వీఏఏల ద్వారా ఈక్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. ఏవో జి.స్వర్ణలత మాట్లాడుతూ శనగ సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏవో పి.ప్రవీణ్‌కుమార్, ఏఈవో శేషయ్య, వీఏఏ రవితేజ, రైతులు పాల్గొన్నారు.

నగరంలో కదిలిన ట్రాఫిక్ పోలీసులు

● రోడ్లపై ఆక్రమణల తొలగింపు


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రోడ్లపై ఆక్రమణలు తొలిగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఒంగోలు క్రైం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని రహదారులపై ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు బుధవారం తొలగించారు. ఆంధ్రజ్యోతిలో ప్రచరితమైన అడ్డగోలు ఆక్రమణలు అనే కథనంపై ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. నగరంలో కర్నూల్‌రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి వర్మ హోటల్ వరకు, మస్తాన్ దర్గా నుంచి కొత్తపట్నం బస్టాండ్ వరకు రోడ్లపై ఉన్న ఆక్రమణలను ట్రాఫిక్ సీఐ జగదీష్ ఆధ్యరంలో సిబ్బంది తొలగించారు. అదే విధంగా కొంతమందికి రోడ్డును ఆక్రమించి ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించిన వారిపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమలో ట్రాఫిక్ ఎస్ఐలు మాల్యాద్రి, కోటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి సహకారం : చైర్మన్


చైర్మన్ రావి నాయుడును సత్కరిస్తున్న ఖోఖో అసోసియేషన్ ప్రతినిధులు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని శాప్ చైర్మన్ రావి నాయుడు పేర్కొన్నారు. ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మడక ప్రసాద్, ప్రధాన కార్యదర్శి హనుమంతరావుతోపాటు, రాష్ట్ర చైర్మన్ బాచిన చెంచుగరటయ్య, ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు సీతారామిరెడ్డి బుధవారం విజయవాడలో శాప్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అభినందించిన రావినాయుడు వారితో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా క్రీడాకారులను వ్యాయామోపాధ్యాయులుగా మెగా డీఎస్సీ ద్వారా నేరుగా నియమించారన్నారు. అంతర్జాతీయ, జాతీయ వేదికలలో క్రీడల ద్వారా ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని చాటి, విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఇప్పటికే రూ.19 కోట్లు ప్రోత్సాహంగా విడుదల చేసిందని చెప్పారు. త్వరలోనే ప్రతి జిల్లాలో ఒక క్రీడా అకాడమీని ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని రావి నాయుడు తెలిపారు. ప్రకాశం జిల్లాలో ఖోఖో అకాడమీ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ వ్యాయామోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు వై.శీనయ్య, ఖోఖో జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంలో యువకుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు

చీమకుర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చంద్రపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఏలూరివారిపాలెంకు చెందిన అనపర్తి రవికుమార్(35) చంద్రపాడుకు చెందిన మహిళను వివాహం చేసుకొని గత కొంతకాలంగా ఇక్కడే నివసిస్తూ కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ప్రభుత్వం చేపట్టిన జలరక్ష కార్యక్రమంలో భాగంగా చంద్రపాడు జడ్పీ ఉన్నతపాఠశాల ఓవర్ హెడ్ ట్యాంకు క్లీనింగ్ చేసేందుకు రవికుమార్‌తో పాటు మరో ఇద్దరిని పనికి కుదుర్చుకున్నారు. వీరిలో రవికుమార్ ట్యాంకు ఎక్కే క్రమంలో పక్కనుంచే వెళ్తున్న 11కేవీ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న డిప్యూటీ డీఈవో చంద్రమౌశేశ్వరరావు, ఎంఈవో శివాజీ మృతదేహాన్ని సందర్శించారు. సీఐ సుబ్బారావు ఆదేశాలు మేరకు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు పాఠశాలకు వెళ్లి సంఘటనను విచారించారు. కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

హిందీ మెటీరియల్ ఆవిష్కరణ


మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో హిందీలో విద్యార్థులు మెరుగైన మార్కుల సాధన కోసం కొత్తపట్నం హైస్కూలు హిందీ ఉపాధ్యాయుడు పల్లె కృష్ణమూర్తి రూపొందించిన హిందీ మెటీరియల్‌ను డీఈవో కిరణ్‌కుమార్ ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో బుధవారం ఈ మెటీరియల్‌ను ఆయన విడుదల చేసి అభినందించారు. హిందీ పాఠ్యపుస్తకం ఆధారంగా తయారు చేసిన ఈ మెటీరియల్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేందుకు దోహదపడుతుందని తెలిపారు. గ్రామీణ, పట్టణ విద్యార్థుల మధ్య అంతరాన్ని తగ్గించడం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన మార్కులు సాధించేందుకు ఈ మెటీరియల్ దోహదపడుతుందని డీఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనంపాడు డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు, ఉపాధ్యాయులు యలగాల సంజీవరావు, కర్ర దేవసహాయం, ఊటికొండ చంద్రశేఖర్, ఖాన్, మ్యాథ్స్ కోచింగ్‌సెంటర్ డైరెక్టర్ పఠాన్ అహ్మద్‌ఖాన్, బొజ్జా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే క్వారీయింగ్ చేపట్టాలి

ఆదాయంతోపాటు పర్యావరణహితంగా గనుల నిర్వహణ ● కలెక్టర్ రాజాబాబు

మిడ్‌వెస్ట్ క్వారీ, కృష్ణసాయి ఫ్యాక్టరీలను ఎమ్మెల్యే బీఎన్‌తో కలిసి పరిశీలన ● చీమకుర్తి హైస్కూల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ

పాటిమీదపాలెంలో స్క్రబ్ టైఫస్‌పై అవగాహన


మిడ్‌వెస్ట్ క్వారీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే విజయ్‌కుమార్, అధికారులు

చీమకుర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో నిర్వహించే కార్యకలాపాలు ప్రజలకు ఇబ్బంది లేకుండా ఓనర్లు నిబంధనల మేరకు నడుచుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబు కోరారు. బుధవారం చీమకుర్తి మండలంలో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌తో కలిసి ఆయన సుడిగాలి పర్యటన చేశారు. తొలుత రామతీర్థం వద్ద ఉన్న ఏపీ మిడ్‌వెస్ట్ గెలాక్సీ గ్రానైట్ క్వారీని పరిశీలించారు. పిట్‌లోకి వెళ్లి ప్రపంచప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ ముడిరాయి వెలికితీత ప్రక్రియను గమనించారు. తర్వాత క్రిష్ణసాయి కటింగ్ ఫ్యాక్టరీకి వెళ్లి ముడిరాయి కటింగ్, పాలిషింగ్ ప్రక్రియను పరిశీలించారు. మైన్స్ డీడీ రాజశేఖర్ గ్రానైట్ కార్యకలాపాల వివరించారు. తదుపరి జరిగిన ప్రెస్‌మీట్‌లో కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ మైనింగ్ కార్యకలాపాల ద్వారా గత ఏడాది రూ.180కోట్లు ఆదాయం రాగా ఈ ఏడాది రూ.220కోట్లు లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. క్వారీ ఓనర్లకు ఎటువంటి సమస్యలు ఎదురైనా వాటిని పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లపుడు ముందుంటుందన్నారు. మిడ్‌వెస్ట్ గనిలో కార్యకలాపాలు పక్కాగా నిర్వహిస్తున్నారని, మిగతా క్వారీలు కూడా నిబంధనలు పాటిస్తూ నిర్వహించాలని చెప్పారు. గ్రానైట్ వేస్ట్‌ని కాలుష్యం సమస్య తలెత్తకుండా డంప్ చేసుకోవాలని, దీనికోసం స్థలం కేటాయిస్తామని పేర్కొన్నారు. గనుల్లో పనిచేసే కార్మికుల ఆరోగ్యంపై ఓనర్లు దృష్టిసారించాలని కోరారు. రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించటంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు.

రుచిగా మధ్యాహ్నభోజనం..

చీమకుర్తిలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో మధ్యాహ్నభోజన పథకాన్ని ఎమ్మెల్యే బీఎన్, కలెక్టర్ రాజాబాబు తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రుచి, శుచిగా మెనూను పాటిస్తూ భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులతో ముచ్చటించారు. విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఫిజిక్స్‌లో వెనుకబాటుతనంపై ప్రశ్నించగా ఉపాధ్యాయుల కొరత ఉందని తెలుసుకొని వెంటనే ఈ సమస్యను అధిగమించే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇక పట్టణంలోని గరికమెట్లలో ఉన్న ఎస్టీ గురుకుల పాఠశాలను కలెక్టర్, ఎమ్మెల్యే సందర్శించారు. విద్యాలయంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, బోధనా విధానాన్ని పరిశీలించారు. సిలబస్ ఎంతమేర పూర్తయింది, స్టడీఓవర్లు నిర్వహణపై విద్యార్థులను ప్రశ్నించారు. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవటంపై అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించారు.

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తత అవసరం..

పాటిమీదపాలెం గ్రామంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలను పరిశీలించారు. ప్రజలందరూ అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని, అనవసర భయాందోళనలు వద్దని తెలిపారు. గ్రామంలో చేపడుతున్న జల సురక్ష కార్యక్రమాలను పరిశీలించారు. తాగునీటి సరఫరా సరిగ్గా జరుగుతుందా లేదా అని గ్రామస్థులను వాకబు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

15,16 తేదీల్లో మహాధర్నా, పార్లమెంట్ ముట్టడి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శంకరరావు, నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, చట్టసభల్లో ఓబీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15, 16వ తేదీల్లో ఢిల్లీలో మహాధర్నాతో పాటు పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు తెలిపారు. ఒంగోలులోని బీసీ సంక్షేమ కార్యాలయంలో బుధవారం చలో పార్లమెంట్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ రిజర్వేషన్లు కేటాయించే బిల్లులను ఈ శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా చట్టాలను చేయాలన్నారు. మొత్తం రిజర్వేషన్లు 50శాతం మించకూడదన్న సుప్రీంకోర్టు పరిమితి అసంబద్ధమైదని, దానిని అధిగమించేందుకు పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. ఎవరు అడగకపోయినా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పేరుతో అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్లు కేటాయించేందుకు 103వ రాజ్యాంగ సవరణ చేసి కేంద్రం చట్టం చేసిందన్నారు. అలాంటప్పుడు అనేక దశాబ్దాలుగా పోరాడుతున్న ఓబీసీ రిజర్వేషన్లను కూడా అవసరమైన మేరకు రాజ్యాంగ సవరణలుచేసి జనాబా దామాషా ప్రకారం చట్టబద్ధ రిజర్వేషన్ కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఢిల్లీలో జరిగే కార్యక్రమాల్లో బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుమ్మరి క్రాంతికుమార్, చలపతిరావు, గోగు శివుడు, తన్నీరు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, బోదనం శ్రీనివాసరావు, దోగిపర్తి సుబ్బారావు, బీకే.మూర్తి, చంద్రశేఖర్, బాలకృష్ణ, పిల్లి మధు, రాజేంద్రప్రసాద్, మురళి పాల్గొన్నారు.

ప్రతిరోజూ వ్యాయామంతో శారీరక దృఢత్వం

● ఎమ్మెల్యే బీఎన్


5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వం పెంపొందుతుందని ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్ సూచించారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో తేళ్ల రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం చదలవాడ గ్రామంలోని చతుర్వాటిక వద్ద నుంచి నాగులుప్పలపాడు బస్టాండ్ వరకు నిర్వహించిన 5కే రన్‌ను ఎమ్మెల్యే బీఎన్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో జీవిస్తున్న మనం నిత్యం నడక, వ్యాయామం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తద్వారా శరీరం నూతనోత్తేజం సంతరించుకుంటుందని చెప్పారు. 5కే రన్ నిర్వహించిన ఎంపీడీవో రవికుమార్‌ను అభినందించారు. పరుగు పోటీలో బి.నిడమానూరు హైస్కూల్ ఎన్‌సీసీ కోచ్ నన్నెబోయిన వెంకటప్పయ్య ముందంజలో ఉండి ప్రథమ బహుమతి సాధించారు. అనంతరం నాగులుప్పలపాడు బస్టాండ్ వద్ద మానవహారం చేశారు. జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద పరుగుపోటీలో విజేతలకు ఎంపీడీవో బహుమతులను అందజేశారు. మానవ హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంఈవోలు రవి, రమణయ్య, డిప్యూటీ ఎంపీడీవో ఆశాజ్యోతి, ఏపీవో రవిబాబు, ఏపీఎం నరేంద్ర, టీడీపీ మండలాధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, నాయకులు నందిగం కోటయ్య, తెలగతోటి జాన్సన్, బి.బ్రహ్మారాజు, మెట్టు సుబ్బయ్య నాయుడు, స్వర్ణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మిరపలో తెల్లనల్లి పట్ల అప్రమత్తంగా ఉండాలి

● శాస్త్రవేత్త రవీంద్రబాబు


కండ్లగుంటలో మిరప పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రవీంద్రబాబు

నాగులుప్పలపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిరప పంటలో తెల్లనల్లి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ యూనివర్శిటీ ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త రవీంద్రబాబు సూచించారు. బుధవారం మండలంలోని నాగులుప్పలపాడు, కండ్లగుంట గ్రామాల్లో సాగుచేసిన మిరప పంటలను ఆయన ఉద్యానశాఖ జిల్లా అధికారి గోపీచంద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మిరప పంటలపై రసం పీల్చే తామర పురుగులు, తెల్లనల్లి ఉధృతి ఎక్కువగా కనిపిస్తుందన్నారు. వాటి నివారణకు పసుపు, నీలిరంగు జిగురు అట్టలను పొలం చుట్టూ రెండు వరసలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఎర పంటగా జొన్న, మొక్కజొన్న పొలం మధ్యలో విత్తుకోవాలని సూచించారు. తామర పురుగు నివారణకు ఫిప్రోనిల్ 2 ఎంఎల్, పెంతురియాన్ 1.25 ఎంఎల్, సైపానోపాడ్ 0.25ఎంఎల్, తెల్లనల్లి నివారణకు స్పైరోమెనిఫిస్ 1 ఎంఎల్ గాని ప్రాపర్గైట్ 2 ఎంఎల్, పెన్‌పైరాక్సీమేట్ 1 ఎంఎల్ లీటరు నీటికి కలిసి పిచికారి చేయాలని చెప్పారు. పురుగుమందులను వారానికి మార్చి వాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ ఏవో డి.సంధ్య, సహాయకులు కె.ప్రగతి, బి.పద్మిని, జనిత, ప్రసన్నలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పొన్నలూరు కాలేజీ వార్షికోత్సవం

పొన్నలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పొన్నలూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకుడు మండవ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రిన్సిపాల్ జి.రాజేంద్రబాబు మాట్లాడుతూ కళాశాల ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిందన్నారు. ఇక్కడ చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నతస్థాయిలో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీటీసీ గంధం స్వప్న, ఎంఈవో రవిచంద్రబాబు, టీడీపీ మండల నాయకులు మండవ మురళీమోహన్, పల్లపోతు రమేష్‌బాబు, హెచ్‌ఎం వై.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి నగరోత్సవం

చీమకుర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో వేంచేసి ఉన్న అయ్యప్పస్వామి నగరోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో జరిగిన విశేషపూజల్లో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. రాత్రివేళ నిర్వహించిన నగరోత్సవంలో చిన్నారులు, సర్వదీక్షాస్వాములు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలి

ఒంగోలు(రూరల్), డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): గ్రామస్థులకు పరిశుభ్రమైన తాగునీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో రాజశేఖరరావు తెలిపారు. బుధవారం ఒంగోలు మండలం మండవవారిపాలెం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ చెరువు దగ్గర గల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకును శుభ్రం చేయించారు. అక్కడి పరిసరాలను పరిశుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే సరఫరా చేయాలన్నారు. గ్రామంలో జ్వరాలు ఉంటే ఎంపీడీవో కార్యాలయానికి తెలపాలని కోరారు. సైడుకాలువల్లో చెత్తాచెదారం పడవేయవద్దని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన వసతిగృహంలో సౌకర్యాలు కల్పించాలి

● డీఆర్వో చిన ఓబులేశు

ఒంగోలు నగరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని గిరిజన బాలుర వసతి గృహంలో ఉన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించాలని డీఆర్వో చిన ఓబులేశు అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి ఒంగోలులోని గిరిజన బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను తెలియజేశారు. స్నానాలకు సకాలంలో నీరు రావటం లేదని, వర్షం పడినప్పుడు శ్లాబు ఉరుస్తుందని, పారిశుధ్యం సక్రమంగా ఉండటం లేదని డీఆర్వోకు చెప్పారు. వెంటనే సమస్యల పరిష్కారం దిశగా తగిన చర్యలు చేపట్టాలని గిరిజన సంక్షేమశాఖాధికారి వరలక్ష్మిని ఆయన ఆదేశించారు. అంతకుముందు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని పరిశీలించారు. హాస్పిటల్‌లో పారిశుధ్యం గతం కంటే మెరుగ్గా ఉందని చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, రిమ్స్ సూపరింటెండెంట్ మాణిక్యరావు పాల్గొన్నారు.

అయ్యవారయ్యకు నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

జమ్ములపాలెం (కొండపి), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు జడ్పీటీసీ మాజీ సభ్యుడు, పొగాకు బోర్డు మాజీ మెంబర్ రావూరి అయ్యవారయ్య వర్ధంతిని ఆయన స్వగ్రామమైన టంగుటూరు మండలం జమ్ములపాలెంలో బుధవారం నిర్వహించారు. అయ్యవారయ్య విగ్రహాలకు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన నిబద్ధత కలిగిన నాయకుడని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో అయ్యవారయ్య కుమారుడు రావూరి వెంకటప్రవీణ్‌కుమార్, విగ్రహ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు ప్రజలకు అందేలా చూడాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి వాటి ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజాఫిర్యాదుల విభాగం కార్యదర్శి రచనాసింగ్ సూచించారు. ఈ క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని తెలిపారు. బుధవారం ఢిల్లీ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సుపరిపాలన వారోత్సవాల్లో భాగంగా ఈనెల 19నుంచి 25వతేదీ వరకు నిర్వహించే ప్రశాసన్ గా ఓం కీ వోరే కార్యక్రమంలో ఈ దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు, ఎస్‌పీసీ డీపీవో రవి పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పనులను పునఃప్రారంభించాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్ల నిర్మాణాలను వెంటనే పునః ప్రారంభించాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఒంగోలు నగర పరిధిలోని చింతల, కొప్పోలు ప్రాంతాల్లో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం టిడ్కో ద్వారా ప్రారంభించి రూపాయికి అందజేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఆ హామీని అమలు చేయాలని కోరారు. అర్హులైన దళితులు, గిరిజనులు బలహీనవర్గాలకు చెందిన పేద కూలీలు అని, అందువల్ల వెంటనే నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

విద్యుత్ కనెక్షన్ కోసం డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు : ఏఈ

కొండపి, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ప్రజలు విద్యుత్ కనెక్షన్ కోసం సిబ్బందికి కానీ, మధ్యవర్తులకు కానీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని ఏఈ పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. తాను ఐదు నెలల క్రితం ఇక్కడ బాధ్యతలు చేపట్టానన్నారు. ఎవ్వరినీ డబ్బులు అడగలేదన్నారు. విద్యుత్ కనెక్షన్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యతా క్రమంలో ఇస్తామని తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే తన సెల్ నంబర్: 94408 17498 కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

హైస్కూల్‌కు కుర్చీల బహూకరణ

పొన్నలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పొన్నలూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు బుధవారం పాఠశాల పూర్వ విద్యార్థులు కొర్రపాటి ప్రసాద్, శోభన, వెలగపూడి వాసవితోపాటు బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థ కలిసి రూ.21 వేల విలువైన కుర్చీలను అందజేశారు. వీరందరికీ ప్రధానోపాధ్యాయుడు వై.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం బినిడి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

కొండపి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని మద్దులూరు రోడ్డులో ఉన్న ఓ రేకుల షెడ్డులో నడుస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఐగుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద రూ.2,270 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

కొండపి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు మండలస్థాయి ఆటల పోటీలను కె.ఉప్పలపాడులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో బుధవారం నిర్వహించారు. తొలిరోజు పురుష టీచర్లకు క్రికెట్, ఉపాధ్యాయినిలకు త్రోబాల్ పోటీలు ఏర్పాటు చేశారు. వీటిలో ప్రతిభ చూపిన వారిని డివిజన్‌స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఎంఈవోలు పి.రామారావు, కె.సురేఖ తెలిపారు.

రేపు ఎన్‌సీసీ ఆఫీసర్స్ సమావేశం


వీసీ మూర్తికి ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న దేవ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో ఈనెల 12వతేదీన ఎన్‌సీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎన్‌సీసీ కోఆర్డినేటర్ మండే హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ తెలిపారు. బుధవారం విశ్వవిద్యాలయం ఉపకులపతి, ప్రొఫెసర్ డీవీఆర్.మూర్తిని కలిసి సమావేశానికి రావాలని కోరుతూ ఆహ్వానపత్రాన్ని అందజేశారు. అదే విధంగా రిజిస్ట్రార్ బి.హరిబాబు, కాలేజీ ప్రిన్సిపాల్ నిర్మలామణి తదితరులకు ఆహ్వానపత్రాలను అందించారు. ఈ కార్యక్రమానికి యూనివర్శిటీ అనుబంధ కళాశాలల ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


అమ్మనబ్రోలులో జీవో ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను కాలరాసే విధంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు కె.ఉమామహేశ్వరరావు, ముజఫర్‌హమ్మద్, దయా రమాదేవి డిమాండ్ చేశారు. ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్టణంలో జరిగే ఆలిండియా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం ఉప్పుగుండూరులో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టం, విద్యుత్ బిల్లులను సవరిస్తూ తీసుకొచ్చిన జీవోను రద్దు చేయాలని కోరుతూ రైతు సంఘాల ఆధ్వర్యంలో అమ్మనబ్రోలులో బుధవారం రాత్రి జీవో ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు తూబాటి శ్రీకాంత్, నలతోటి రామారావు, కె.శ్రీనివాసరావు, రావెళ్ల వెంకట్రావు, చెరుకూరి వాసు, ప్రభుదాసు, గాదె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలపై ప్రభుత్వం చిన్నచూపు

● మాజీ మంత్రి మేరుగ నాగార్జున

మద్దిపాడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలపై కూటమి ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. బుధవారం మద్దిపాడులో వైసీపీ నియోజకవర్గ స్థాయి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. వైఎస్.జగన్మోహనరెడ్డి నిర్మాణం చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దారుణంగా ఉందన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజల నుంచి కోటి సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీలు వాకా అరుణ, యద్దనపూడి శ్రీనివాసరావు, నల్లమలపు అంజమ్మ, కృష్ణారెడ్డి, దుంపా చెంచిరెడ్డి, వేమ శ్రీనివాసరావు, ఎన్నగంటి పిచ్చిరెడ్డి, మారెళ్ల బంగారుబాబు, నట్టే సంజీవరావు, మోరబోయిన సంజీవరావు, దుడ్డు వినోద్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సామూహికంగా పారాయణం

గిద్దలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత శ్లోక పారాయణాన్ని మహిళలు సామూహికంగా చేపట్టారు. కోటి శ్లోక పారాయణం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయం, పాత బద్వేలు రోడ్డులోని రామాలయాలలో మహిళలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈనెల 15వ తేదీ వరకు సామూహిక పారాయణ కార్యక్రమం జరుగుతుందని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

జిల్లా ఏర్పాటుతోనే అభివృద్ధి

పొదిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి సాధ్యమవుతుందని ఏఎంసీ చైర్మన్ ఇమాంసాహెబ్ చెప్పారు. బుధవారం మండలంలోని మూగచింతల గ్రామంలో చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు దోర్నాల అంజిరెడ్డి, మాదిరెడ్డిపాలెం సొసైటీ చైర్మన్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల కార్యదర్శి కాటూరి శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు ఖుద్దూస్, మునిశ్రీను, తానికొండ వెంకట్రావు, కాలేషా పాల్గొన్నారు.

కంది పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారి


కంది పంటను పరిశీలిస్తున్న ఏవో ప్రకాశ్‌రావు

కొనకనమిట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొనకనమిట్ల గ్రామంలో కందిపంటలను బుధవారం వ్యవసాయ అధికారి ప్రకాశరావు పరిశీలించారు. ఈకార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు నవీన్ పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోండి

రాచర్ల, డిసెబరు 10 (ఆంధ్రజ్యోతి) : శనగ, మొక్కజొన్న పంటల్లో తెగుళ్ల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో మహబూబ్ బాషా చెప్పారు. ఎడవల్లి, సత్యవోలు గ్రామాల్లో రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ నందిని, రామేశ్వరి పాల్గొన్నారు.

అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, భావప్రకటన హక్కులు సమానం

కంభం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మానవులందరికీ స్వేచ్ఛ, సమానత్వం, భావప్రకటన లాంటి ఉన్నాయని, ప్రతి వ్యక్తి సమాజంలో ఒక సభ్యుడుగా అనుభవించే కనీస హక్కులనే మానవ హక్కులు అంటారని ఎంఈవోఅబ్దుల్ సత్తార్ చెప్పారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

నీళ్ల ట్యాంకులను శుభ్రం చేయించిన అధికారులు


కుళాయి వద్ద శుభ్రం చేస్తున్న కార్మికులు

తర్లుపాడు, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): జల సురక్ష మాసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కలుజువ్వలపాడు, రాగిసుముద్రం, మేకలవారిపల్లి గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేశారు. ట్యాంక్ పరిసరాల్లో ఉన్న జంగిల్‌ను కూడా శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శిఖామణి, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి విళక్కి ఉత్సవం



రాచర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్పందన విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి విళక్కి ఉత్సవ కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. దేవస్థానం కమిటీ, దీక్షాధారులు ముందుగా మెట్ల పూజ చేశారు. అనంతరం అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ప్రత్యేక పల్లకిపై ఉంచి గ్రామంలోని పురవీధులలో ఊరేగించారు. స్వామివారికి భక్తులు, గ్రామ ప్రజలు కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, దీక్షాధారులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి కనిపించకుంటే కళ్లద్దాలు పెట్టుకోండి

నియోజకవర్గంలో ఏమీ జరగడం లేదని పదేపదే ఇంటర్వ్యూలా..
ఎమ్మెల్యే తాటిపర్తిపై టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఫైర్
కోట్లాది నిధులతో అభివృద్ధి పనులు
అంతర్గత, లింక్, బీటీ రోడ్ల రూపు రేఖలు మార్చాం.. మారుస్తున్నాం
ఎర్రగొండపాలెంలో అన్నా క్యాంటిన్ పరిశీలన


అన్నా క్యాంటిన్ భవనాన్ని పరిశీలిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు

ఎర్రగొండపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ పదేపదే ఇంటర్వ్యూలు ఇస్తూ నియోజకవర్గంలో ఏమి జరగటం లేదని అబద్ధాలు చెబుతున్నారని, జరిగిన, జరుగుతున్న పనులు కన్పించకపోతే కళ్లకు మంచి పవర్ ఉన్న అద్దాలు పెట్టుకోవాలని టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఎద్దేవా చేశారు. ఎర్రగొండపాలెంలో అన్నా క్యాంటిన్ వచ్చే నెల 1వ తేదీ ప్రారంభించేందుకు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని ఆయన చెప్పారు. క్యాంటిన్ భవనాన్ని బుధవారం ఆయన పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో గత 18 నెలల్లోనే కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. రూ.10 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించామని తెలిపారు. సాస్కి నిధులతో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి నుంచి గ్రామాలకు అనుసంధానమైన 3 బీటీ రోడ్లకు రూ.10.64 కోట్లు మంజూరయ్యాయన్నారు. డీఎంఎఫ్ నిధులతో పెద్దారవీడు కేజీబీవీ పాఠశాల రోడ్డుకు రూ.50లక్షలు, బోడిరెడ్డిపల్లి జడ్పీ పాఠశాల రోడ్డుకు రూ.25 లక్షలు, బీ చెర్లోపల్లిలో రోడ్డుకు రూ.50 లక్షలు నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. రూ.5 కోట్లతో సీసీ రోడ్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. పాలుట్ల గిరిజన గూడెంలో అన్ని గృహాలకు సోలార్ కనెక్షన్లు మంజూరు చేసి పనులు పూర్తి చేశారన్నారు. ఎర్రగొండపాలెంలో రూ.6 కోట్లతో బాలికల వసతి గృహం నిర్మాణంలో ఉందని, ఎర్రగొండపాలెం-త్రిపురాంతకం ఆర్&బీ రోడ్డు రూ.7 కోట్లతో నిధులతో నిర్మాణంలో ఉందని వివరించారు. ఎన్నోఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న దోర్నాల బస్టాండుకు అవసరమైన రెండు రోజుల క్రితమే జిల్లా కలెక్టరు నుంచి ప్రొసిడింగ్స్ ఇప్పించినట్లు తెలిపారు. దోర్నాల మండలం గంటవాని పల్లె వద్ద బ్రిడ్జికి రూ.3కోట్లు మంజూరు చేయిస్తున్నట్లు వివరించారు. ఎర్రగొండపాలెంలో రోడ్డువేశారే తప్ప డివైడర్‌పై సెంట్రల్ లైటింగ్ లేదని, త్వరలో నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. ఇంకా పలు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, ముఖ్యనాయకులు వేగినాటి శ్రీను, శనగా నారాయణరెడ్డి, కంచర్ల సత్యానారాయణగౌడ్, తోట మహేష్, బీవీ సుబ్బారెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రైతుల జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యం

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

తర్లుపాడు, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రైతుల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజాప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి చెప్పారు. రైతులు రసాయనిక ఎరువులు వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడటం వలన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పంటలకు గిట్టుబాటు కల్పించేందుకు రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మండలంలోని సీతానాగుల వరంలో రైతన్న నీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనకనమిట్ల మండలంలో రిలయన్స్ కంపెనీ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వలన 3 వేల మంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. మేకలవారి పల్లి వద్ద ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయడం వల్ల చిన్న పరిశ్రమలు ద్వారా యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. అనంతరం మహిళలు మార్కాపురం జిల్లాగా ప్రకటించిన సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏడీఏ బాలాజీ నాయక్, వ్యవసాయ అధికారిని జోత్స్నాదేవి, మాజీ ఎంపీపీ ఏసుదాసు, కంచర్ల కాశయ్య, పుచ్చనూతల గోపినాథ్ చౌదరి, కూచిపూడి సోమయ్య, వేశపోగు జాను పాల్గొన్నారు.


చంద్రబాబు పటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

పేదవారి ఆకలి తీర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం


ఆహార పదార్థాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పేదవారి ఆకలి తీర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. స్థానిక అన్నా క్యాంటీన్‌ను బుధవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే కందుల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆహార పదార్థాలను పరిశీలించారు. వాటిని రుచి చూశారు. అనంతరం ప్రజలకు ఆహార పదార్థాలు వడ్డించారు. నాణ్యతలో ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా అని ప్రజల్ని ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బందులు లేవని నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారని అందరూ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ ఇబ్రహీంఖాన్, మేడిద రంగస్వామి పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలకు వినతిపత్రాలు అందజేత

మార్కాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గాన్ని నూతనంగా ఏర్పడబోయే మార్కాపురం జిల్లాలో కలపాలని విద్యావంతులు, మేధావుల వేదిక నాయకులు బుధవారం మహనీయుల విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. స్థానిక గాంధీ పార్కులోని గాంధీ విగ్రహానికి, నాయుడు బజార్‌లోని ఎన్టీఆర్, గడియారస్తంభం వద్ద వైఎస్సార్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద మాజీ ఎమ్మెల్యే పూల సుబ్బయ్య, పోస్టాఫీస్ వద్ద ఉన్న సీపీఎం నాయకులు ఏనుగుల పుల్లయ్యల విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు ఈదా చెన్నయ్య, డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, ఓరుగంటి మల్లిక్, దేవిరెడ్డి నాగేంద్రుడు, వాడపల్లి రమణ పాల్గొన్నారు.


ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న వేదిక నాయకులు

డీఆర్వోకు వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే జంకె

నూతనంగా ఏర్పడబోయే మార్కాపురం జిల్లాలో దర్శి నియోజకవర్గాన్ని కూడా కలపాలని మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి డీఆర్వో ఓబులేశుకు వినతి పత్రం అందజేశారు. ఒంగోలులోని డీఆర్వో కార్యాలయానికి బుధవారం వెళ్లి సమస్యను వివరించారు. అత్యంత వెనుకబడిన మార్కాపురం డివిజన్‌తోపాటు కనిగిరిని కలిపి జిల్లా చేయడం వలన ఉపయోగం లేదన్నారు. వ్యవసాయపరంగా అభివృద్ధి చెందిన దర్శిని కలపడం వలన మార్కాపురం జిల్లాకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. దొనకొండ మండలం మార్కాపురం జిల్లాలో ఉంటే పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చెందేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు ధర్మానాయక్ ఉన్నారు.

కంభంలో...

కంభం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా ఏర్పాటు చేస్తున్న మార్కాపురం జిల్లాలో దర్శి నియోజకవర్గాన్ని కలపాలని కోరుతూ కంభం తహసీల్దార్ కిరణ్‌కు మార్కాపురం జిల్లా సాధన సమితి నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సాధన సమితి అధ్యక్ష, కార్యదర్శులు దేవిరెడ్డి నాగేంద్రుడు, పెద్దిరెడ్డి దాసరిరెడ్డిలు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురాన్ని జిల్లా చేసినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు, వినియోగదారుల సంఘం అధ్యక్షుడు నరసింహారావు, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

టెట్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిటిషన్ వేయాలి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : టెట్ పరీక్షపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పిటిషన్లు వేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దార్ రత్నకుమారికి బుధవారం వారు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు అందరూ రెండేళ్లలోపు టీచర్ ఎలిజిబిలిటి టెస్టు తప్పనిసరిగా పాస్ కావాలని, లేకుంటే వారిని సర్వీసు నుంచి తొలగించాలని 2025 సెప్టంబర్ 1న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందన్నారు. రాష్ట్రంలో దాదాపు లక్ష మంది ఉపాధ్యాయులు టెట్ పరీక్షకు సన్నద్ధం కావాల్సి వస్తుందని చెప్పారు. దీనిపై ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని చేసిన విన్నపం మేరకు విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించారని చెప్పారు. ఆ మేరకు రివ్యూ పిటిషన్ వేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తరపున రివ్యూ పిటిషన్ వేయటంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం కూడా రివ్యూ పిటిషన్ వేయడం లేదా విద్యాహక్కు చట్టంలో తగు మార్పులు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శ్రీరాములు, పి.వెంకటేశ్వర్లు, ప్రభాకర్, చలమారెడ్డి, యలమంద రెడ్డి, శ్రీనివాసులు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పొదిలిలో...

పొదిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టెట్ పరీక్షపై ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ వేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలవెంకటేశ్వర్లు చెప్పారు. స్థానిక విశ్వనాథపురం యూటీఎఫ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బుజ్జిబాబు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, పాలడుగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దాడి చేసిన వైసీపీ నాయకుడిని వెంటనే అరెస్టు చేయాలి

కంభం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కంభంలో దళిత టీడీపీ నాయకుడు, రాష్ట్ర విద్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్ గోన చెన్నకేశవులుపై నిష్కారణంగా దాడిచేసిన వైసీపీ నాయకుడు చెన్నారెడ్డిని అరెస్ట్ చేయాలని కంభం మండల టీడీపీ అధ్యక్షుడు తోట వెంకటశ్రీనివాసులు, మండల ఎస్సీసెల్ నాయకులు సిరివెళ్ల రవికుమార్, కటికల భాస్కర్‌లు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కంభం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కందులాపురం సెంటర్‌లో జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీ ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలంటూ దౌర్జన్యంగా కులం పేరుతో దూషిస్తూ తాగే టీని ముఖంపై కొట్టడమే కాక దాడి చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుడనే వివక్షతో దాడికి పాల్పడిన చెన్నారెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొత్తపల్లి శ్రీనివాసులు, రావిపాడు మాజీ సర్పంచ్ కోటయ్య, మండల కార్యదర్శి ఆరేపల్లి మల్లికార్జున, కేతం శ్రీనివాసులు, తోట శ్రీనివాసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల టీడీపీ నాయకులు

బాల్యవివాహాలు జరగకుండా చర్యలు చేపట్టాలి

కొమరోలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బాల్య వివాహాలు జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంపీపీ కామూరి అమూల్య చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గిద్దలూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బైలడుగు బాలయ్య మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో అర్హత లేని ఉపాధ్యాయులున్నా పిల్లలను చేర్పిస్తున్నామని అదే ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత గల ఉపాధ్యాయులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సకల వసతులున్నా స్పందన తక్కువగా ఉంటుందని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని కలిగించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంపీపీ వ మాట్లాడుతూ కొమరోలులో రోడ్డు ఆక్రమణలు తొలగించాలని ఆర్ అండ్‌బీ అధికారులకు చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటయ్య మాట్లాడుతూ అర్హులైన వారు ఇంటి స్థలాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అల్లీనగరంలో సిమెంటు రోడ్డుకు కోటిరూపాయలు, గిద్దలూరు నుంచి రాజుపాలెం వరకు రూ.4 కోట్లతో కొత్త రోడ్లు వేసేందుకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఎంపీడీవో సత్యం, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ అమూల్య

అంకితభావంతో పనిచేయాలి

అవీఇవీ


రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ క్రిష్ణారెడ్డి

పొదిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సచివాలయానికి వచ్చే ప్రజలకు సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని తహసీల్దార్ క్రిష్ణారెడ్డి చెప్పారు. బుధవారం మండలంలోని తలమళ్ల సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆ సమస్యను గుర్తించి చేసేందుకు వీలుందా, లేదా అనే సమాచారం వారికి అందించాలన్నారు. అదేవిధంగా సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని, సమయపాలన పాటించడం లేదనే అపోహలు ఉన్నాయని వాటిని తుడిచేయాలని సూచించారు. అలాంటిది జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరసింహారావు, వీఆర్వోలు సుబ్బారావు, రమేష్ ఉన్నారు.

హామీలు అమలు చేయాలి


నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గిద్దలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. హామీల అమలు కోసం ఈనెల 12వ తేదీ కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. స్థానిక ఐసీడీఎస్ అధికారులను కలిసి ఆ మేరకు సమ్మె నోటీసు అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తల సంఘం మండల అధ్యక్షుడు స్వర్ణ, కార్యదర్శి మునమ్మ పాల్గొన్నారు.

కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

ఎరగొండపాలెం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆ మేరకు బుధవారం ఎర్రగొండపాలెం ఏపీడీ బండారు శ్రీనివాసులకు వారు వినతిపత్రం అందజేశారు.

యోగా గురూజీకి ఉత్తమ పురస్కారం

గిద్దలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురూజీ బి.ఎస్.నారాయణరెడ్డికి జాతీయ ఉత్తమ సేవా పురస్కారం లభించింది. అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం, దాతల సహకారంతో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్న నారాయణరెడ్డికి తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా తల్లూరు మండలంలో వరల్డ్ హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ ఉత్తమ సేవా పురస్కారాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యే ముత్తా రాగమయి, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రరావు, ఫౌండేషన్ ప్రతినిధులు దాసు, రుక్మిణిలు అందజేశారు.

నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి


గోకులం షెడ్ మ్యాజిక్ డ్రైన్స్ పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటరామిరెడ్డి

రాచర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నిర్మిస్తున్న గోకులం షెడ్లు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎంపీడీవో వెంకటరామిరెడ్డి చెప్పారు. మండలంలోని గౌతవరం గ్రామంలో నిర్మిస్తున్న గోకులం షెడ్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం రూ.25లక్షలతో నిర్మిస్తున్న మ్యాజిక్ డ్రైన్స్ కూడా పరిశీలించి నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జీఅండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ యోగానంద్, ఉపాధిహామీ ఈసీ నాగేశ్వరరావు, టీఏ కోటిలింగారెడ్డి, పంచాయతీ పీఎస్ అనిల్ కుమార్, ఉపాధి ఎఫ్ఏ వీరేంద్ర, స్థానిక నాయకులు శ్రీనివాసులు, ఎస్ రామకోటయ్య, బీ శివ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అభినందనీయం


ప్రిన్సిపల్ మురళీకి నగదు అందిస్తున్న డాక్టర్ నగేష్

రాచర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని ప్రిన్సిపల్ మురళి చెప్పారు. స్థానిక ఆదర్శ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల భోజనశాల నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరడంతో జిల్లా బీజేపీ యువనాయకులు, ఆయుర్వేద డాక్టర్ నగేష్ స్పందించి రూ.50వేల విరాళాన్ని బుధవారం ఆయన అందజేశారు. డాక్టర్ నగేష్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి, విద్యార్థుల ఆర్థిక అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జీఅండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ యోగానంద్, ఇన్చార్జి ప్రిన్సిపల్ సతీష్, ఫిజికల్ డైరెక్టర్ రాము పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

రాచర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని విద్యుత్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు చెప్పారు. విద్యుత్, విజిలెన్స్ అధికారులు బుధవారం మండలంలో ఆకస్మిక దాడులు నిర్వహించి విద్యుత్ చౌర్యం, అక్రమ వాడకాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారికి జరిమానాలు వేసి వాటి వివరాలు సమావేశం నిర్వహించి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సిబ్బంది 43బృందాలుగా ఏర్పడి విద్యుత్ సర్వీసులను తనిఖీలు చేశారన్నారు. ప్రజలు విద్యుత్ అక్రమాలకు పాల్పడవద్దని ఆయన కోరారు. సోలార్ వినియోగంపై ప్రజలు అవగాహన కల్పించుకోవాలని, సోలార్ వలన అధిక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఎన్ నాగేశ్వరరావు, డీపీఈ (విజిలెన్స్) హైమావతి, ఏడీఈలు బీవీ శేషగిరిరావు, సీఏ నాయక్ శ్రీనివాసరెడ్డి, ఏడీ కోటేశ్వరరావు, రాచర్ల ఏఈ బాలగురవయ్య పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించాలి

ముండ్లమూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై గ్రామ సచివాలయాల్లో ప్రజలు ఇచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ ఆదేశించారు. బుధవారం మండలంలోని నూజెండ్లపల్లి గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులకు సక్రమంగా హాజరు కాకపోతే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో సుజాత, సిబ్బంది దుర్గ, వేణుబాబు, హేమ శివ, సృజన, బి.మల్లాకార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షిత నీరు అందించడమే లక్ష్యం

ముండ్లమూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సురక్షితమైన నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఏ.హనుమాన్‌బాబు అన్నారు. బుధవారం శంకరాపురంలో జల రక్ష మాసం కార్యక్రమంలో భాగంగా రక్షిత మంచినీటి ట్యాంక్‌ను శుభ్రం చేయించారు. ట్యాంకు చుట్టు పక్కల శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ కూరపాటి మహేశ్వరి, పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటిశుద్ధి పరికరం అందజేత

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులారం మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గుంటిమడుగు రాధాకృష్ణంరాజు ఆర్థిక సహకారంతో నీటిశుద్ధి పరికరాన్ని బుధవారం అందజేశారు. ఈసందర్భంగా దాతను హెచ్‌ఎం జి.శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు షేక్ పాదుషా, మహేశ్వరరెడ్డి, నారాయణమ్మ అభినందించారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

పామూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అన్నిరకాల ఎరువులు, అందుబాటులో ఉంచినట్లు ఏవో టి.అబ్రహం లింకన్ తెలిపారు. బుధవారం మండలంలోని బొట్లగూడూరు, కంభాలదిన్నె గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.సుస్మిత, రమాశారద, విజయదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

పామూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు కేంద్రప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించి కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు సయ్యద్‌మౌలాలి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరి, పత్తి, మొక్కజొన్న, అరటి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ డీటీ శివరామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పోతుల ప్రభాకర్, వజ్రాల సుబ్బారావు, పి.మస్తాన్‌రావు, ఆర్.సూరిబాబు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పశువుల రక్షణకు గోకులం షెడ్లు

పామూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పశువుల రక్షణకు గోకులం షెడ్లు ఎంతగానో ఉపయోగపడతాయని సింగిల్‌విండో మాజీ చైర్మన్ బైరెడ్డి జయరామిరెడ్డి అన్నారు. బుధవారం భూమిరెడ్డిపల్లి, నిమ్మచెట్లపల్లిలో గోకులం షెడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.సుబ్బయ్య, ఏపీవో బి.మాల్యాద్రి, ఇండ్ల హరినారాయణ, కేవీ రమణయ్య, బైరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

దొనకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో ఈనెల 31 నుంచి జనవరి 4వరకు విశాఖపట్టణంలో జరిగే సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం మండల కన్వీనర్ చిరుపల్లి అంజయ్య పిలుపునిచ్చారు. ఇందుకుసంబంధించిన కరపత్రాలను బుధవారం సివిల్ సప్లయాస్ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

ముండ్లమూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని బస్టాండ్ సెంటర్‌లో వేంచేసి ఉన్న గ్రామ దేవత శ్రీపోలేరమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ముండ్లమూరుతో పాటు ఆ గ్రామానికి చెందిన బంధువులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పోలేరమ్మను దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో అంబళపూజ

పామూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్ప స్వామి దేవస్థానం వద్ద బుధవారం రాత్రి మహా అంబళపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థాన గౌరవాధ్యక్షుడు విశ్వనాధుని సత్యనారాయణ, అధ్యక్షుడు కావిటి సుబ్బయ్య, గుత్తిరాజ, ప్రధాన అర్చకులు చిమట పట్టాభి గురుస్వామి, చిమట కార్తీకేయ శర్మ, కంబాల రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్లు

- పాఠశాలల్లో నాడు- నేడు కింద గత ప్రభుత్వంలో ఏర్పాటు
- శుద్ధిజలానికి నోచుకోని విద్యార్థులు


బొద్దికూరపాడు మోడల్ ప్రైమరీ పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంటు

తాళ్లూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. విద్యార్థుల తాగునీటి కష్టాలు తీర్చేందుకు గత వైసీపీ ప్రభుత్వం 2020-2021 ఆర్థిక సంవత్సరంలో నాడు-నేడు కింద లక్షలాది రూపాయలు వెచ్చించి 23 పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు(నీటిశుద్ధ జలయంత్రాలు) ఏర్పాటుచేసింది. విద్యార్థుల సంఖ్యను బట్టి పెద్దప్లాంట్‌ను రూ.1,75,000, చిన్న ప్లాంట్‌ను రూ.40వేలు ఖర్చు చేసి ఏర్పాటుచేశారు. యంత్రాలు నాసిరకంగా ఉండటంతో ఆప్లాంట్లు ఏర్పాటుచేసిన నాలుగు నెలలు తిరగకుండానే పాడయ్యాయి. దీంతో ఆయా పాఠశాలల్లో తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. పాఠశాలల్లోని ఆర్వో ప్లాంటు పనిచేయక తాగునీటి కోసం విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఐదేళ్లుగా మరమ్మతులు చేయించిన పాపాన పోలేదు. ఆర్వో ప్లాంట్ పరికరాలు గదుల్లో నిరుపయోగంగా ఉన్నాయి. ప్రారంభంలో వాటి మరమ్మతులకు తక్కువఖర్చు తక్కువయ్యేది. సంవత్సరాల తరబడి మరమ్మతులు చేయించక పోవటంతో పూర్తిగా పాడయ్యాయి. దీంతో మరమ్మతుల ఖర్చు రెట్టింపు అయింది. కొందరు ఉపాధ్యాయులు విద్యార్థులకు తాగునీరు అందించేందుకు సొంత నిధులు వెచ్చించి మంచి నీరు అందిస్తున్నారు. ఒక్కోపర్యాయం గ్రామంలోని వాటర్ ప్లాంట్లు పనిచేయకపోతే బోరునీటినే సేవిస్తూ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

తాళ్లూరుప్రాథమిక పాఠశాల (ఏపీ) హెచ్‌ఎం త్రిపురారిబొట్ల శ్రీనివాసరావు విద్యార్థులకు తాగునీటి సమస్య తీర్చేందుకు సొంత నిధులు వెచ్చించి ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించారు. మండలంలో 46 పాఠశాలలు ఉండగా, 23 పాఠశాలలకు నాడు-నేడు కింద ఆర్వోప్లాంట్లు ఏర్పాటుచేశారు. దారంవారిపాలెం ఎంపీపీ పాఠశాల(ఏపీ), కొత్తపాలెం ఎంపీపీ పాఠశాల, తాళ్లూరు ఎంపీపీ పాఠశాల (ఏపీ), తూర్పుగంగవరం జడ్పీహెచ్‌ఎస్, వీకే ప్రభుత్వ ఉన్నత పాఠపాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేస్తున్నాయి. మిగిలిన 17 పాఠశాల్లో ఆర్వోప్లాంట్ల మరమ్మతుల ఊసేలేదు. ప్లాంట్లను బాగు చేయించాలని ఉపాధ్యాయులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందనలేదు. ప్రజాప్రభుత్వం వచ్చి 18 నెలలు కావస్తున్నా ఆర్వో ప్లాంట్ల మరమ్మతుల గురించి పట్టించుకున్న పాపానపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్వోప్లాంట్‌లకు మరమ్మతులు చేయించి విద్యార్థుల అవస్థలు తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కోటి సంతకాల సేకరణ బూటకం

- వైసీపీ చీప్‌ట్రిక్స్ మానుకోవాలి
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన కోటి సంతకాల సేకరణ ఒట్టి బూటకమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ధ్వజమెత్తారు. వైసీపీ చీప్‌ట్రిక్స్ మానుకుంటే బాగుంటుందని అన్నారు. బుధవారం సానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిపై ఎందుకు కోటి సంతకాల సేకరణ చేపట్టలేదని ప్రశ్నించారు. రోడ్ల దుస్థితిపై కోటి సంతకాల సేకరణను జగన్ నిర్వహించినట్లయితే ప్రజాస్పందనతో అయినా బుద్ధి వచ్చేదన్నారు. నేడు కోటిసంతకాల కార్యక్రమం విజయవంతం ర్యాలీలో పాల్గొన్న నేతలు వారి పాలనలో అభివృద్ధి ఎందుకు చేయలేకపోయారో కూడా ప్రజలకు చెపాలన్నారు.

కనిగిరి అభివృద్ధికి పాటుపడని నేతలు ఈప్రాంతానికి వచ్చిన ట్రిపుల్‌ఐటీ కళాశాల ఒంగోలు వెళ్తుంటే ఎందుకు ఆపలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. నడికుడి రైల్వేమార్గం, బైపాస్, ఆసుపత్రి అభివృద్ధి, ఓవీరోడ్డు వంటి ప్రజావసరాలను ఎందుకు గాలకొదిలేశారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజాసమస్యలు పరిష్కరించని నేతలు ఇప్పుడు తగదునమ్మా అంటూ కోటి సంతకాల సేకరణ చేపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజాప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన పాలన అందుతుందన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గ్రామీణాభివృద్ధి కోసం నిధులు కేటాయించారన్నారు. మంత్రి లోకేష్ పారిశ్రామికంగా రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చేందుకు ఆయన వయస్సుకు మించి విదేశాల్లో పర్యటిస్తూ రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు.

కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్, కనిగిరి, హెచ్‌ఎంపాడు మండలాల అధ్యక్షులు కొండా కృష్ణారెడ్డి, సానికొమ్ముతిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), ముస్లిం మైనారిటీ నాయకుడు రోషన్ సంధాని, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి), దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, బాలు ఓబులురెడ్డి, మాజీ ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు యాదవ్, గుడిపాటి ఖాదర్, షరీఫ్, కరణం అరుణమ్మ, తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భజలాలు పెంచటమే వాటర్‌షెడ్ లక్ష్యం

- ఏపీడీ చంద్రశేఖర్‌రెడ్డి



మొక్కలు నాటుతున్న ఏపీడీ చంద్రశేఖర్, వాటర్‌షెడ్ అధికారులు

దొనకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను పెంచటమే వాటర్‌షెడ్ పథకం ముఖ్య ఉద్దేశమని ఏపీడీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొచ్చెర్లకోట గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రధానమంత్రి కృషి యోజన వాటర్‌షెడ్ పథకం మహోత్సవాల కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతుభరోసా కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ వాటర్‌షెడ్ అమల్లో ఉండే ప్రాంతాల్లో పడే ప్రతి చినుకును భూమిలోకి ఇంకేలా చేయటం జరుగుతుందన్నారు. అందులోభాగంగానే కొండలు, వాలు ప్రాంతాల్లో పైనుంచి వచ్చే నీటిని భూగర్భ జలంగా మార్చటం జరుగుతుందన్నారు. చెక్‌డ్యామ్‌లు, ఊర చెరువులు లాంటి నిర్మాణాలతో నీటిని నిల్వ చేస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, వర్షపాతాన్ని పెంపొందించే ప్రయత్నాల్లో భాగంగా వాగులు, వంకల వెంట మొక్కలు నాటి పెంచటం జరుగుతుందన్నారు.

అనంతరం శ్రమదానం క్రింద నీటికుంటలో జంగిల్ క్లియరెన్స్, జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల నుంచి రైతుభరోసా కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, జేఈ సుధాకర్, టీవోలు రాజేష్, శ్రీనివాసులు, ప్రసాద్, మాజీ సర్పంచ్‌లు తడికమళ్ల కోటేశ్వరరావు, చీరాల యోహన్, మాజీ ఎంపీటీసీ కె.కోటయ్య, టీడీపీ నాయకులు బండ్లా వెంకటనారాయణ, పెమ్మసాని లక్ష్మీనారాయణ, చొప్పరపు మైఖేల్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పంచాయతీగా పెద్దగుడిపాడు?

- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నివేదికలు పంపిన అధికారులు


పెద్దగుడిపాడు గ్రామ వ్యూ

దొనకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దొనకొండ మండలంలో పెద్దగుడిపాడు, దొండపాడు గ్రామాలు గంగదేవిపల్లి పంచాయతీ పరిధిలో కొనసాగుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం గంగదేవిపల్లి పంచాయతీ పరిధిలో 3383 మంది జనాభా ఉండగా, 2541 మంది ఓటర్లు ఉన్నారు. గంగదేవిపల్లి గ్రామానికి రోడ్డుమార్గాన పెద్దగుడిపాడు మూడు కిలోమీటర్లు, దొండపాడు పదకొండు కిలోమీటర్లు దూరంలో ఉన్నాయి. దీంతో గ్రామ పంచాయతీ పరిధిలో జరిగే గ్రామసభలు, వివిధ ప్రభుత్వ పథకాలు పొందేందుకు, దరఖాస్తులు చేసుకొను నిమిత్తం సచివాలయంకు వెళ్లేందుకు ఆరెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చివరకు రేషన్ బియ్యాన్ని పెద్దగుడిపాడు, దొండపాడు గ్రామాల ప్రజలు గంగదేవిపల్లి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

రాష్ట్రంలో గ్రామ పంచాయతీల విభజన, కొత్త పంచాయతీల ఏర్పాటుచేయాలని ప్రభుత్వం యోచిస్తుంది. దీంతో పెద్దగుడిపాడు, దొండపాడు గ్రామాల ప్రజలు ఏళ్ల తరబడి తాము పడుతున్న ఇబ్బందులను ఇటీవల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి ఏకరువుపెట్టారు. కొత్త పంచాయతీగా పెద్దగుడిపాడు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలంటూ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆమె గంగదేవిపల్లి నుంచి పెద్దగుడిపాడు, దొండపాడు గ్రామాలను విభజించి కొత్త పంచాయతీగా పెద్దగుడిపాడు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు కొత్తగా పెద్దగుడిపాడు పంచాయతీ ఏర్పాటుకు నివేదికలు పంపాలని ఆదేశించారు.

ఉన్నతాధికారులు నిర్దేశించిన సమాచారం మేరకు పెద్దగుడిపాడు, దొండపాడు గ్రామాల్లో జనాభా, ఓటర్లు, భౌగోళిక అంశాలతో పాటు పంచాయతీ తీర్మానంతో పూర్తి నివేదికను ఇటీవల ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం.

ఇప్పటివరకు మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్తగా 19వ పంచాయతీగా పెద్దగుడిపాడు ఏర్పాటవుతుందనే ఆశతో ఆయాగ్రామాల ప్రజలు ఉన్నారు.

రుచికరంగా మధ్యాహ్నభోజనం తయారుచేయాలి


విద్యార్థినుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రుచికరంగా మధ్యాహ్నభోజనం అందజేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కుకింగ్ ఏజన్సీలు తయారుచేసే మధ్యాహ్న భోజనం ఇంటి భోజనం మాదిరిగా ఉండాలన్నారు. సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. మెనూ గురించి కుకింగ్ ఏజన్సీ నిర్వహకురాలిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం ఏర్పాటుచేయాలన్నారు.

అనంతరం విద్యార్థినులతో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో వరికూటి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ముండ్లమూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటుచేసిన మూడు మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఏ. తిరుమలరావు అన్నారు. బుధవారం మండలంలోని వేముల, వేములబండ గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈసందర్భంగా రైతులు సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించారు. అనంతరం వేముల రైతు సేవా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ దళారులను అరికట్టేందుకు పసుపుగల్లు, ముండ్లమూరు, బొప్పూడివారిపాలెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గజ్జల ఆదిలక్ష్మి, వీఏఏ తిప్పస్వామి, మాసుం, బాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సమాన హక్కులతో జీవించాలి

కనిగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతిఒక్కరూ సమాన హక్కులతో జీవించాలని కనిగిరి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బి.రూపశ్రీ అన్నారు. మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో స్వేచ్ఛ, సమానత్వంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. హక్కులు లేని మనిషి బానిసతో సమానంగా భావించాలన్నారు. ప్రతిఒక్కరూ ఎలాంటి వివక్షతకు తావులేకుండా జీవించాలన్నారు. పేదలకు, బలహీనవర్గాలకు ఉచిత న్యాయ సలహాలు, సహాయం అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, ప్రజలు పాల్గొన్నారు.

చివరి భూములకు నీరు అందిస్తాం

ముండ్లమూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మోదేపల్లి మేజరు పరిధిలోని చివరి భూములకూ నీరందించి పంటలను కాపాడతామని ఎన్‌ఎస్‌పీ డీఈ బి.పూర్ణచంద్ర అన్నారు. బుధవారం మోదేపల్లి మేజరు పరిధిలోని తూర్పుకంభంపాడు, పోలవరం, ఉమా మహేశ్వర అగ్రహారం, ఈదర, వేములబండ మైనర్ కాలువలకు సరఫరా అవుతున్న సాగర్ జలాలను డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావుతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజరు పరిధిలో చివరి గ్రామాలైన మోదేపల్లి, కొటికలపూడి గ్రామాలకు నీరు ఇవ్వటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చావా బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

ముండ్లమూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూపరమైన పెండింగ్ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, సర్వేయర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఏగ్రామంలోనైనా రెవెన్యూకు సంబంధించిన సమస్య పరిష్కారం కాకుండా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. వీఆర్‌వోలు తమ పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్, ఆర్‌ఐ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ ప్రతులు ఒంగోలుకు తరలింపు

దర్శి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో వైసీపీ ఆధ్వర్యంలో సేకరించిన సంతకాల ప్రతులను బుధవారం జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒంగోలుకు తరలించారు. మెడికల్ కాలేజీలను పీపీపీ విధానం ద్వారా నిర్మించటాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ కోటి సంతకాల సేకరణ చేపట్టిన విషయం తెలిసిందే. దర్శి నియోజకవర్గంలో చేపట్టిన సంతకాలను స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ఒంగోలుకు తరలించారు. కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనిగిరి: మెడికల్ కాలేజీల ప్రవేటీకరణపై చేపట్టిన కోటిసంతకాల సేకరణ ప్రతులను వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు ఆధ్వర్యంలో ఒంగోలుకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో కనిగిరి నియోజకవర్గంలో గత 45రోజులుగా 135 పంచాయతీల్లో మెడికల్ కాలేజీల ప్రైవేటికరణపై ప్రజాభిప్రాయాన్ని సేకరించినట్లు తెలిపారు. 62వేల మంది సంతకాలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వసతి గృహంలో బసచేసిన వ్యవసాయాధికారి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఏవో ప్రసాదరావు

తాళ్లూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు బస చేశారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు విద్యార్థులతో గడిపారు. వసతి గృహంలోని వసతులు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. వసతి గృహానికి ప్రహరీ నిర్మాణం, ప్రాంగణంలో నిల్వఉంటున్న మురుగు నీటిని బయటకు పంపే చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రి వసతిగృహ విద్యార్థులతో కలిసి బసచేశారు. కార్యక్రమంలో వార్డెన్ బి.నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో మట్టి తరలింపునకు ఆటంకం

తాళ్లూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన మట్టిని పట్టా భూముల నుంచి తరలిస్తుండగా ఏఎంఆర్ నిర్వాహకులు అడ్డుకోవటంపై తూర్పుగంగవరం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లకు మట్టి తోలకాన్ని అడ్డుకోవటంపై నాగంబొట్లపాలెం సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బయ్య, రైతులు తహసీల్దార్ బీవీ రమణారావుకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో తహసీల్దార్ బుధవారం పట్టా భూములను పరిశీలించారు. ఏఎంఆర్‌ఏజన్సీ వారు తాము చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని ట్రాక్టర్‌కు రూ.700 చలానా చెల్లించి మట్టిని తరలించాలని అంటున్నారని గ్రామస్థులు తెలిపారు. మట్టి త్రవ్వకాన్ని నిలుపుదల చేసిన చెక్ పోస్టు నిర్వహకుల వద్దకు వెళ్లి మేనేజర్‌తో తహసీల్దార్ ఫోన్‌లో మాట్లాడారు. నిబంధనల బైలాను తీసుకుని గురువారం కార్యాలయానికి రావాలని తెలిపారు. ఇంటి నిర్మాణాలకు కోసం పట్టా భూములనుండి మట్టిని తోలుకుంటే చలానా వేయటం ఏమిటని తహసీల్దార్ ప్రశ్నించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, నాగంబొట్లపాలెం సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బయ్య, సోమా ఆంజనేయులు, వీఆర్వో ఎం.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

కనిగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఈవో రాజాల కొండారెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని సీఎస్‌పురం ఎంఈవో కార్యాలయంలో ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమికస్థాయి విద్యార్థులకు అమలుచేస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రమాణాలను ఖచ్చితంగా సాధించాలన్నారు. సమావేశంలో ఎంఈవోలు డి.రామిరెడ్డి, సీఆర్‌పీలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

భూములను పరిశీలించిన ఆర్డీవో

పామూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడవాడ, సిద్ధవరం, మోట్రావులపాడు, నుచ్చుపొద, తదితర గ్రామాల నుంచి వచ్చిన పీజీఆర్‌ఎస్ అర్జీలకు సంబంధించి క్షేత్రస్థాయిలో బుధవారం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి పరిశీలించారు. బోడవాడలో నోషనల్, జీరో ఖాతాలను మ్యూటేషన్ చేసేందుకు అర్జీదారులు వినతి పత్రాలు అందజేసి ఉన్నారు. ఆ భూములను ప్రస్తుతం ప్రభుత్వం నిషేధించిందని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. అయితే, అర్జీదారులు సంతృప్తి చెందక రీఓపెన్ చేయడంతో కలెక్టర్, జేసీ, ఆర్డీవో లాగిన్ లో ఓపెన్ కావడంతో పైఅధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో ఆర్డీవో క్షేత్రస్థాయిలో పర్యటించి వెబ్‌ల్యాండ్ రికార్డులను పరిశీలించారు. అలాగే, మోట్రావులపాడులోని 43 సెంట్ల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, ఆర్‌ఐ శ్రీరాం అజయ్‌కుమార్, మండల సర్వేయర్ పవన్‌కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీ

ముండ్లమూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగనపాలెం గ్రామానికి చెందిన కోనంకి బాల కోటయ్య, కంచర్ల వెంకట కృష్ణకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్, ఈదర గ్రామానికి చెందిన మేడిశెట్టి వెంకటేశ్వర్లు, తోట రామారావులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ బుధవారం అపహరించారు. బాధితులు తమ పొలాలకు వెళ్ళిచూడగా దిమ్మెల మీద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లు లేకపోవడంతో ఫిర్యాదు చేశారు. ఏఎస్‌ఐ పీవీ హనుమంతరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. దర్శికి చెందిన క్లూస్ టీమ సిబ్బంది ఏసుబాబు, సునీల్ కుమార్‌లు వేలి ముద్రలు సేకరించారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

7

గురువారం 11 డిసెంబరు 2025



216 హైవేకు అనుసంధానంగా.. అభివృద్ధి

రాజుపాలెం - తాతపూడి మధ్య వ్యాపారాల విస్తరణ

మార్టూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 216 జాతీయరహదారి అనుసంధానంగా అభివృద్ధి ఊపందుకుంటోంది. హైవేపై రాజుపాలెం, తాతపూడి మధ్య వ్యాపారాలు విస్తరిస్తున్నాయి. చెన్నై-విజయవాడ జాతీయ రహదారిపై జిల్లా సరిహద్దు రాజుపాలెం జంక్షను సమీపం నుంచి పల్నాడు జిల్లా ప్రారంభమయ్యే తాతపూడి వరకు జాతీయరహదారి పక్కన రూపురేఖలు మారుతున్నాయి. రాజుపాలెం, తాతపూడి మ ధ్య ఇప్పటికే గ్రానైట్ పరిశ్రమలు, కోల్డ్‌స్టోరేజీలు ఉన్నాయి. వీటికి అదనంగా మరి కొన్ని గ్రానైట్ పరిశ్రమలు, రెస్టారెంట్లు, పెట్రోలు బంకులను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేస్తున్నారు.

అండర్ బ్రిడ్జిల నిర్మాణం..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మార్టూరు మండల పరిధిలో 216 జాతీయరహదారిపై రెండు పెద్ద అండరు బ్రిడ్జిల నిర్మాణం జరుగుతుంది. రూ.80 కోట్లతో జొన్నతాళి రోడ్డు వద్ద, రాజుపాలెం జంక్షన్ వద్ద అండరు బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. రాజుపాలెం వద్ద అండరు బ్రిడ్జితో తాతపూడి వరకు పారిశ్రామిక అభివృద్ధికి అవకాశం ఏర్పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వాస్తవంగా బొల్లాపల్లి టోల్‌ప్లాజా నుంచి రాజుపాలెం జంక్షన్ సమీపం వరకు సుమారు 17 కిమీ ఉండగా రాజుపాలెం - తాతపూడి వరకు 5 కిమీలో అభివృద్ధి వేగవంతంగా జరుగుతుంది.



రాజుపాలెం - తాతపూడి మధ్య ఉన్న 216 జాతీయ రహదారి

భూముల ధరలకు రెక్కలు

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న రాజుపాలెం, తాతపూడి మధ్య భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఏడాది క్రితం ఎకరా రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షలు పలికింది. ప్రస్తుతం ఎకరా 1 కోటి 20 లక్షలు నుంచి 1 కోటి 70 లక్షల వరకు ధర పలుకుతున్నది. అయినా ఇప్పటికీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు చకోరపక్షుల్లాగా భూముల కొనుగోలుకు జల్లెడ పడుతున్నారు.



ముగిసిన యువజనోత్సవం

● మూడు రోజులు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

● ఓవరాల్ చాంపియన్ షిప్ అందుకుంటున్న జేకేసీ కళాశాల విద్యార్థులు

ఏఎన్‌యూ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల యువజనోత్సవం బుధవారం ముగిసింది. మూడు రోజుల పాటు సాగిన సాంస్కృతిక పోటీలలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను కనిబరిచారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.గంగాధర్ రావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఉన్న ఉత్సాహాన్ని చూసి తన కళాశాల రోజులను గుర్తు చేసుకున్నట్లు చెప్పారు. విజేతలు త్వరలో జరిగే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల యువజనోత్సవం పోటీలలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ మూడు రోజుల నివేదికను అందజేశారు. యువజనోత్సవంలో ఓవరాల్ చాంపియన్‌షిప్ బహుమతిని జేకేసీ కళాశాల కైవసం చేసుకుంది. రన్నర్‌గా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్, కామర్స్ అండ్ లా కళాశాల నిలిచింది.

చెరువులకు మహర్దశ

అమృత్ 2.0లో ఆధునికీకరణ

● టెండర్ నిర్వహించిన పబ్లిక్ హెల్త్ శాఖ

● రూ.92.29 కోట్లతో మున్సిపల్ చెరువుల అభివృద్ధి

మున్సిపల్ పట్టణాల్లో చెరువులకు మహర్దశ పట్టింది. తాగునీటి నిల్వలుగా ఉన్న చెరువుల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. అమృత్ 2.0 పథకంలో చెరువుల సంరక్షణ, సుందరంగా తీర్చిదిద్దడం, ఆహ్లాదకరంగా మార్చడంతో పాటు భూగర్భజల నీటి నిల్వలు పెరిగేలా పనులు చేపట్టనున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపల్ కేంద్రాల్లోని 32 చెరువుల ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.92.29 కోట్లు కేటాయించింది. ఈ క్రమంలో ఆయా పనులకు ఎట్టకేలకు పబ్లిక్ హెల్త్‌శాఖ టెండర్ ప్రక్రియ నిర్వహించింది. పల్నాడు జిల్లాలో 13 చెరువులను రూ.32.72 కోట్లతో ఆధునికీకరించనున్నారు. గుంటూరు జిల్లాలో కార్పొరేషన్ సహా 12 చెరువులు రూ.45.38 కోట్లతో, బాపట్ల జిల్లాలో 7 చెరువుల ను రూ.14.10 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు.

ఆధునికీకరణ ఇలా..

* ఆక్రమణలు తొలగించి హద్దుల నిర్ణయం చెరువుల్లో పూడిక తీత చెరువు కట్టల పటిష్ఠతకు రాతితో రిటైనింగ్ వాల్ నిర్మాణం
* పట్టణ వాసుల నడకకు అనుకూలంగా కట్టపై వాకింగ్ ట్రాక్ నిర్మాణం
* ట్రాక్ చెరువు వైపు ఇనుప వైరుతో ఫెన్సింగ్ ఏర్పాటు
* చెరువు బయట వైపు కట్టలపై పచ్చిక పెంపకం

(రేపల్లె, ఆంధ్రజ్యోతి)

అమృత్ 2.0 పథకం కింద పురపాలక సంఘాల్లోని చెరువులను ఆధునికీకరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. పట్టణాల్లో భూగర్భ జలాలు పెంపొందించడమే అమృత్ లక్ష్యం. గుంటూరు కార్పొరేషన్ సహా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీల్లో పూడిక పేరుకుపోయి రూపు రేఖలు కోల్పోయిన చెరువులకు మహర్దశ పట్టింది. అమృత్ 2.0లో 32 చెరువులు ఆధునికీకరణకు ఎంపిక కాగా రూ.92.29 కోట్లు విడుదలయ్యాయి. ఈ క్రమంలో పబ్లిక్‌హెల్త్‌శాఖ టెండర్ ప్రక్రియ చేపట్టింది. భూగర్భ జలాలు పెంపొందించేందుకు చెరువులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. చెరువుల అభివృద్ధి ద్వారా పట్టణాల్లో భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రణాళికలను రూపొందించారు. ఇప్పటికే (మిగతా 8వ పేజీలో)



నరసరావుపేటలో అభివృద్ధి చేయనున్న కత్తవ చెరువు

అజ్ఞాతంలో.. భోక్తలు



● జీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్.. పరారీ

● అజ్ఞాతంలో మాజీ డైరెక్టర్లు, బ్యాంకు ఉద్యోగులు

● రూ.22.25 కోట్ల కుంభకోణంపై చర్యలతో ఉలికిపాటు

● ఫోర్జరీ దస్తావేజులతో రూ. కోట్ల రుణాల కేసులో 11 మంది అరెస్టు

వీరిపై కేసులు..

డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు నాటి బ్రాంచ్ మేనేజర్ దేవరకొండ అరుణ్ కుమారి (ఏ1), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తొర్లికొండ కృష్ణ వేణి(ఏ2), నాటి అప్రైజర్ యర్రంశెట్టి ఈశ్వరప్రసాద్(ఏ3), నాటి బ్యాంకు ఛైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు అలియాస్ లాల్‌పురం రాము(ఏ4), డైరెక్టర్లు నల్లపాటి రామయ్య(ఏ5), కోట హరిబాబు(ఏ6), వట్టికొండ కోటేశ్వరమ్మ(ఏ7), పీట వెంకటేశ్వర్లు (ఏ8), గోవిందనాయక్(ఏ9), వెలిశెల ఏడుకొండలు(ఏ10), కూని శెట్టి శివనవీన్ (ఏ11)లపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన నల్లపాడు పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. అయితే కేసులో నిందితుడైన లాల్‌పురం రాము 10 రోజుల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది.

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో రూ.22 కోట్ల కుంభకోణం కేసులో నిందితుడైన నాటి బ్యాంకు ఛైర్మన్, వైసీపీ నాయకుడు రాతంశెట్టి సీతారామాంజనేయులు అలియాస్ లాల్‌పురం రాము పరారీలో ఉన్నారు. ఆయన ఛైర్మన్‌గా కొనసాగిన సమయంలో నల్లపాడు బ్యాంకు బ్రాంచ్‌లో చోటు చేసుకున్న అవకతవకలపై కలెక్టర్ ఆదేశాలతో నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే అవకతవకలపై బ్యాంకు డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ కే శీనారెడ్డి దర్యాప్తు చేస్తుండగా విషయాన్ని రాముతో సహా నాటి మాజీ డైరెక్టర్లు అందులో పాత్ర ఉన్న బ్యాంకు ఉద్యోగులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉన్నారు. ఈ నేపథ్యంలో తమపై కేసు తప్పదని (మిగతా 8వ పేజీలో)

అసైన్డ్‌పై.. కొరడా



● అక్రమాలపై సమగ్ర విచారణకు ఆదేశాలు

● గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా భూముల ఫ్రీహోల్డ్

● నాడు మూడు జిల్లాల్లో 4,200 బాధితుల వినతులు బుట్టదాఖలు

● నిర్దిష్ట కాలపరిమితితో న్యాయం చేసే దిశగా నేడు ప్రభుత్వ కార్యాచరణ

చట్ట సవరణ ముసుగులో..

2003కు ముందు పేదలకు అసైన్డ్ చేసిన భూములపై యాజమాన్య హక్కులు కల్పించేలా ఫ్రీహోల్డ్ చేయడానికి గత ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. ఈ చట్ట సవరణ ముసుగులోనే వైసీపీ పెద్ద ఎత్తున అసైన్డ్ అక్ర మాలకు పాల్పడిందనే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. ఒరిజినల్ అసైనీలను భయభ్రాంతులకు గురిచేసి మరీ భూములను ఫ్రీహోల్డ్ చేసుకున్న ఉదంతాలు ఉన్నాయి. పల్నా డు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో దాదాపు 15,000 ఎకరాలను నిబంధనలకు విరు ద్ధంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు సమాచారం. ఒక్క బాపట్ల జిల్లాలోనే 2,686 ఎకరాల ను ఫ్రీహోల్డ్ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే అసైన్డ్ చట్ట సవ రణ ఆధారంగా దాదా పు 6,000 ఎకరాల వరకు ఫ్రీహోల్డ్ బాట పట్టినట్లు సమాచా రం. ఇక ఈ చట్టంతో సంబంధం లేకుం డా స్థానికంగా ఉండే నేతల మాటలే ఆదేశాలుగా వేల సంఖ్యలో భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించి అప్పనంగా దోచేశారు. ఉద్దేశపూర్వకంగా లిటిగేషన్‌లో పడేసి నిషేధిత జాబితాలో దాదాపుగా పదివేల ఎకరాల భూములను చేర్చారని సమాచారం. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ అసైన్డ్ అక్రమాలను ఆధారాలతో సహా నిలదీసినా పట్టించు కోలేదు. ప్రస్తుతం ఆయా అసైన్డ్ అక్రమాలపై నిగ్గు తేల్చి త్వరితగతిన వివాదాలకు ముగింపు పలకాలని కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

నిబంధనలకు పాతరేస్తూ, రాజకీయ సిఫారసులే ప్రామాణికంగా గత ప్రభుత్వంలో అసైన్డ్ భూ దందా ఆకాశమే హద్దుగా సాగగా.. కూటమి ప్రభుత్వం ఆయా అక్రమాలపై చర్యలకు సిద్ధమైంది. బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో దాదాపు 4,200 వినతులు వైసీపీ ప్రభుత్వంలో అందగా వాటిని బుట్టదాఖలు చేసి భూ అక్రమార్కులకు నాటి పాలకులు వత్తాసు పలికారు. అసైన్డ్ అక్రమాలపై విచారణ జరిపి, అడ్డగోలు వ్యవహారాలపై చర్యలు తీసుకుంటామని కూటమి నేతలు ఎన్నికలకు ముందే బాధితులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ల నుంచి అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ జాబితాపై నివేదికలను (మిగతా 8వ పేజీలో)

1252 దస్త్రాలు.. 664 పరిష్కారం

● ఈ ఆఫీస్ ఫైల్స్ డిస్పోజ్ రిపోర్టును వెల్లడించిన ప్రభుత్వం

● సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు సగటున ఒక రోజు సమయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సెప్టెంబరు 9 నుంచి డిసెంబరు 9 వరకు కలెక్టర్ లాగిన్‌కు 1252 దస్త్రాలు రాగా, 664 అర్జీలపై స్పందించినట్లు ప్రభుత్వం ఇచ్చిన నివేదికలో వెల్లడించింది. మెరుగైన పౌర సేవలు అందించే దిశగా ప్రభుత్వం ఈ-ఆఫీస్ ఫైళ్ల క్లియరెన్స్ రిపోర్టును బుధవారం వెల్లడించింది. ప్రజల సమస్యలను ఎంత వ్యవధిలో నోటీసు చేయబడుతున్నాయనే అంశంతో పాటు ఎన్ని అర్జీలు వస్తున్నాయి, వాటిలో ఎన్ని పరిష్కరించబడుతున్నాయనే వివరాలను ప్రభుత్వం ప్రకటించింది. జేసీ వివిధ సమస్యలపై స్పందనకు సగటున ఒక రోజు వ్యవధి తీసుకున్నట్లు తేల్చింది. జిల్లాకు చెంది న మంత్రులు అనగాని ఈ ఆఫీస్ ఫైళ్ల క్లియరెన్స్ కోసం సగటున 4 రోజులు సమయం తీసు కొంటుండగా, మరో మంత్రి గొట్టిపాటి ఆరురోజుల వ్యవధి తీసుకున్నారు. సమస్యల పరిష్కారం లో మరింత వేగం చూపాలని సీఎం చంద్రబాబు అధికారులు, మంత్రులకు మార్గనిర్దేశనం చేశారు.

వరి వంగడాల ఉత్పత్తి అభినందనీయం

● బాపట్ల పరిశోధనా కేంద్రంలో కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాపట్ల వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో 14 రకాల వరి వంగడాల ఉత్పత్తి అభినందనీయమని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానాన్ని బుధవారం పరిశీలించిన కలెక్టర్ శాస్త్రవేత్తల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వివిధరకాల వరి విత్తనాలను పరిశోధించి ఉత్పత్తి చేస్తున్నట్లు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. బ్లాక్, రెడ్‌రైస్ కూడా ఇక్కడే ఉత్పత్తి చేశామని కలెక్టర్‌కు చెప్పారు.

వ్యవసాయ ఉత్పాదకత పెరగాలి

వ్యవసాయ రంగంలో ఉత్పాదకత పెరగాలని కలెక్టర్ తెలిపారు. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ప్రాథమిక సెక్టార్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా పెరుగుదలకు తగినట్లుగా వ్యవసాయోత్పత్తులు అధికం కావాలని కలెక్టర్ చెప్పారు. ప్రజల తలసరి ఆదాయం పెరగాలంటే అన్ని పంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 41 అంశాలలో పురోగతి సాధించాలన్నారు. ఉద్యానవన పంటలసాగు 500 హెక్టార్లు ఉండగా 60శాతం విస్తరణ జరగకపోవటం ఏమిటని నిలదీశారు. రసాయన ఎరువుల వాడకం తగ్గింపుపై క్షేత్రస్థాయిలో కమిటీలు పనిచేయాలన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే ఉపేక్షించం

ధాన్యం కొనుగోలులో మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెడితే ఉపేక్షించేదిలేదని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి బుధవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. రైతులు ఆర్.ఎస్.కెలకు తెచ్చిన ధాన్యానికి ధ్రువీకరణపత్రం ఇవ్వకపోతే అధికారులపై చర్యలు ఉంటాయన్నారు. రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జీలు నేరుగా మిల్లర్ యజమానులు లేదా కస్టోడియం అధికారులతో మాట్లాడాలన్నారు. మిల్లర్‌లు ఇబ్బందులు పెట్టి తక్కువ ధరకు విక్రయించాలని ప్రయత్నిస్తే డెకాయి ఆపరేషన్ చేపడతామన్నారు. ప్రతిరైస్ మిల్లుకు మూడుసే సీసీకెమెరాలు అమర్చాలన్నారు.



పంటలను పరిశీలించి శాస్త్రవేత్తలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అటవీ సంపదకు రెక్కలు

అక్రమంగా తరలిపోతున్న కలప

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం ముత్తాయిపాలెం ఏ, బీ బీట్ల పరిధిలో 4 వేల ఎకరాలకు పైగా అటవీ భూములు ఉన్నాయి. జీడిమామిడితోపాటు యూకలిప్టస్ చెట్లు ఇతర వృక్షాలు పెద్దఎత్తు న ఉన్నాయి. చెట్లు పెద్దవి అయిన తర్వాత ఉన్నతాధికారుల అనుమతితో వేలం నిర్వహించాలి. అందుకు విరుద్ధంగా కొంతమంది ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది సహకారంతో కలప పెద్దఎత్తున అక్రమంగా తరలిస్తున్నారు. అటవీశాఖాధికారుల అండతో నిత్యం పర్యాటకుల రాకపోకలతో రద్దీగా ఉండే సూర్యలంక సముద్రతీరంలోని ఆదర్శనగర్ అటవీప్రాంతంలో పెద్దఎత్తున యూకలిప్టస్ చెట్లు ముక్కలుగా కోసి తరలిస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే చెట్లు కోసి తరలిస్తున్నప్పటికీ ఫారెస్ట్ అధికారులు చోద్యం చూస్తూ వచ్చారు.



ఆదర్శనగర్ అటవీ ప్రాంతంలో యూకలిప్టస్ తోటలు (ఇన్‌సెట్లో) చెట్లు ముక్కలుగా కోసి ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

ఎట్టకేలకు స్పందించిన అధికారులు

అటవీభూములలో పెరిగిన చెట్లను యంత్రాలతో కోయించి అక్రమార్కులు తరలిస్తుండగా స్థానికులు దీనిని చిత్రీకరించి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. దీంతో తప్పని పరిస్థితుల్లో ఫారెస్ట్ అధికారులు స్పందించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హెచ్.జీవన్‌కుమార్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వై.బాలకృష్ణలు సిబ్బందితో కలిసి కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నారు. అప్పటికే కొన్ని ట్రాక్టర్‌ల కలప తరలి వెళ్ళినట్లు గుర్తించారు. ఒకచోట డంప్ చేసిన కలపను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నారు.

53చెట్లు నరికినట్లు గుర్తించాం

ఆదర్శనగర్ అటవీప్రాంతంలో 53 చెట్లను కోసి ముక్కలుగా చేసి ట్రాక్టర్లలో తరలిస్తుంచినట్లు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వై.బాలకృష్ణ తెలిపారు. ఇప్పటికే రెండుట్రాక్టర్‌ల కలపను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంకా ఎక్కడైన డంప్ చేశారా లేక విక్రయించారా అనేదానిపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా చెట్లు నరికిన వారిపై కేసు నమోదు చేశామని, కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు మార్జిన్ల ఆక్రమణ

చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలో రోడ్డు మార్జిన్లు, డ్రెయినేజీలను పలువురు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. స్థానిక 21వ వార్డులో ఓ వ్యక్తి తన ఇంటిని ఆనుకుని రోడ్డు మార్జిన్‌గా ఉన్న కొంత ప్రభుత్వ స్థలాన్ని చదును చేసుకుని నిర్మాణాలు సాగిస్తున్నాడు. దీని వల్ల మురుగుపోయే మార్గం లేక వ్యర్థ జలాలు రోడ్డుపైకి చేరే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఆక్రమణలతో పారిశుధ్య కార్మికులకు చెత్త సేకరణ, డ్రెయిన్‌లో పూడికతీత తలనొప్పిగా మారింది. అధికారులు ఆక్రమణలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. డ్రెయిన్లు, రోడ్డు మార్జిన్లు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ తెలిపారు.



21వ వార్డులో రోడ్డు మార్జిన్‌లో నిర్మాణం

నామ్‌లో భూసేకరణకు రూ.3.44 కోట్లు

మంత్రి గొట్టిపాటి కృషితో నిధులు మంజూరు

అద్దంకి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నార్కెట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల(నామ్) రోడ్డులో అసంపూర్తి పనులకు లైన్‌క్లియర్ అయ్యింది. నామ్ రోడ్డులో అద్దంకి మండలం చక్రాయపాలెం, గోపాలపురం, సంతమాగులూరు మండలం ఏల్చూరు ల వద్ద భూసేకరణకు సంబంధించి రైతులకు పరిహారం చెల్లింపు జరగలేదు. దీంతో గత దశాబ్ద కాలంగా పనులు అసంపూర్తిగా నిలిచి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అసంపూర్తిగా ఉన్న పనులతో పాటు రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ పలుమార్లు సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకుపోయారు.. దీంతో భూసేకరణకు రూ.3.44 కోట్లు మంజూరు చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. రైతులకు పరిహారం చెల్లించి నామ్ రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేస్తామని మంత్రి రవికుమార్ తెలిపారు.



గోపాలపురం వద్ద నిర్మాణం పూర్తి కాకుండా అసంపూర్తిగా ఉన్న నామ్ రోడ్డు



పర్చూరులోని ప్రధాన రోడ్డు పక్కన
డ్రైనేజీలో పేరుకు పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు

- ముందుకు కదలని మురుగు
- అవస్థలు పడుతున్న పారిశుధ్య కార్మికులు

పర్చూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్‌ను నిషేధించాలంటూ పెద్ద ఎత్తున ప్రకటనలు చేస్తున్నా అచరణకు నోచుకుంటున్న దాఖలాలు లేవు. రోజు రోజుకు ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడి కావటంతో సమస్య జటిలంగా మారింది. ప్లాస్టిక్ వాడకంతో ప్రజల ఆరోగ్యం మాట దేవుడికి ఎరుక పారిశుధ్య కార్మికులకు శాపంగా మారింది. అనునిత్యం పారిశుధ్య పనులు చేస్తున్నా ఎక్కడ సమస్య అక్కడే అన్న చందంగా ఉంది పరిస్థితి. దీంతో వినియోగించిన ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీల్లో పారవేయటంతో మురుగు ముందుకు కదలని విధంగా మారింది. ఎక్కడ చూసినా డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలే పెద్ద ఎత్తున దర్శనమిస్తున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించే విధంగా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ఇందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు వస్తాయని ప్రజలు అంటున్నారు.



పొలం పిలుస్తుంది కార్యక్రమంలో
రైతులకు సూచనలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంట అవశేషాలను తగులబెట్టకండి

- రైతులకు ఏవో సూచన

పంగులూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):రైతులు తమ పొలాలలోని పంట అవశేషాలను కాల్చవద్దని మండల వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని భగవాన్‌రాజుపాలెం, రామకూరు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యాక్రమంలో పాల్గొన్న ఏవో మాట్లాడుతూ పంట అవశేషాలను కాల్చితే భూమి నాణ్యత దెబ్బతింటుందన్నారు. పంట అవశేషాలను కాల్చకుండా వాటిని మట్టిలో కలపాలని, కాల్చితే పర్యావరణ కాలుష్యం ఏర్పడటంతో పాటు నేలలోని ముఖ్యమైన పోషకాలు కోల్పోతాయని తెలిపారు. నేలలోని సేంద్రియ కార్బన్ తగ్గడంతో పాటు పంటకు ప్రయోజనకరమైన సూక్ష్మజీవులు నాశనం అవడం, భూమి తేమనిలుపుకునే సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. భూసార పరీక్షలకు అనుగుణంగా పంటసాగులో అవసరమైన మేరకే ఎరువులు వినియోగించాలని సూచించారు. అనంతరం సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

ఆమోదగిరిపట్నం(చీరాల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కుటుంబంలో నెలకొన్న వివాదాలతో వ్యక్తి బలవన్మరణం చెందాడు. ఈ ఘటన చీరాల వన్‌టౌన్ స్టేషన్ పరిధిలోని ఆమోదగిరిపట్నం కేపాల్ కాలనీలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. కాలనీకు చెందిన ఆసోది మహేశ్వరరెడ్డి(45) డైయింగ్ పని చేస్తుంటాడు. ఇతని భార్య, ఇరువురు కుమారులు సంతానం. అయితే ఇటీవల మద్యానికి బానిసగా మారిన ఇతను బుధవారం రాత్రి దుస్తులకు రంగులు అద్దే కెమికల్ తాగి బలవన్మరణం చెందాడు. ఈమేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.



విగతజీవిగా
మహేశ్వరరెడ్డి

అసైన్డ్‌పై కొరడా

(7వ పేజీ తరువాయి)

ప్రభుత్వం తెప్పించుకుంది. దీనితో పాటు వీటిలో ఎన్ని రిజిస్ట్రేషన్ వరకు వెళ్లాయనే అంశంతో పాటు, తిరిగి నిషేధిత జాబితాలో చేర్చడానికి ఉన్న సాధ్యాసాధ్యాలేమిటనే రిపోర్టులు కూడా గతంలోనే ప్రభుత్వం చేతికి అందాయి. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో నెలలోగా నిర్ణయం తీసుకుని, భూ సంబంధిత సమస్యల పరిష్కారం నిర్దిష్ట కాలపరిమితితో జరగాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో అసైన్డ్ అక్రమాలపై కొరడా ఝుళిపించడంతో పాటు, అందుకు బాధ్యులైన వారిపై కూడా చర్యలకు దిగనున్నామనే సంకేతాలను ప్రభుత్వం స్పష్టంగా పంపింది.

చెరువులకు మహర్దశ

(7వ పేజీ తరువాయి)

సర్వే చేయించి చెరువుల వాస్తవిక స్థలాన్ని నిర్ధారించారు. నరసరావుపేట మున్సిపాల్టీలో అభివృద్ధి చేసే కత్తవ చెరువులో 10 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. ఆయా జిల్లాల్లో గుర్తించిన ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. సంబంధింత పనుల టెండర్ 23వ తేదీ గడువుగా ప్రకటించారు. టెండర్ల అనంతరం పనులు చేపట్టేందుకు పబ్లిక్ హెల్త్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

బస్టాండు స్థలాన్ని పరిశీలించిన ఆర్ఎం

పెద్దదోర్నాల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌టీసీ బస్టాండు స్థలాన్ని రీజనల్ మేనేజర్ సత్యనారాయణ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌టీసీ బస్టాండు నిర్మాణం కోసం హద్దులు పరిశీలించినట్లు చెప్పారు. 119,120 సర్వేనెంబరులో గల 94సెంట్లలో నిర్మాణం కోసం పరిపాలన అనుమతులు మంజూరు అయ్యాయని తెలిపారు. అందుకుగానూ క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించామని, నిర్మాణానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో

గంజాయి పట్టివేత

ఒంగోలు క్రైం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో గంజాయి, గంజాయి చాకెట్లను తరలిస్తున్న ఇరువురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో సీసీఎస్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా చెన్నయ్‌కు చెందిన ఇరువురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండటంతో వారిని గుర్తించి పట్టుకున్నారు. నిందితులు ఒడిశా నుంచి చెన్నయ్‌కి కిలో గంజాయి తీసుకొని ఒంగోలు వరకు రైలులో వచ్చారు. అయితే వారి వద్ద టిక్కెట్ లేకపోవడంతో రైల్వే టీసీ ఒంగోలు రైల్వేస్టేషన్‌లో దించివేశాడు. దీంతో వారు ఇరువురు చెన్నయ్‌కు బస్సులో వెళ్ళాలని ఆర్టీసీ డిపోకు వచ్చి సీసీఎస్ పోలీసులకు దొరికిపోయారు. ఈ సందర్భంగా నిందితుల వద్ద నుంచి కిలో గంజాయి, గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్‌లో అప్పగించారు. ఇరువురిని పోలీసులు విచారిస్తున్నారు.

చెన్నై టూ చీమకుర్తి

- రెండు ఆయిల్ ట్యాంకర్లు సీజ్
- ముగ్గురిపై కేసు నమోదు
- రూ.2.70 లక్షలు జీఎస్టీ ఎగవేత

ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ ఆయిల్‌ను డీజిల్‌గా విక్రయాలు

ఒంగోలు క్రైం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ ఆయిల్‌ను డీజిల్‌గా విక్రయిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న ముఠా గుట్టును విజిలెన్స్ అధికారులు రట్టు చేశారు. బుధవారం చెన్నై నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇండస్ట్రియల్ ఆయిల్ రెండు ట్యాంకర్లను సీజ్ చేసి ముగ్గురిపై 6ఏ కేసుకు సిఫార్సు చేశారు. చెన్నై నుంచి అక్రమంగా తరలించి జీఎస్టీ రూ.2.70 లక్షలు చెల్లించకుండా ప్రభుత్వానికి గండి కొడుతున్నారు. ఈ మేరకు సంతనూతలపాడు సమీపంలో రెండు ట్యాంకర్లను నిలిపి విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయగా ఈ బాగోతం బట్టబయలు అయింది.

ముగ్గురిపై కేసు నమోదు

ఒంగోలుకు చెందిన శ్రీనివాస ల్యూబ్స్ అండ్ ఆయిల్ ప్రోడక్ట్స్ యజమాని ఏల్చూరి శ్రీనివాసరావు, నారయణ, చెన్నై, తిరుమన్నమలై దివ్వ ఇండస్ట్రీస్ రాజమణిలపై 6ఏ కేసు జ్యుడీషియల్ కోర్టులో దాఖలు చేస్తున్నారు. జీఎస్టీ చెల్లించకుండా అక్రమరవాణా చేసినందుకు అధికారులు అయిల్ శాంపిల్స్ విశ్లేషణ కోసం నమూనాలు సేకరించారు. శాంపిల్స్ నివేదికలు అందిన తరువాత క్రిమినల్ చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. రెండు టిప్పర్లను సీజ్ చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐలు రాఘవరావు, రవిబాబు, డీసీటీవో రామారావు, ఎస్సై నాగేశ్వరావు, సివిల్ సప్లయిస్ ఏఎస్‌వో పుల్లయ్య సిబ్బంది ఉన్నారు.



అక్రమంగా తరలిస్తున్న ఆయిల్ ట్యాంకర్లను సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

డిజిల్ బదులుగా ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ ఆయిల్

తక్కువ ధరకు దొరికే ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ ఆయిల్‌ను డిజిల్ పేరుతో తక్కువ ధరకు విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. చెన్నైకు చెందిన రాజమణి ఒంగోలులో ఉన్న శ్రీనివాస లూబ్రికెంట్స్ పేరుతో ఏల్చూరి శ్రీనివాసరావుకు ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ ఆయిల్ ను పంపిస్తున్నారు. శ్రీనివాసరావు, చీమకుర్తిలో ఎర్రా నారయణ అనే ఏజెంటు ద్వార అక్కడ క్వారీలు, క్వారీలలో పనిచేసే వాహనాలు, టిప్పర్లకు డిజిల్ తక్కువ ధరకు వస్తుందని విక్రయిస్తున్నారు. చెన్నై నుంచి లీటరు రూ.70కు కొనుగోలు చేసి ఇక్కడ రూ.87 విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో దొరికే డిజిల్ కంటే తక్కువ ధర కావడంతో టిప్పర్ యజమానులు క్వారీ యజమానులు ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ ఆయిల్‌ను కొనుగోలు చేస్తున్నారు.

కోటి సంతకాల సేకరణ బూటకం

- వైసీపీ చీప్‌ట్రిక్స్ మానుకోవాలి
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన కోటి సంతకాల సేకరణ ఒట్టి బూటకమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ధ్వజమెత్తారు. వైసీపీ చీప్ ట్రిక్స్ మానుకుంటే బాగుంటుందని అన్నారు. బుధవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆయన విలేకరులతో మా ట్లాడారు. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిపై ఎందుకు కోటి సంతకాల సేకరణ చేపట్టలేదని ప్రశ్నించారు. రోడ్ల దుస్థితిపై కోటి సంతకాల సేకరణను జగన్ నిర్వహిం చినట్లయితే ప్రజాస్పందనతో అయినా బుద్ధి వచ్చేదన్నా రు. నేడు కోటిసంతకాల కార్యక్రమం విజయవంతం ర్యాలీలో పాల్గొన్న నేతలు వారి పాలనలో అభివృద్ధి ఎందుకు చేయలేకపోయారో కూడా ప్రజలకు చెపాలన్నారు.

కనిగిరి అభివృద్ధికి పాటుపడని నేతలు ఈప్రాంతా నికి వచ్చిన ట్రిపుల్‌ఐటీ కళాశాల ఒంగోలు వెళ్తుంటే ఎందుకు ఆపలేకపోయారో ప్రజలకు సమాధానం చె ప్పాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. నడికుడి రైల్వే మార్గం, బైపాస్, ఆసుపత్రి అభివృద్ధి, ఓవీ రోడ్డు వంటి ప్రజావసరాలను ఎందుకు గాలకొదిలేశారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నపుడు ప్రజాసమస్యలు పరిష్కరించని నేతలు ఇప్పుడు తగదునమ్మా అంటూ కోటి సంతకాల సేకరణ చేపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజాప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన పాలన అందుతుందన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యా ణ్ గ్రామీణాభివృద్ధి కోసం నిధులు కేటాయించారన్నారు. మంత్రి లోకేష్ పారిశ్రామికంగా రాష్ట్రాభివృద్ధికి అహర్ని శలు శ్రమిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చేందుకు ఆయన వయస్సుకు మించి విదేశాల్లో పర్యటిస్తూ రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు.

కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్, కనిగిరి, హెచ్ఎంపాడు మండలాల అధ్యక్షులు కొండా కృష్ణారెడ్డి, సానికొమ్ముతిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), ముస్లిం మైనారిటీ నాయకుడు రోషన్ సంధాని, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి), దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, బాలు ఓబులురెడ్డి, మాజీ ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు యాదవ్, గుడిపాటి ఖాదర్, షరీఫ్, కరణం అరుణమ్మ, తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పంచాయతీగా పెద్దగుడిపాడు?

- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు
- నివేదికలు పంపిన అధికారులు



పెద్దగుడిపాడు గ్రామ వ్యూ

దొనకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దొనకొం డ మండలంలో పెద్దగుడిపాడు, దొండపాడు గ్రామా లు గంగదేవిపల్లి పంచాయతీ పరిధిలో కొనసాగుతు న్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం గంగదేవిపల్లి పంచాయతీ పరిధిలో 3383 మంది జనాభా ఉండగా, 2541 మంది ఓటర్లు ఉన్నారు. గంగదేవిపల్లి గ్రామా నికి రోడ్డుమార్గాన పెద్దగుడిపాడు మూడు కిలోమీ టర్లు, దొండపాడు పదకొండు కిలోమీటర్లు దూరం లో ఉన్నాయి. దీంతో గ్రామ పంచాయతీ పరిధిలో జరిగే గ్రామసభలు, వివిధ ప్రభుత్వ పథకాలు పొందేందుకు, దరఖాస్తులు చేసుకొను నిమిత్తం సచివాలయంకు వెళ్లేందుకు ఆరెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చివరకు రేషన్ బియ్యాన్ని పెద్దగుడిపాడు, దొండపాడు గ్రామాల ప్రజలు గంగదేవిపల్లి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

రాష్ట్రంలో గ్రామ పంచాయతీల విభజన, కొత్త పంచాయతీల ఏర్పాటుచేయాలని ప్రభుత్వం యోచి స్తుంది. దీంతో పెద్దగుడిపాడు, దొండపాడు గ్రామాల ప్రజలు ఏళ్ల తరబడి తాము పడుతున్న ఇబ్బందులను ఇటీవల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి ఏకరువుపెట్టారు. కొత్త పంచాయతీగా పెద్దగుడిపాడు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలంటూ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆమె గంగదేవిపల్లి నుంచి పెద్దగు డిపాడు, దొండపాడు గ్రామా లను విభజించి కొత్త పంచా యతీగా పెద్దగుడిపాడు ఏర్పా టుకు చర్యలు చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు కొత్త గా పెద్దగుడిపాడు పంచా యతీ ఏర్పాటుకు నివేదికలు పంపాలని ఆదేశించారు.

ఉన్నతాధికారులు నిర్దేశిం చిన సమాచారం మేరకు పెద్దగుడిపాడు, దొండపాడు గ్రామాల్లో జనాభా, ఓటర్లు, భౌగోళిక అంశాలతో పాటు పంచాయతీ తీర్మాణంతో పూర్తి నివేదికను ఇటీవల ఉన్నతాధికా రులకు పంపినట్లు సమాచారం. ఇప్పటివరకు మండలంలో 18 గ్రామ పంచాయ తీలు ఉన్నాయి. కొత్తగా 19వ పంచాయతీగా పెద్దగు డిపాడు ఏర్పాటవుతుందనే ఆశతో ఆయాగ్రామాల ప్రజలు ఉన్నారు.

అజ్ఞాతంలో భోక్తలు

(7వ పేజీ తరువాయి)

భావించిన వారు పది రోజుల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది. ఈ కేసులో 11వ నిందితుడైన నాటి డైరెక్టర్ కూనిశెట్టి శివ నవీన్ ఇప్పటికే కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. రాముతో పాటు మిగిలిన నిందితులు కూడా ముందస్తు బెయిల్ ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం.

అక్రమాలు ఇలా..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాతంశెట్టి సీతారామాంజనేయులు 2019 డిసెంబరు 5 నుంచి 2021 ఫిబ్రవరి 13 వరకు, 2021 జూలై 24 నుంచి 2024 జూన్ 7 వరకు రెండు విడతలుగా జీడీసీసీబీ ఛైర్మన్‌గా కొనసాగారు. ఆబ్బీఐ నిబంధనలకు విరుద్ధంగా బోగస్ రుణాల మంజూరు సాగింది. రాము ఛైర్మన్ కాకముందు మిర్చి టిక్కీకి 1500 తాకట్టు రుణంగా పరిమితి రూ.10 లక్షలు ఉండేది. అయితే ఆయన ఛైర్మన్ అయిన తర్వాత టిక్కీకి తాకట్టు రుణాన్ని 1500 నుంచి 2000కు, ఆ తర్వాత 4 వేలకు పెంచేశారు. అంతేకాక రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచారు. నిబంధనలకు విరుద్ధంగా విశ్రాంత ఉద్యోగి యర్రంశెట్టి ఈశ్వరప్రసాద్‌ను చిల్లీస్ స్టాక్ క్వాలిటీ కంట్రోలర్ అండ్ వాల్యూవర్‌గా నియమించుకున్నారు. బోగస్ రైతుల పేరుతో, స్టాక్ లేకపోయినా కోల్డ్ స్టోరేజ్ యజమానులకు ఈశ్వర్‌ప్రసాద్ 2023లో 1347 మందికి తాకట్టు అప్రైజర్ సర్టిఫికెట్లు జారీ చేసి రూ.కోట్లలో రుణాలు నొక్కేశారు. నాటి నల్లపాడు బ్రాంచ్ మేనేజర్ దేవరకొండ అరుణ్ కుమారి 2 దఫాలు అక్కడే మేనేజర్‌గా పనిచేయడమే కాకుండా రెండేళ్లలోనే రెండుసార్లు ఉద్యోగోన్నతి పొందడం వెనుక ఇక్కడ జరిగిన కుంభకోణానికి సంబంధం ఉన్నట్లు విచారణలో తేలింది. ఈమె మేనేజర్‌గా ఉన్న సమయంలో బినామీ వ్యక్తుల పేర్లతో కోల్డ్ స్టోరేజ్ యజమానులు బ్యాంకుకు రాకుండానే వారి సిబ్బందిని పంపి ఎస్‌బీ ఖాతాలు తెరిచారు. రెండు లక్షలకు పైబడిన రుణాలను తప్పనిసరిగా బ్రాంచ్ నుంచి ఆన్‌లైన్ ద్వారా సంబంధిత ఖాతాలకు బదిలీ చేయాలి, కానీ నిబంధనల విరుద్ధంగా బ్యాంకులోనే విత్ డ్రా చేశారు. మిర్చిపై తాకట్టు రుణం తీసుకున్న గడువు ముగిసినా స్టాక్ వేలానికి చర్యలు తీసుకోలేదు. నాటి ఛైర్మన్ రాముతో పాటు నల్లపాడు బ్రాంచ్ మేనేజర్, నాటి సీఈవో, బ్యాంకు డైరెక్టర్లు, అప్రైజర్ అందరూ కుమ్మక్కై 22 కోట్ల 25 లక్షల 5 వేల 439 రూపాయల బోగస్ రుణాలు తీసుకుని బ్యాంకును మోసం చేశారని అధికారుల విచారణలో తేల్చారు.

- లింగాయపాలెంలోని విశ్వసాయి ఫుడ్స్ పేరుతో 12 కోల్డ్ స్టోరేజీలలో మిర్చి స్టాక్ ఉన్నట్లు బినామీ పేర్లతో రుణాలు తీసుకున్నారు.

- అంకిరెడ్డిపాలెంలోని రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్‌లో మిర్చి స్టాక్ లేకపోయినా 13 కోట్ల 15 లక్షల 7 వేల 453 రూపాయలు బోగస్ రుణాలు పొందారు.

- నకిలీ డ్వాక్రా గ్రూపులు సృష్టించి వ్యక్తిగత, దీర్ఘకాలిక రుణాలు సుమారు 9 కోట్ల వరకు తీసుకున్నారు.

- వెంగళాయపాలేనికి చెందిన హోసన్నా మహిళ గ్రూప్ బోగస్ అని డీఆర్డీఏ నిర్ధారించినా రూ.14 లక్షలు రుణాలు ఇవ్వాల్సిందిగా నాటి మేనేజర్ అరుణ్‌కుమారి సిఫార్సు చేశారు.

- సంగడిగుంటకు చెందిన వీరబ్రహ్మేంద్ర మహిళా పొదుపు సంఘానికి రూ.15 లక్షలు మంజూరు చేయాలని ఆమె సిఫారసు చేశారు. అయితే అప్పటికే ఆ గ్రూప్ పేరుతో మరో బ్యాంకులో రూ.8.19 లక్షల రుణం బకాయి ఉంది.

- ఎటువంటి భూములు లేకపోయినా తప్పుడు పత్రాలు సృష్టించి 2021లో కొందరు రూ.9 కోట్లు రుణాలు తీసుకున్నారు. దీనిపై అప్పట్లో నల్లపాడు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు కాగా ఆ కేసు విచారణను ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావుకు అప్పగించారు. ఆయన కేసు విచారించి బ్యాంక్ మేనేజర్, మాజీ తహసీల్దార్ సహా ఇప్పటి వరకు 11 మందిని అరెస్టు చేశారు.

ఇప్పటికే రాముపై భూకబ్జా ఫిర్యాదు

లాల్‌పురంలో తాను 2011లో డీ సెంబర్ 324/ఎ లో 13 సెంట్ల భూమి కొనుగోలు చేసిన స్థలాన్ని రాము కబ్జా చేశాడని, అదేమని ప్రశ్నిస్తే తన కాలు విరగొట్టాడని పట్టాభిపురానికి చెందిన ఉప్పు శంకరరావు రెండు రోజుల క్రితం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తన స్థలాన్ని కబ్జా చేసి గోడ కడుతుండగా పెద్దమనుషులను పంపి ప్రాధేయపడితే దూషించడమే కాక దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తున్నాడన్నారు. దీనిపై విచారించాల్సిందిగా ఎస్పీ నల్లపాడు పోలీసులను ఆదేశించారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ త్రిపాఠి

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దు

- గుంటూరు రేంజ్ ఐజీ సర్వశేష్ఠి త్రిపాఠి

సింగరాయకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎటువంటి రాజీలేకుండా పటిష్టంగా పనిచేయాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశేష్ఠి త్రిపాఠి సూచించారు. సింగరాయకొండ సర్కిల్ కార్యాలయంలో బుధవారం రాత్రి జిల్లాలోని పోలీసుల పనితీరు, నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు, కీలక కేసుల పురోగతి, గంజాయి రావాణా, పలు అంశాలపై ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో నమోదైన కేసుల వివరాలు, వాటి ప్రస్తుత పరిస్థితులపై ఆరాతీశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో అత్యధికంగా నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో పెట్రోలింగ్, గస్తీ పెంచాలని సూచించారు. ప్రజా భద్రతకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి కేసులు తగ్గించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. చెడు నడత గల వ్యక్తులపై నిత్యం నిఘా ఉంచాలన్నారు. గంజాయి రావాణా, సరఫరా అరికట్టేందుకు కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ చెకింగ్ వాహన తనిఖీలు, బారికేడ్లు రిఫ్లెక్టెడ్ డ్రమ్ములు ఏర్పాటు చేయాలని, డ్రంకన్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఒంగోలు, దర్శి, కనిగిరి డీఎస్పీలు రాయపాటి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, సాయి ఈశ్వర్, సీఐలు చావా హజరత్తయ్య, నాగారాజు, రామారావు, ప్రసాద్, రాజేష్‌కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో త్రీ సీటర్ ఛైర్స్ ఏర్పాటు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జీజీహెచ్‌కు విచ్చేసే రోగులు, వారి సహాయకుల కోసం అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాలతో అధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం ఆసుపత్రిలో త్రీసీటర్ ఛైర్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ ఏబీజీ, ఐసీయూలో వేచి ఉండే రోగులు, వారి సహాయకుల కోసం వీటిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటికే ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చొరవతో అనేక మంది దాతలు ముందుకొచ్చి అవసరమైన కుర్చీలు బహూకరించారన్నారు. అలాగే కలెక్టర్ ఆదేశాలతో నూతనంగా 18 ప్రత్యేక ఛైర్‌లను అందుబాటులో ఉంచామన్నారు. ఇటీవల కాలంలో జీజీహెచ్‌లో అందుతున్న మెరుగైన వైద్యసేవలతో రోగుల సంఖ్య పెరిగిందన్నారు. అందుకు అనుగుణంగా అవసరమైన సౌకర్యాలను, వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

మొంథా ఫైటర్స్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్
- పారిశుధ్య కార్మికులు, సచివాలయ, ఇంజనీరింగ్ సిబ్బందికి సన్మానం

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నగరానికి ముప్పు వాటిల్లకుండా ముందస్తు చర్యలతో సమర్థవంతంగా పనిచేసి, ఒంగోలుకు అవార్డు సాధించిన మొంథా ఫైటర్స్ సేవలు అభినందనీయం అని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సచివాలయ సెక్రటరీలు, ఇంజనీరింగ్ సిబ్బంది అభినందన సభ బుధవారం స్థానిక బాలాజీరావు తిరుపతి కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ రాష్ట్రానికి మొంథా తుఫాన్ ముప్పు హెచ్చరికతో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బంది జరగలేదన్నారు. నగరంలో కొంతమేర రోడ్లు దెబ్బతిని నష్టం వాటిల్లినప్పటికీ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి, ఒంగోలుకు మంచి పేరు తీసుకొచ్చారన్నారు. ప్రజారోగ్యం కోసం ప్రతిరోజు కష్టపడి పనిచేసే కార్మికులు, సెక్రటరీలు ఇదే స్ఫూర్తితో ముందుకెళ్ళాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కారానికి తాను ఎల్లవేళలా అండగా ఉంటానని దామచర్ల హామీ ఇచ్చారు. ప్రత్యేక గర్తింపుకార్డులు మంజూరు చేయడంతోపాటు మూడు నెలలకు ఒకసారి ఉచిత వెద్య శిబిరం నిర్వహించి కార్మికుల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తామనిఅన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనార్దన్ పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులకు బియ్యంతోపాటు, నిత్యావసర సరుకులు అందజేసి సత్కరించారు. వారితోపాటు పలువురు సచివాలయ సెక్రటరీలను ప్రత్యేకంగా అభినందించారు.

అవీ.. ఇవీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం జ్యోతి ప్రసాద్‌బాబు

గ్రూపు సభ్యులు పటిష్టంగా ఉండాలి

అద్దంకిటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రూపు మహిళలందరూ ఆర్థికంగా బలోపేతం చెందాలంటే గ్రూపు, సంఘ సభ్యులు పటిష్టంగా ఉండాలని ఏపీఎం జ్యోతి ప్రసాద్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్యలోని ఈసీ సభ్యులకు విజన్ బిల్డింగ్‌పై శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం అ మలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొని ఆదర్శ వంతమైన గ్రూపులుగా తయారు కావాలని, అందుకోసం క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం, తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించేలా చూడాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే అన్ని పథకాలపై అవగాహన పెంచి ఆర్థికంగా అన్ని రంగాలల్లో అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌సీ కోరె విజయభాస్కర్, సీసీలు విజయరాణి, బ్రహ్మయ్య, వెంకయ్య, యేసు, మండల సమాఖ్య ప్రతినిధులు షేక్ కరిమూన్, పచ్చవ భారతి, అంజమ్మ, మాలతి, అకౌంటెంట్ శ్యామల, గ్రామ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

చట్టాలను అతిక్రమిస్తే శిక్షార్హులు

● సీనియర్ న్యాయవాది రవీంద్రనాథ్‌రెడ్డి

పర్చూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చట్టాలను అతిక్రమిస్తే శిక్షార్హులు అవుతారని, చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని సీనియర్ న్యాయవాది ఎం.రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక భవనం అంజిరెడ్డి, తులాబంధుల అర్జునయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు చట్టాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పర్చూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూరిమెట్ల జాన్‌బాబు ఆధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శేషుకుమారి, న్యాయవాదులు కాసా అశోక్ కుమార్, షేక్.రుక్సానా, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, తదితరులు

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

అద్దంకిటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిలభారత మహాసభలు విశాఖపట్నంలో ఈ నెల 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు జరగనున్నాయని నాయకులు, కార్యకర్తలు, కార్మికులు అందరు పాల్గొని జయప్రదం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె. ధనలక్ష్మి కోరారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 2వేల మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందర్, అద్దంకి కార్యదర్శి కె. వెంకటేశ్వర్లు, వీవోఏ సంఘం జిల్లా అధ్యక్షురాలు పుణ్యలక్ష్మి, మండల సంఘం నాయకులు కృష్ణకుమారి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

ఆటోనగర్ స్థలాలు వాస్తవ లబ్ధిదారులకు అందజేయండి

ఈపూరుపాలెం(చీరాల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈపూరుపాలెం ఆటోనగర్ స్థలాలను వాస్తవ లబ్ధిదారులకు అందజేయాలని పలువురు చీరాల తాలూకా ఆటో మొబైల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం వారు నిరసన ర్యాలీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆటోనగర్ స్థలాలు గతంలో తమకే ఇస్తామని డీడీలు చెల్లించుకున్నట్లు చెప్పారు. అయితే ఏపీసీ మాట మార్చి స్థానికేతరులకు అప్పగిస్తున్నట్లు ఆరోపించారు.

హైందవ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ

ఈనెల 21వ తేదీన పట్టణంలోని ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ మైదానంలో హైందవ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈక్రమంలో అందుకు సంబంధించిన కరపత్రాలను నిర్వాహకులతో కలిసి వాడరేవు ఆశ్రమ రామానంద స్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మువ్వల వెంకటరమణ, తులసీరామ్, శివయ్య, శ్రీనివాస్, రామకృష్ణ, మణి, మహేష్, మల్లికార్జున్, రఘు, సాయి, మనోహరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థులకు లైఫ్ ఇన్సూరెన్స్ స్కాలర్‌షిప్

వేటపాలెం(చీరాల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ఇంజనీరింగ్ విభాగం నుంచి దాక్షిణ్య, ఈసీఈ విభాగం విద్యార్థులు ఆర్ గీతా మాధురి, వీ. పావనీలు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ వారి స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా బుధవారం కళాశాలలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ డా.జగదీష్‌లు ప్రత్యేకంగా అభినందించారు. వీరికి ఏటా ఒక్కొక్కరికి రూ.30 వేలు చొప్పున నాలుగేళ్ల నగదు అందుతుందని చెప్పారు.

ఫ్రెండ్లీ పోలీస్

వాహనచోదకుల ప్రాణ రక్షణపై ప్రత్యేక దృష్టి

అపరాధ రుసుంకు బదులు తక్కువ ధరకు హెల్మెట్‌లు కొనుగోలు చేసేలా చర్యలు



వాహనచోదకులకు హెల్మెట్లు అందజేస్తున్న సంతమాగులూరు ఎస్ఐ

అద్దంకి,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనచోదకులు ప్రయాణిస్తుంటే సాధారణంగా పోలీస్‌శాఖ అధికారులు అపరాధ రుసుం విధిస్తూ ఉంటారు. వాహనచోదకులు కూడా ఎన్నిసార్లు అయినా అపరాధ రుసుం చెల్లిస్తుంటారే కాని హెల్మెట్ మాత్రం కొనుగోలు చేయడం లేదు. దీంతో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తుంటే కేసు నమోదు చేస్తే రూ.1,050 చెల్లించాల్సి ఉంటుంది. అయితే సంతమాగులూరు సీఐ కాకుమాను వెంకటరావు, ఎస్సై మేదరమెట్ల పట్టాభిరామయ్యలు వినూత్నంగా ఆలోచించారు. ద్విచక్ర వాహన చోదకుల జేబులు చిల్లు కాకుండా ఉండటంతో పాటు ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాలు రక్షించుకునే వీలుండే విధంగా హెల్మెట్‌లను కొనుగోలు చేయించాలని నిర్ణయించారు. దీంతో వాహనచోదకులకు భారం కాకుడదన్న ఉద్దేశంతో తక్కువ ధరకు హోల్‌సేల్‌గా తెప్పించి ఎలాంటి లాభం లేకుండా కొనుగోలు ధరకే స్థానికంగా అమ్మకాలు చేసేలా చర్యలు చేపట్టారు. సంతమాగులూరు మండలం అడ్డరోడ్డు వద్ద రెండు ద్విచక్ర వాహనాల షోరూమ్‌లు ఉండటంతో యజమానులతో సంప్రదించి సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయింపు చేసి అమ్మకాలు చేసేలా చర్యలు చేపట్టారు.

హెల్మెట్ సాధారణంగా 900 రూపాయలు నుంచి వెయ్యి రూపాయల వరకు ధర ఉంటుండగా నేరుగా కొనుగోలు చేయించటంతో 800 రూపాయలకే వచ్చాయి. ఆ మొత్తానే హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపే వారి చేత కొనుగోలు చేయించే ప్రక్రియను చేపట్టారు. దీంతో ద్విచక్ర వాహనచోదకులు అపరాధ రుసుం చెల్లించే కంటే హెల్మెట్ కొనుగోలు చేయటం తక్కువ ఖర్చు అవుతుండటంతో ఎక్కువ మంది ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్‌లు కొనుగోలు చేయటానికే మొగ్గు చూపుతున్నారు. ఎస్సై పట్టాభిరామయ్య కూడా అపరాధ రుసుం విధించకుండా హెల్మెట్‌లు కొనుగోలు చేయించటంపైనే అవగాహన కల్పిస్తుండటంతో పలువురు అభినందిస్తున్నారు.

మినీ బైపాస్‌కు ముందస్తుగా.. గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

అద్దంకి,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి):అద్దంకి పట్టణం లో మినీ బైపాస్ నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో కాలువ రెండు వైపులా కట్టలను విస్తరించేందుకు గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం నుంచి అభ్యుదయనగర్, వాసవినగర్ మీదుగా నామ్ రోడ్డు లో సూర్య రెస్టారెంట్ వద్ద కలిసే విధంగా సుమారు 1.6 కి.మీ దూరం సుమారు 15 కోట్ల రూపాయలతో మినీ బైపాస్ నిర్మాణం చేయనున్నారు. త్వరలో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కానున్న నేపథ్యంలో ముందస్తుగా కాలువకు రెండు వైపులా ఉన్న కట్టలను విస్తరించేందుకు గ్రావెల్ తోలుతున్నారు. మినీ బైపాస్‌గా మారనున్న ఎస్ఎస్‌పీ కాలువ వెడల్పు 70 అడుగుల నుంచి 90 అడుగుల వరకు ఉంది. కొన్ని చోట్ల 70 అడుగులు మాత్రమే ఉండటంతో మినీ బైపాస్ రోడ్డు మొత్తం 70 అడుగుల వెడల్పు ఉండే విధంగా నిర్మాణం చేసే అవకాశం ఉంది. ఎక్కువ వెడల్పు ఉన్న ఖాళీ ప్రదేశాన్ని ఇతర అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంది. కాలువ కట్టలను ఆక్రమించి నివాసాలు ఉండే కుటుంబాలకు ఇప్పటికే అద్దంకి కొండ వద్ద స్థలాల కేటాయించారు. స్థలాలు కేటాయించిన ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఇప్పటికే రోడ్ల నిర్మాణం, బోర్లు ఏర్పాటు జరగగా మంగళవారం నుంచి విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో త్వరలో ఇళ్ల ఖాళీ చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

మినీ బైపాస్ రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మాణం చేయనున్న నేపథ్యంలో నేల పటిష్టంగా ఉండేందుకు ముందస్తుగా గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. దీంతో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం వేగవంతంగా పూర్తయ్యే అవకాశం ఉంది.



అద్దంకిలో కాలువ కట్టను మినీ బైపాస్‌గా మార్చేందుకు తోలుతున్న గ్రావెల్



అద్దంకి కొండ వద్ద పునరావాసం కోసం కేటాయించిన స్థలాలలో వేస్తున్న విద్యుత్ లైన్లు, నిర్మాణం చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

వైభవంగా ఇరుముడి పూజలు

చినగంజాం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో వేంచేసి యున్న హరిహరసుత అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్ప దీక్షాధారుల ఇరుముడి పూజల కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేవస్థానంలోని స్వామివారిని ఆలయ పూజారి విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ డాక్టర్ టీఎస్ఆర్.ఆంజనేయులు ఆధ్వర్యంలో గురుస్వాములు నరహరి బుజ్జాయి, చెరుకూరి రాఘవయ్య, రాయని వెంకటేశ్వరరావులు దీక్షధారణ చేసిన 75 మంది అయ్యప్పస్వాములకు శాస్త్రోక్తంగా ఇరుముడుల కార్యక్రమాన్ని నిర్వహించారు.

దేవస్థాన ప్రాం గణం అయ్యప్పస్వామి నామస్మరణతో మారుమోగింది. గ్రామానికి చెందిన పర్వతరెడ్డి వెంకటరావు, యానాదమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు బ్రహ్మనాయుడు, నాగేశ్వరరావు, వాసుదేవరావులు ఆల య ప్రాంగణంలో దీక్షాధారులకు, భక్తులకు అన్నసంతర్పణ చేశారు.



అయ్యప్పస్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పార్వతీ పరమేశ్వరుని నృత్య ప్రదర్శన తిలకిస్తున్న దీక్షాధారులు

పడిపూజా మహోత్సవం

- అలరించిన పార్వతీ పరమేశ్వరుల నృత్య ప్రదర్శన

హరిప్రసాద్‌నగర్(చీరాల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని హరిప్రసాద్‌నగర్‌లో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద ఎత్తున దీక్షాధారులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాకుండా పార్వతీ పరమేశ్వరుల వేషధారణాలతో కళాకారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు.

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్‌ను రద్దు చేయాలి

● యూటీఎఫ్ నేతల డిమాండ్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

అద్దంకిటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సర్వీస్‌లో ఉన్న టీచర్లు రెండు సంవత్సరాలలోపు టెట్ పరీక్ష పాస్ అవ్వాలని, లేకుంటే వారిని సర్వీస్ నుంచి తొలగించాలనే సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పున: సమీక్షించాలని యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బి. పూర్ణచంద్రరావు అన్నారు. బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ రద్దు చేయాలని కోరుతూ స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఈ నిర్ణయం వలన రాష్ట్రంలో దాదాపు లక్ష మంది ఉపాధ్యాయులు ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. స్థానిక బంగ్లారోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీచరణ్‌కు వినతి పత్రం అందజేశారు.

ఈకార్యక్రమంలో అధ్యక్షుడు ఈ. రామారావు, యూటీఎఫ్ సీనియర్ నాయకుడు జె. బాబురావు, సోమేపల్లి హనుమంతరావు, బి.వి.రత్నం, చంద్రశేఖర్, కే. గంగాధర్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల ర్యాలీ

అద్దంకి,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ను నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా అద్దంకి నియోజకవర్గంలో సంతకాలు సేకరించారు. సేకరించిన సంతకాలను జిల్లా కార్యాలయంకు పంపించే కార్యక్రమంలో భాగంగా బుధవారం వైసీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కర్నేటి వెంకట ప్రసాద్‌ల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పలు గ్రామాల వైసీపీ నేతలు పాల్గొన్నారు.

హక్కులతో పాటు బాధ్యతలు కూడా తెలుసుకోవాలి

అద్దంకి,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ హక్కులతో పాటు బాధ్యతలు కూడా తెలుసుకోవాలని న్యాయవాది టి. మార్తాశ్రీను అన్నారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక హర్షిణి డిగ్రీ కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మహ్మద్‌రఫీ,. దనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈశ్వరీమహాదేవి 236వ ఆరాధన

అద్దంకిటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీమద్విరాట్ పోతులూరి వీ రబ్రహ్మేంద్ర స్వామి వారి మనుమరాలు ఈశ్వరీమహాదేవి 236వ ఆరాధన , గురుపూజ మహోత్సవం ఈ నెల 13వ తేదీన కాకానిపాలెం వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలో జరుగుతుందని దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉదయం 7 గంటలకు అష్టోత్తర అభిషేకం జరుగుతుందని తెలిపారు. భక్తులు అందరు పాల్గొని తీర్థ ప్రసాదాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మనందం, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నుపల్లి శ్రీనివాసాచారి, ఏలూరి వీరబ్రహ్మాచారి, జాగర్లమూడి శ్రీనివాసరావు, మిద్దెబోయిన ఆంజనేయరాజు, చోడా వెంకట సుబ్బారావులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

మదురై రోడ్డు ప్రమాదంలో దీక్షాధారుడి మృతి

● శబరిమల నుంచి తిరిగి వస్తున్న సమయంలో ఘటన

● అక్కయ్యపాలెం గ్రామంలో విషాదఛాయలు



ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు (ఇన్‌సెట్లో వెంకటరావు (ఫైల్)

అక్కయ్యపాలెం(చీరాల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మదురైలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వేటపాలెం మండలం అక్కయ్యపాలెంకు చెందిన అయ్యప్ప దీక్షాధారుడు మృత్యువాత పడ్డాడు. అందిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గవిని వెంకటరావు(47) ఆటో డ్రైవర్. ఇతనికి భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అయ్యప్ప దీక్ష చేపట్టిన ఆయన అందరితో కలిసి రెండు బస్సులలో ఈనెల 4వ తేదీన శబరిమల వెళ్లారు అక్కడ ఇరుముడి చెల్లించుకుని తిరిగివచ్చే క్రమంలో మదురై వద్ద భిక్షచేసేందుకు జాతీయ రహదారి వెంబడి ఆగారు. ఈనేపథ్యంలో అక్కడ రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం వెంకటరావును వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందగా పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదురై రీజనల్ ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

గ్రామీణ రహదారులకు మహర్దశ

● రూ.10 కోట్లతో అంతర్గత రోడ్లకు శ్రీకారం

● ప్రజలకు తీరనున్న కష్టాలు



ముఖ్యమంత్రికి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)

చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతవాసుల కష్టాలు తీరనున్నాయి. కూటమి ప్రభు త్వం పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.10 కోట్ల నిధులు విడుదల చేసింది. దీంతో గ్రామాల్లో సుమారు 20 కిలో మీటర్ల అంతర్గత రహదారుల ఏర్పాటు చేయనున్నారు. నియోజకవర్గంలోని సమస్యలను ఎమ్మెల్యే కొండయ్య పలుమార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈక్రమంలో సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేశారు. దీంతో వేటపాలెం - తిమ్మ సముద్రం రహదారి, ఈపూరుపాలెం నుంచి గవినివారి పాలెం , పుల్లాయి పాలెం వయా వెదుళ్లపల్లి వరకు నిర్మాణాలు చేయనున్నారు. అంతే కాకుండా దండుబాట రోడ్డు నుంచి రంగప్పనాయుడు వారి పాలెం వరకు, జీబీసీ రోడ్డు నుంచి వయా కొత్తపాలెం మీదుగా గాంధీనగర్ వరకు, చెన్నకేశవస్వామి టెంపుల్ నుంచి వయా దండుబాట మీదుగా పాత చీరాల వరకు, వాడరేవు నుంచి కీర్తివారి పాలెం మీదుగా బుర్లవారిపాలెం వరకు అలాగే ఈసూబ్‌నగర్ నుంచి బోయినవారి పాలెం వరకు రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. దీంతో సుదీర్ఘకాల సమస్యలు పరిష్కారం కానుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కుక్కల దాడిలో 8 జీవాలు మృతి



మృతిచెందిన గొర్రెలను చూపుతున్న బాధితురాలు

ఇంకొల్లు, డిసెంబరు 10,(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగండ్లలో మంగళవారం అర్ధరాత్రి ఓ కొష్టంలో ఉన్న గొర్రెలపై వీధికుక్కలు దాడి చేయడంతో 8 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మేకల అంజనా గొర్రెలను మేపుకున్న అనంతరం మంగళవారం రాత్రి తమ కొష్టంలో ఉంచగా అర్ధరాత్రి వేళలో వీధి కుక్కలు దాడి చేశాయని బాధితురాలు తెలిపింది. వీటి విలువ రూ.లక్ష ఉంటుందని, గొర్రెలు మృతి చెందటంతో జీవనోపాధి కోల్పోయానని బాధితురాలు వాపోయింది. ఘటనా స్థలాన్ని గ్రామసర్పంచ్ కంచుగంటి పద్మ పరిశీలించారు.ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని ఆమె విన్నవించింది.

కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిగా 'బాచిన' నియామకం



బాచిన హనుమంతరావు

పంగులూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిగా పంగులూరుకు చెందిన బాచిన హనుమంతరావు నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వం తరుపునకేసులు వాదించేందుకు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ పలువురు న్యాయవాదులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో పంగులూరుకు చెందిన హైకోర్టు న్యాయవాది బాచిన హనుమంతరావుకు చోటు లభించింది. హైకోర్టు న్యాయవాది బాచిన హనుమంతరావు ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగే అవకాశం కల్పించింది. ఆయన గతంలో హైకోర్టు న్యాయవాదుల సంఘానికి కార్యదర్శిగా పనిచేశారు. న్యాయవాది బాచిన హనుమంతరావు ప్రస్తుతం పలు నేషనలైజ్డ్ బ్యాంకులకు ప్యానల్ అడ్వకేట్‌గా కొనసాగుతున్నారు.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

అద్దంకిటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు.పువ్వాడ రామకోటేశ్వరరావు సౌజన్యంతో 10వ తరగతి చదువుతున్న 140 మంది విద్యార్థులకు యూటీఎఫ్ వారి స్టడీ మెటీరియల్ అందజేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాచిన పూర్ణచంద్రరావు తెలిపారు.

నానో యూరియాతో అధిక దిగుబడులు

అద్దంకిటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసిన రైతులు నానో యూరియా వాడకం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఉద్యాన శాఖ హెచ్‌వో ఎస్. దీప్తి అన్నారు. బుధవారం మండలంలోని కొటికలపూడి, కుంకుపాడు గ్రామాల్లో పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో సాగు చేస్తున్న పలు పంటలను ఆమె పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న పంట సాగు చేస్తున్న రైతులు తప్పని సరిగా యూరియాకి ప్రత్యామ్నాయంగా నానో యూరియా ఎకరాకు 500 ఎంఎల్ వాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ ఉద్యాన సహాయకురాలు సుకన్య, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



పోలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల ఉద్యానశాఖ హెచ్‌వో దీప్తి

శభాష్ శుక్లా..!

- ఫైళ్ల పరిష్కారంలో కలెక్టర్ హిమాన్షు వేగం
- 17 గంటలకో ఫైల్ క్లియర్...
- మూడు నెలల్లో 682 దస్త్రాలకు 628 క్లియరెన్స్
- రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం.. సీఎం అభినందన

నెల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల నుంచి వచ్చే ఫైళ్లను వేగంగా క్లియర్ చేయడంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా దూకుడుగా ఉన్నారు. తన వద్దకు ఫైల్ వచ్చిన 24 గంటల్లోనే ఆ ఫైల్‌ను చూడడం, డిస్పోస్ చేయడం చేసేస్తున్నారు. ఫైళ్లను పెండింగ్ పెట్టకుండా సరాసరి 17 గంటల్లోనే తనకు వచ్చే ఫైల్‌ను తిరిగి పంపుతున్నారు. ఈ పనితీరుతో రాష్ట్రంలోనే ఫైళ్లను వేగంగా క్లియర్ చేస్తున్న కలెక్టర్ల జాబితాలో హిమాన్షు శుక్లా రెండో స్థానంలో నిలిచారు. ఈ-ఆఫీస్ ఫైళ్ల క్లియరెన్స్, డిస్పోజల్‌కు సంబంధించి గత మూడు నెలల రిపోర్ట్‌ను ఐటీ శాఖ విడుదల చేసింది. ఇందులో మంత్రులు, సెక్రటరీలు, కలెక్టర్లు, జేసీ ఎంత సమయంలోపు ఫైళ్లను క్లియర్ చేస్తున్నారన్నది స్పష్టం చేసింది. గత మూడు నెలల్లో కలెక్టర్ శుక్లా లాగిన్‌కు 682 ఫైళ్లు రాగా, మంగళవారానికి 628 ఫైళ్లను క్లియర్ చేశారు. ఇక జేసీ మొగిలి వెంకటేశ్వర్లు ఫైల్‌ను సరాసరి రెండు రోజుల 10 గంటల్లో డిస్పోజ్ చేస్తున్నారు. తన వద్దకు ఈ మూడు నెలల్లో 1163 ఫైళ్లు రాగా, మంగళవారానికి 976 ఫైళ్లను క్లియర్ చేశారు. ఇక జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలకు సంబంధించి పూర్తి రిపోర్ట్ కూడా విడుదల చేశారు. మంత్రి నారాయణ ఇప్పటి వరకూ 2500 ఫైళ్లను డిస్పోజ్ చేశారు. సరాసరి మూడు రోజుల 8 గంటల్లో ఫైల్‌ను క్లియర్ చేస్తున్నారు. మరో మంత్రి ఆనం ఇప్పటి వరకూ 803 ఫైళ్లను డిస్పోజ్ చేశారు. సరాసరి 5 రోజుల 19 గంటల్లో ఫైల్‌ను క్లియర్ చేశారు. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్ శుక్లాను అభినందించారు.



ఇసుక భారం..
ఇంకెంత కాలం?



నెల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న సామెతగా, వాతావరణం సహకరించినా సామాన్యులపై మాత్రం ఇసుక భారం తగ్గలేదు. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తున్నా, ఆ ఫలాలు ప్రజలకు పూర్తిగా అందడం లేదు. ప్రభుత్వం చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వేలోనే ఈ విషయం స్పష్టమైంది. ఇసుక ధరలపై జిల్లాలో 50.40 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేయగా, 49.60 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక పాలసీ అమల్లో రాష్ట్రంలోని అన్నీ జిల్లాలతో పోలిస్తే చిట్టచివర నుంచి రెండో స్థానంలో జిల్లా నిలవడం చర్చనీయాంశంగా మారింది.

అంతా గూడుపుఠాణి

వినియోగం ఎక్కువగా ఉండే నెల్లూరు, కావలి ప్రాంతాలకు నెల్లూరు నగరానికి సమీపాన ఉన్న ఇసుక రీచ్‌లే ఆధారం. ప్రస్తుతం పోతిరెడ్డిపాలెం వద్ద డీసిల్టింగ్ పాయింట్ ఉండగా, పక్కనే మినగల్లు, పల్లిపాలెంలో ఓపెన్ రీచ్‌లు ఉన్నాయి. అయితే ఒక్క పోతిరెడ్డిపాలెం వద్ద స్టాక్ పాయింట్‌లోనే ఇసుక విక్రయాలు చేస్తున్నారు. మినగల్లు, పల్లిపాలెం ఓపెన్ రీచ్‌లను ఆపరేట్ చేయడం లేదు. ఈ రెండూ ఓపెన్ చేస్తే పోతిరెడ్డిపాలెం స్టాక్ పాయింట్ వద్ద విక్రయాలు తగ్గిపోతాయన్న భయంతోనే వ్యాపారులు గూడుపుఠాణిగా మారారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పోతిరెడ్డిపాలెం స్టాక్ పాయింట్ వద్ద టన్ను ఇసుక ధర రూ.250గా ఉంది. అంటే 30 టన్నులు తీసుకెళ్లే ట్రిప్పర్‌కు ఇసుక కొనుగోలు రూ.7500 వరకూ ఉంటోంది. అదే మినగల్లు, పల్లిపాలెం ఓపెన్ రీచ్‌లలో అయితే టన్ను ధర రూ.58 గా ఉంది. ఈ లెక్కన చూసుకుంటే ట్రిప్పర్ ఇసుక కొనుగోలు రూ.1740 మాత్రమే ఉంటుంది. అంటే స్టాక్ పాయింట్‌కు, ఓపెన్ రీచ్‌లకు మధ్య వ్యత్యాసం ఒక ట్రిప్పర్‌కు సుమారు రూ.5,500 వరకూ ఉంటోంది. ఈ అధిక ధరే ప్రజలకు భారంగా మారింది.

భారీగానే ఇసుక ధరలు

గతవారం ఉచిత ఇసుక పథకంపై సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్షించారు. జిల్లాలో సంతృప్తి శాతం బాగా తగ్గడంపై చర్చించారు. ప్రధానంగా జిల్లాలో ఇసుక వినియోగం నెల్లూరు, కావలి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంది. రోజుకు సరాసరి మూడువేల టన్నుల ఇసుక వాడకం జరిగితే, ఈ రెండు ప్రాంతాల్లోనే రెండు వేల టన్నులకుపైగా వినియోగిస్తున్నారు. కానీ ఇక్కడ ఇసుక ధరలు భారీగా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ట్రిప్పర్ ఇసుక రూ.20 వేలకుపైగా ఉండగా, ఉచిత ఇసుక పాలసీతో అది రూ.10 వేలోపునకు రావాలి. కానీ ఇప్పటికీ రూ.15 వేలకు తగ్గకుండా వ్యాపారులు విక్రయిస్తున్నారు.

ఎందుకు 'ఓపెన్' చేయరు?

మాన్‌సూన్ సీజన్‌లో ఇసుకకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం నదుల్లో తవ్వకాలు జరిపేందుకు వీల్లేకపోవడంతో కేవలం స్టాక్ పాయింట్లలోని ఇసుకనే వినియోగించాల్సి వచ్చింది. ధర ఎక్కువైనా ప్రజలు ఈ పాయింట్లనే ఆశ్రయించారు. కానీ ఇప్పుడు మాన్‌సూన్ సీజన్ ముగిసింది. అక్టోబరు 15 నుంచి పెన్నానదిలోని ఓపెన్ ,రీచ్‌లలో నేరుగా ఇసుక తవ్వకాలు జరుపుకోవచ్చు. కానీ ఇప్పటికీ ఓపెన్ రీచ్‌లు పూర్తిస్థాయిలో ఆపరేషన్‌లోకి రాలేదు.

జిల్లాలో పల్లిపాలెం, మినగల్లు, అప్పారావుపాలెం, పీకేపాడు, విరువూరు ఓపెన్ రీచ్‌లు ఉన్నాయి. వీటిలో పీకేపాడు, విరువూరు రీచ్‌లు తెరిచినట్లు మైనింగ్ అధికారులు చెబుతున్నారు. అలానే అప్పారావుపాలెం, పల్లిపాలెం రీచ్‌లకు పర్యావరణ అనుమతులు (ఈసీ) గడువు ముగిసింది. దీంతో అక్కడ తవ్వకాలు ఆగిపోయాయి. ఈసీ ముగుస్తుందని తెలిసినా ఇన్ని రోజులు అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారో వారే చెప్పాలి. ఇక మినగల్లు రీచ్‌కు ఎలాంటి సమస్య లేకపోయినా కాంట్రాక్టర్ తవ్వకాలు మొదలుపెట్టలేదు. ఈ ప్రభావంతోనే ఇసుక ధరలు అధికంగా ఉన్నట్లు ట్రాన్స్‌పోర్టర్లు చెబుతున్నారు.

- మాన్‌సూన్ ముగిసినా తెరుచుకోని ఓపెన్ రీచ్‌లు
- అన్నీ అనుమతులున్నా మినగల్లు మూత
- అప్పారావుపాలెం, పల్లిపాలెంకు నో ఈసీ
- నెల్లూరు, కావలికి పోతిరెడ్డిపాలెం ఒక్కటే దిక్కు
- అధిక ధరలతో సామాన్యులపై ఆర్థిక భారం
- ప్రభుత్వ సర్వేలోనూ ఉచిత పాలసీపై అసంతృప్తి

ఓపెన్ చేసేందుకు చర్యలు

అప్పారావుపాలెం, పల్లిపాలెం ఓపెన్ రీచ్‌లకు ఈసీ గడువు ముగిసింది. అయితే తాజాగా ఈసీ గడువు తీసుకునేందుకు అనుమతి వచ్చింది. స్థానిక సమస్యల కారణంగా మినగల్లు రీచ్‌లో తవ్వకాలు జరపలేదని కాంట్రాక్టర్ చెబుతున్నారు. త్వరలోనే ఓపెన్ రీచ్‌ల్లో ఇసుక విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసరావు, మైనింగ్ డీడీ

తొలిరోజు టెట్ ప్రశాంతం

జిల్లాలో 677 మంది హాజరు

నెల్లూరు (విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంపిక చేసిన ఆరుకేంద్రాల్లో తొలిరోజు బుధవారం టీచర్స్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్)ను ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 709 మంది దరఖాస్తు చేసుకోగా, 677 మంది హాజరయ్యారు. 32 మంది గైర్హాజరయ్యారని డీఈవో బాలాజీరావు తెలిపారు. ఈనెల 21 వరకు జరిగే ఈ పరీక్షకు అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే రెండో సెషన్‌కు హాజరు కావాల న్నారు. పరీక్షకు రెండు గంటల ముందుగా కేంద్రానికి చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డీఈవో తెలిపారు.



నెల్లూరులో పరీక్ష రాసి వస్తున్న అభ్యర్థులు

నేడు విలువల విద్యా సదస్సు

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు హాజరు

నెల్లూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైతికత, నిజాయితీ, సానుభూతి, బాధ్యత వంటి ప్రాథమిక విలువలు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న విలువల విద్య(వాల్యూ ఎడ్యుకేషన్) సదస్సును నెల్లూరులో గురువారం నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగే ఈ కార్యక్రమానికి ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు హాజరై, పాఠశాల విద్యార్థులతో మాట్లాడనున్నట్లు డీఈవో డాక్టర్ బాలాజీరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమానికి ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి, ఏఎస్‌పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా అధికారులు హాజరవుతారని ఆయ న తెలిపారు. విద్యార్థులం తా సమయానికి హాజరై క్రమశిక్షణతో కార్యక్రమంలో పాల్గొనేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని డీఈవో పేర్కొన్నారు.

గజ గజ..!!

- జిల్లాపై చలి పంజా
- కమ్ముకుంటున్న పొగ మంచు
- వణుకుతున్న ప్రజలు
- రోజురోజుకు పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- విజృంభిస్తున్న వ్యాధులు

ఆత్మకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాపై చలి పంజా విసురుతోంది. తెల్లారేసరికి పొగ మంచు కమ్మేస్తోంది. నిన్నమొన్నటి వరకు తొలిపొద్దు నుంచే భానుడు కనిపిస్తుండగా, ఇప్పుడేమో బారెడు పొద్దెక్కినా కానరావడం లేదు. రోజురోజుకు శీతల పవనాలు ఎక్కువగా వీస్తుండడంతో ప్రజలు గజగజలాడుతున్నారు. మరోవైపు వ్యాధులు విజృంభిస్తున్నాయి.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతున్నాయి. దీంతో చలితీవ్రతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. చలికి తట్టుకోలేక వృద్ధులు, చిన్నారులు వణికిపోతున్నారు. పల్లెల్లో కొందరైతే ఇళ్ల ముందు మంటలు వేసుకుని చలి కాచుకుంటున్నారు. మరికొందరు మంచం పక్కన నిప్పుల కుంపటి ఏర్పాటు చేసుకుని వెచ్చగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రాబోవు రోజుల్లో చలి మరింత తీవ్రంగా ఉండవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

నైట్‌షెల్టర్ల ఏర్పాటు అవసరం

చీకటి పడగానే చలి తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి బయపడుతున్నారు. రోడ్డు పక్కన, బస్టాండ్లలో తలదాచుకునే వారి పరిస్థితి దయనీయంగా ఉంది. నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో రోడ్ల పక్కన, బస్, రైల్వే స్టేషన్లలో పెద్ద సంఖ్యలో అనాథలు జీవిస్తున్నారు. వారికి నైట్ షెల్టర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

రోడ్లను కప్పేస్తున్న మంచు

జిల్లాలో రహదారులను మంచు దుప్పటి కప్పేస్తోంది. పొగమంచు వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. కొందరు వాహనాలను రోడ్డు పక్కన నిలిపేస్తుండగా, మరి కొందరు ముందుకు సాగి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.

విజృంభిస్తున్న వ్యాధులు

చలికాలం వల్ల వ్యాధులు ప్రబలుతున్నాయి. పసిపిల్లలు, వృద్ధులు ఎక్కువగా రోగాల బారిన పడుతున్నారు. శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్నాయి. వృద్ధుల్లో అయితే రక్తప్రసరణ తగ్గి కాళ్లు, చేతులు చచ్చుబడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు, ఇళ్లలోనే వెచ్చగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కాగా మంచు ప్రజలతోపాటు పంటలకు కూడా హాని చేస్తుంది. తెగుళ్లు విస్తరిస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు.

వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఇలా..

తేది	గరిష్ఠం	కనిష్ఠం
4	29	22
5	29	22
6	29	20
7	29	20
8	29	19
9	29	18
10	28	11



పంట పొలాలపై మంచు తెర



మంచు ప్రమాదకరం

చలికాలంలో ఎక్కువగా వ్యాధులు ప్రబలేఅవకాశం ఉంది. వృద్ధులు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా శాసకోశ సంబంధిత వ్యాధులు ఉన్నవారు చలికాలంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మధుమేహ బాధితుల్లో వ్యాధి నిరోధకశక్తి తగ్గి, పక్షవాతం, ఇతర వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ఉబ్బసం ఉన్న వారికి చలికాలం చేటు తెస్తుంది.

- డాక్టర్ అస్మా, అర్బన్ ప్రభుత్వ వైద్యశాల, ఆత్మకూరు



కత్తితో పొడిచిన గాయాన్ని చూపుతున్న బాబు

సాయం చేసేందుకు వస్తే
కత్తితో దాడి

- వెంకటేశ్వరపురంలో రెచ్చిపోయిన ఆకతాయిలు
- ఐజీ జిల్లాలో ఉండగానే దారుణం
- పోలీసుల అదుపులో నిందితులు
- వరుస ఘటనలతో నగరవాసుల బెంబేలు

నెల్లూరు(వెంకటేశ్వరపురం) డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరపురం విజయ డెయిరీ ప్రాంతంలో బుధవారం సాయంత్రం ఆకతాయిలు రెచ్చిపోయారు. బైకులో వెళుతూ కింద పడిన ముగ్గురు ఆకతాయిలను పైకి లేపేందుకు ఓ వ్యక్తి వెళ్లగా, అతనిపైనే కత్తితో దాడి చేసి పరారయ్యారు. ఎట్టకేలకు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన నగరంలో సంచలనం రేపింది. నెల్లూరు నగరంలో వరుస హత్యలు,దాడులు జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు జిల్లాకు ఐజీ వచ్చారు. ఆయన పర్యటిస్తున్న సమయంలోని ఈ సంఘటన జరిగింది. దీంతో నెల్లూరులో పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. స్థానికుల కథనం మేరకు వివరాలు.. జనార్దన్‌రెడ్డి కాలనీలోని విజయ డెయిరీ ఎదురుగా నివాసం ఉంటున్న పూల బాబు బుధవారం సాయంత్రం బైక్‌పై వెళుతున్నాడు. అదే సమయంలో అటుగా సొల్యూషన్, గంజాయి సేవించిన ఆకతాయిలు ముగ్గురు ఒకే బైక్‌పై వేగంగా వస్తూ కిందపడ్డారు. గమనించిన బాబు వారిని పైకి లేపేందుకు ప్రయత్నించాడు. దీంతో వారు 'మాకేందిరా... నీవు సాయం చేసేది'... అంటూ ముగ్గురిలో ఒకరు కత్తితో బాబు కాలుపై పొడిచాడు. భయాందోళనతో అతను పరుగులు పెడుతూ ఇంట్లోకి వెళ్లాడు.అంతటితో ఆగని వారు ఇంట్లోకి వెళ్లి మరీ దాడికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు నిలువరించేందుకు రాగా, వారిపై కూడా దాడికి యత్నించగా వారు పరుగులు తీశారు. అనంతరం వారు అక్కడ నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న నవాబుపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. ఈ మేరకు ముగ్గురు ఆకతాయిలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



ఘటనపై వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ప్రకృతి కన్నెర్ర చేసినప్పుడు... పంటల సాగులో పెట్టుబడి పెరిగి, దిగుబడులు తగ్గి ఆశించిన ఆదాయం రానప్పుడు.... మార్కెట్‌లో మద్దతు ధర దక్కనప్పుడు.. రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన పథకం 'రైతు బంధు'. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ పథకాన్ని గత ప్రభుత్వం గాలికొదిలేసింది. అగ్రికల్చర్ మార్కెట్ సెస్ రూపంలో ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా రైతులకు మాత్రం రుణాలు ఇవ్వలేదు. ఆ నిధులను ఇతర అవసరాలకు వినియోగించింది. దీంతో పథకం లక్ష్యం నీరుగారిపోయింది. ప్రభుత్వం మారడంతో రైతు బంధు పథకం తిరిగి ప్రారంభం అవుతుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రుణమో రామచంద్రా!

- అటకెక్కిన రైతుబంధు పథకం
- వైసీపీ హయాంలో నిర్వీర్యం
- ఆశలన్నీ ప్రస్తుత ప్రభుత్వంపైనే!

నెల్లూరు (వ్యవసాయం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతు బంధు పథకం కింద మార్కెట్ యార్డు గోదాముల్లో పంట దిగుబడులను నిల్వ చేసుకోవచ్చు. ఆ విలువలో 75శాతం వరకు రైతులకు రుణంగా అందేది. గరిష్ఠంగా రూ.2లక్షల వరకు ప్రభుత్వం ఇచ్చేది. ఎంతో మంది రైతులు రుణాలు తీసుకుని పెట్టుబడి ఖర్చులకు తీసుకొచ్చిన అప్పులు తీర్చేవారు. రైతు బంధు రుణాలపై సుమారు 180 రోజుల వరకు ఎలాంటి వడ్డీ ఉండదు. రుణం పొందిన 181 నుంచి 270 రోజుల వరకు 12శాతం వడ్డీ వసూలు చేస్తారు. అప్పటి వరకు దిగుబడులు అదే గోదాములో పెట్టుకోవచ్చు. ఒకసారి రైతు బంధు పథకం పత్రం పొందితే ఐదేళ్ల వరకు వినియోగించుకోవచ్చు. సన్న, చిన్నకారు రైతులకు ఇది ఎంతో ఉపయోగపడేది. ఈ పథకానికి వైసీపీ ప్రభుత్వ మంగళం పాడింది.

ఐదేళ్లుగా రుణాలేవీ?

జిల్లాలో 8 వ్యవసాయ మార్కెట్ కమిటీలు(ఏఎంసీ) ఉన్నాయి. నెల్లూరులో 5వేల మెట్రిక్ టన్నుల(ఎంటీఎస్) సామర్థ్యం కలిగిన గోదాముంది. కోవూరులో 8600 ఎంటీ ఎస్ సామర్థ్యం కలిగినవి 5, కావలిలో 22900 ఎంటీఎస్ సామర్థ్యం కలిగినవి 17, రాపూరులో వెయ్యి ఎంటీఎస్ సామర్థ్యం కలిగినది ఒకటి, ఆత్మకూరులో 2000 ఎంటీఎస్ సామర్థ్యం కలిగినవి 2, ఉదయగిరిలో 5700 ఎంటీఎస్ సామర్థ్యం కలిగినవి 6, సర్వేపల్లిలో 5050 ఎంటీఎస్ సామర్థ్యం కలిగినవి 6, కందుకూరులో 7600 ఎంటీఎస్ సామర్థ్యం కలిగిన 4 గోదాములున్నాయి. మొత్తం 43 గోదాముల్లో సుమారు 57,850 ఎంటీఎస్ దిగుబడులు నిల్వ చేసుకోవచ్చు. అయితే అందులో 11 మరమ్మతులకు గురయ్యాయి. ఆయా మార్కెట్ కమిటీలకు రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా గత మూడేళ్లుగా దాదాపుగా ఈపథకం కింద రుణాలు రైతులకు అందలేదు. కేవలం మార్కెట్ సెస్సు వసూళ్లకే పరిమితమయ్యాయి. 2019-20లో నెల్లూరు, ఆత్మకూరు మార్కెట్ కమిటీలకు సంబంధించి 343 మంది రైతులకు రూ.113 కోట్లు రుణాలు అందించారు. 2020-21 నుంచి ఒక్క రూపాయి విడుదల చేయలేదు.

ప్రభుత్వంపైనే ఆశలు..

2020-21 నుంచి రైతులకు అప్పటి ప్రభుత్వం రుణాలు ఇవ్వలేదు. ఈ క్రమంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో రైతు బంధు పథకం కింద రుణాలు అందుతాయని అన్నదాతలు ఆశగా ఉన్నారు. ప్రస్తుతం జిల్లాకు ప్రధానమైన రబీ సీజన్ ప్రారంభమైంది. అత్యధికంగా రైతులు వరిసాగుకే ప్రాధాన్యమిస్తారు. పంట దిగుబడులు వచ్చాక మద్దతు ధర లభించక దళారులకు అమ్ముకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. ఈక్రమంలో ప్రభుత్వం రైతు బంధు పథకం ద్వారా రుణాలు మంజూరు చే స్తే ధాన్యాన్ని దాచుకునే పరిస్థితి, అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకునే బాధ తప్పుతుందని పలువురు రైతులు అంటున్నారు.



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	148
స్కిన్ చికెన్	266
స్కిన్‌లెస్	290

కోడిగుడ్ల ధర (100): 670

'పది' విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక అమలు

కొండాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ రూపొందించిన 100 రోజుల ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలని మండల విద్యాశాఖాధికారి-2 ఆనందరావు తెలిపారు. ఈమేరకు బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యాశాఖ సూచించిన ప్రణాళిక ప్రకారం రోజువారీ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులలో అభ్యసనాసామర్థ్యాలను పెంచాలన్నారు. దీంతో మార్చిలో జరగనున్న పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. అలాగే ప్రాథమికస్థాయిలో విద్యార్థులలో అభ్యసనాసామర్థ్యాలను పెంచేందుకు రూపొందించిన జీఎఫ్ఎల్ఎన్ 75 రోజుల ప్రణాళికను సమర్థవంతంగా అమలుచేయాలని కోరారు.

అందని పశు వైద్యం!

- వెంటాడుతున్న మందుల కొరత
- అంతుచిక్కని వ్యాధితో మూగజీవాలు మృత్యువాత
- తీవ్రంగా నష్టపోతున్న పెంపకందారులు



వలేటివారిపాలెం ప్రాంతీయ పశువైద్యశాల

వలేటివారిపాలెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పశు వైద్యశాలలో పశువులకు, సన్నజీవాలకు సరైన వైద్యం అందడం లేదు. దీనికి తోడు మందుల కొరత వెంటాడుతోంది. దీంతో ప్రైవేట్ ఔషధ దుకాణాలకు వెళ్లి మందులు కొనుగోలు చేయాల్సి పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో అంతుచిక్కని వ్యాధికి సకాలంలో వైద్యం, మందులు అందక మూగ జీవాలు మృత్యువాత పడుతుండడంతో సన్నజీవాల పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారు. వివరాల మేరకు.. మండలంలో గత పది రోజులుగా గొర్రెలకు అంతుచిక్కని వ్యాధులు ప్రబలుతున్నాయి. కొన్నింటికి నోటి పుండ్లు, మరికొన్నింటికి కాళ్ల గిట్టలకు పుండ్లు, మోకాళ్ల వాపులు వచ్చి పూర్తిస్థాయిలో చికిత్స అందించేలోపు మృత్యువాత పడుతున్నాయి. ఇలా వ్యాధుల బారిన పడిన మూగ జీవాలను వైద్యం కోసం వలేటివారిపాలెం ప్రాంతీయ పశు వైద్యశాలకు తీసుకెళ్తే ప్రభుత్వం నుంచి మందులు సరఫరా కావడం లేదని, ప్రయివేట్ మెడికల్ షాపులకు చీటీ రాసి మందులు తెచ్చుకొంటే వైద్యం చేస్తామని ఏడీ చెబుతున్నట్లు సన్నజీవాల పెంపకందారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి మందులు సరఫరా కాకపోవడం ఏమిటని సన్నజీవాల పెంపకందారులు ప్రశ్నిస్తే మందుల స్టాక్ బీరువా తులుపు తీసి ఖాళీ బీరువా చూపిస్తున్నట్లు ఆవేదన చెందుతున్నారు. ఏదో అరకొరగా మందులు ఇచ్చి అవసరమైన మందులకు చీటీలు రాసిస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా వైద్యం కూడా పూర్తిస్థాయిలో అందడంలేదని సన్నజీవాల పెంపకందారులు చెబుతున్నారు. దీంతో సకాలంలో వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడి తీవ్రంగా నష్టపోతున్నామని కన్నీరు పెడుతున్నారు వలేటివారిపాలెంలో కొంకా నరసింహం, కొంకా హరిబాబు, గాలం నాగేశ్వరరావు, కొంకా మాధవరావులకు చెందిన సుమారు 40 గొర్రెలకు పైగానే సకాలంలో వైద్యం అందక నోటి జబ్బుతో మృత్యువాత పడి సుమారు రూ.8 లక్షలకు పైగానే నష్టపోయినట్లు బాధితులు వాపోయారు. ప్రభుత్వ పశువైద్యశాలలో మందులు ఇవ్వకపోవడంతో వేలకు వేలు ఖర్చు చేసి ప్రయివేట్ మందులు దుకాణాల్లో కొనుగోలు చేసి వైద్యం చేయించుకోవల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. సన్నజీవాలకు ప్రమాదవశాత్తు గాయమైతే కనీసం కట్టు కట్టేందుకు కూడా దూది, గాజుగుడ్డ కూడా లేదని, ప్రైవేట్ దుకాణాలకు వెళ్లి తెచ్చుకోవాలని చీటీలు రాసిస్తున్నట్లు మండిపడుతున్నారు. పశువులకు రోగనిర్ధారణ పరీక్షలు కూడా చేయడం లేదని, ఏమైనా రోగమొస్తే సొంతంగా మందులు తెచ్చుకొని చికిత్స చేయించుకుంటున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి మందులు తెప్పించి సన్నజీవాల పెంపకం దారులకు అందజేసి సకాలంలో వైద్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.



అంతుచిక్కని వ్యాధితో మృత్యువాత పడిన గొర్రె



గిట్ట వద్ద పుండ్లు వాచిన గొర్రె కాలు

బయట కొనుగోలు చేస్తున్నాం

జీవాలను వైద్యం కోసం వైద్యశాలకు తీసుకెళ్తే చీటీలు రాసి ప్రైవేట్ దుకాణాల్లో మందులు తెచ్చుకోమంటున్నారు. అదేమని అడిగితే ప్రభుత్వం నుంచి మందులు సరఫరా లేదని మందుల బీరువా తలుపులు తీసి చూపిస్తున్నారు. ప్రయివేట్ దుకాణాలలో మందులు కొనుగోలు చేసి వైద్యం చేయించుకుంటున్నాం. వ్యాధులకు గురైన సన్నజీవాలు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడి తీవ్రంగా నష్టపోయాం

- గాలం నాగేశ్వరరావు, వలేటివారిపాలెం

ప్రభుత్వం నుంచి మందులు సరఫరా లేదు

ప్రభుత్వం నుంచి ఆరు నెలలుగా మందులు సరఫరా కావడం లేదు. అరకొరగా వచ్చిన మందులు పెంపకందారులకు ఇస్తున్నాం. లేని మందులు ప్రైవేట్ మెడికల్ దుకాణాల్లో తెచ్చుకోమంటున్నాం. జీవాలు నోటి జబ్బులతో మృత్యువాత పడుతున్నది వాస్తవమే. నోటి జబ్బులకు ముందస్తు టీకాలు వేశాం. టీకాలు వేయించని జీవాలు మృత్యువాత పడుతున్నాయి. మందుల కోసం ప్రభుత్వానికి ఇండింట్ పెట్టాం.

- చెన్నకేశవులు, ఏడీ, వలేటివారిపాలెం

మానవ హక్కులపై అవగాహన



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సీనియర్ న్యాయవాది దారా నారాయణ

కావలి(టౌన్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణ విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపవరింగ్ ఈక్వాలిటీ బై బ్రేకింగ్ బారియర్స్ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య వక్తలుగా సీనియర్ న్యాయవాది దారా నారాయణ, హైకోర్టు న్యాయవాది ఖాజా మస్తాన్‌షరీఫ్‌లు పాల్గొని మానవ హక్కుల గురించి వాటి పరిరక్షణ గురించి వివరించారు. ప్రతిఒక్కరూ మానవ హక్కులపై అవగాహన కలిగి వుండాలని, మానవ హక్కులకు భంగం కలిగితే న్యాయస్థానాలను ఆశ్రయించి హక్కులు కాపాడుకోవాలన్నారు. విద్యతో పాటు మానవ హక్కులపై విద్యార్థులకు తెలిసేలా కృషి జరగాలన్నారు. మానవ హక్కులపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. విట్స్ ఛైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ లిఖిత్ రెడ్డిలు మాట్లాడుతూ ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహించడం ఎంతైనా అవసరమన్నారు.

మానవ హక్కులే రక్షణ



మాట్లాడుతున్న ఎల్లు సాల్మన్‌రాజు

అల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచమంతా మానవ హక్కులతోనే రక్షింపబడుతుందని లేకుంటే ఎన్నో విద్రోహ శక్తులు బలహీన వర్గాలపై ఉక్కుపాదం మోపి వారి అవసరాలను తీర్చుకునే అవకాశం ఉందని వీఐపీ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన అవగాహన సభలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం, ఆర్థిక, ప్రజాస్వామ్యం లేకుంటే ప్రజాస్వామ్యంలో సమాన హక్కు అనే పదానికి అర్థం లేదన్నారు. 1948లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆర్టికల్ 41, 42, 43లో సామాజిక న్యాయం, శ్రామిక హక్కులు, సామాజిక భద్రత, కార్మిక, బలహీన వర్గానికి గౌరవప్రదమైన హక్కులు, రక్షణ కల్పించేలా రూపొందించబడ్డాయన్నారు. ఇవే దేశం ఎదగడానికి పునాదులన్నారు. ప్రతీఒక్కరూ మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు బాబురావు, గంగపట్నం సతీష్, దర్శిగుంట వాసు, చింతల ఏడుకొండడలు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వలేటివారిపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం ఎస్టీ కాలనీలోని పేకాట స్థావరంపై ఎస్ఐ మరిదినాయుడు తమ సిబ్బందితో కలిసి బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.11,720 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాయితీపై వరి విత్తనాలు

అల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ ధాటికి నారుమడులు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం 80 శాతం రాయితీపై వరి విత్తనాలను అందించేందుకు చర్యలు తీసుకుందని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేఎన్ఎం-1638, ఆర్ఎన్ఆర్- 15048 రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, నారుమడులు దెబ్బతిన్న రైతులు సద్వినియోగం చేసుకొని వరిసాగు చేపట్టాలని పేర్కొన్నారు.

చర్చిల ముస్తాబు

బిట్రగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని క్రైస్తవ ప్రార్థన మందిరాలు విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబయ్యాయి. విశ్వనాథరావుపేటలోని లెవెన్స్ చర్చిలో క్రిస్మస్ ట్రీ, స్టార్, పశువుల పాకలో బాలయేసు జననం నమూనా బుధవారం ఏర్పాటు చేశారు. బోగోలు, రామస్వామిపాలెంలోని జేరుషలేం, తదితర క్రైస్తవ ఆలయాలు కొత్తరంగులతో ముస్తాబు అవుతున్నాయి.

రాత్రి పదిన్నర గంటల తర్వాత బయట కనిపిస్తే కఠిన చర్యలు : సీఐ



వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ అన్వర్‌బాషా, ఎస్ఐ శివనాగరాజు

కందుకూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ, నేరచరితుల అణచివేత చర్యల్లో భాగంగా ఇకనుంచి పట్టణంలో రాత్రివేళల్లో కఠిన నియమాలు అమలు చేస్తున్నట్లు సీఐ అన్వర్‌బాషా తెలిపారు. రాత్రి పదిన్నర తర్వాత ఎవరైనా ప్రత్యేకమైన కారణం లేకుండా బయట కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే వాహనాల తనిఖీలు ముమ్మరం చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు

కందుకూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని వైసీపీ ఇంచార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ విమర్శించారు. బుధవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కరేడులో నిర్మించిన తారురోడ్డు నాలుగు రోజులకే లేచిపోయి గుంతలు పడిందంటే ఏమాత్రం నాణ్యతతో నిర్మించారో అర్థమవుతోందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ నియోజకవర్గంలో విజయవంతమైందని తెలిపారు. బీపీసీఎల్ రిఫైనరీ వల్ల కాలుష్యం వెలువడుతుందని చేవూరు, రావూరు, చెన్నాయపాలెం ప్రజలు చేస్తున్న ఆందోళనను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఇండోసోల్ సోలార్ పరిశ్రమకు సేకరించిన భూములను బీపీసీఎల్‌కు కేటాయించటం చట్టవిరుద్ధమన్నారు. ఈ సమావేశంలో నాయకులు షేక్ రఫీ, ఈదర రమేష్, అనుమోలు లక్ష్మీనరసింహం, నోటి వెంకటేశ్వర్లు, నున్నం పోతురాజు, గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో సమీక్ష



మాట్లాడుతున్న కావలి ఆర్డీవో సన్నీ వంశీ కృష్ణ

కావలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై కావలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణ బుధవారం తన చాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. 2025 జనవరి 5వ తేదీన ప్రచురించిన ఓటర్ల జాబితా అనంతరం ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు, ఇతర మార్పులు గురించి ఆర్డీవో రాజకీయపార్టీల ప్రతినిధులకు వివరించారు. అనంతరం ఓటర్ల జాబితాకు సంబంధించి ఉన్న సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. దీంతో రాజకీయపార్టీల ప్రతినిధులు వెంగళరావునగర్ ప్రాంతంలో బౌండరీలు సక్రమంగా లేక ఓటర్లను గుర్తించటం కష్టంగా ఉందన్నారు. దీనిపై స్పందించిన ఆర్డీవో బౌండరీలను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఓటర్ల గుర్తింపులో స్పష్టత కోసం సంబంధిత పోలింగ్ స్టేషన్లకు ఓటర్ల బదిలీ ప్రకియను చేపడతామని చెప్పారు.

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

జలదంకి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్వాధీన అగ్రిమెంటుల ద్వారా 2024 జూన్ 15లోపు కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణకు సచివాలయం, మీసేవా కేంద్రాల్లో సాదాబైనామ కింద దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు సీతామహాలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రక్రియను 2027 డిసెంబరు 31లోపు కొనసాగించేలా రాష్ట్రప్రభుత్వం కాలపరిమితిని పెంచిందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 90 రోజుల లోపు హక్కుదారుని పేరున రెవెన్యూ రికార్డులలో నమోదు చయడంతో పాటు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతులకు 2.5 ఎకరాల మాగాణి, 5 ఎకరముల మెట్ట భూములకు ఎలాంటి ఫీజు వసూలు చేయరని పేర్కొన్నారు. ఇది పట్టా భూములకు మాత్రమే చెల్లుతుందని తెలిపారు.

డీటీ వెంకట్రామిరెడ్డి బాధ్యతల స్వీకరణ

జలదంకి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ తహసీల్దారుగా పీ.వెంకట్రామిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీటీగా ఉన్న జూలియాబాయ్ ఉద్యోగ విరమణ చేయడంతో సెలవులో ఉన్న వెంకట్రామిరెడ్డిని నియమిస్తూ కలెక్టర్ హిమాన్షుశుక్లా ఉత్తర్వులు ఇచ్చారు.

'శాంతి భద్రతల'పై రాజీ ఉండదు

- గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి



మాట్లాడుతున్న ఐజీ త్రిపాఠి

కావలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ లేకుండా పని చేస్తున్నట్లు గుంటూరు ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి తెలిపారు. ఎస్పీ అజిత వేజెండ్లతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన కావలి పోలీస్ కమాండ్ కంట్రోల్ రూముకు వచ్చారు. కావలి సబ్‌డివిజనలోని పోలీస్‌స్టేషన్లలో లా అండ్ ఆర్డర్, క్రైమ్ రేటుపై సమీక్షించారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ కావలి సబ్‌డివిజన్ పరిధిలో క్రైమ్ రేట్ తక్కువగా ఉందని, అన్ని పోలీస్‌స్టేషన్లలో గంజాయి, రౌడీ యాక్టివిటీలు కూడా తక్కువగా ఉన్నాయన్నారు. ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు ప్రశాంతంగా ఉండేలా లా అండ్ ఆర్డర్ నిర్వహణ ఉంటుందని తెలిపారు. గుంటూరు ఐజీ త్రిపాఠి వెళ్లిపోయిన అనంతరం ఆమె పట్టణంలో వాహనాల తనిఖీలను పర్యవేక్షించారు. గంజాయి, రౌడీయిజంపై పోలీస్ ఉక్కుపాదం మోపుతోందన్నారు. పోలీస్ తనిఖీలు ముమ్మరం చేసి ఓపెన్ డ్రింకింగ్ చేస్తున్నా, డ్రంక్ డ్రైవ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. క్రైమ్ , నేరాలపై ఎక్కువ ఫోకస్ పెట్టి వాటికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, రౌడీయిజం తదితర నేరాలకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా నేరుగా తనకు ఫోన్ చేస్తే చర్యలు తీసుకుంటామ న్నారు. ఫోన్ చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో కావలి డీఎస్పీ పీ. శ్రీధర్‌తో పాటు సబ్‌డివిజన్‌లోని సీఐలు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

- శిక్షణ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పుర ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి తమ ఇంటి వద్దకు వచ్చిన మున్సిపల్ కార్మికులకు అందచేస్తే చెత్త నుంచి సంపద తయారు చేయవచ్చని మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆదేశాల మేరకు బుధవారం కావలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మెప్మా ఆర్పీలకు సామర్థ్యాల పెంపుపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ పురపాలక సంఘంలో ఎంతో కీలకమైనదని, వీటిని గురించి క్షుణ్ణంగా తెలుసుకుని ఆచరిస్తే చెత్త నుంచి సంపద పొందవచ్చన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ కావలిగా తీర్చి దిద్దాలంటే అందరూ చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు. స్వచ్ఛత విషయంలో అందరూ బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తడి చెత్త, పొడిచెత్త, ప్లాస్టిక్ వేస్ట్, హానికర చెత్త నిర్వహణ గురించి అవగాహన కల్పించారు. ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ నుంచి రిసోర్స్ పర్సన్స్ ఆర్.రమాదేవి, వై.జయమాధురి, వీ.తిరుపతిరావు పాల్గొని శిక్షణ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని ప్లాస్టిక్ ఫ్రీజోన్‌గా ప్రకటిస్తూ పోస్టర్స్ విడుదల చేశారు. ఈ రోజు నుంచి ప్లాస్టిక్ వాడకూడదని మున్సిపల్ అధికారులు, సిబ్బందికి స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు.

పొగాకు సాగులో సస్యరక్షణతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న వేలం నిర్వహణ అధికారి చంద్రశేఖర్

లింగసముద్రం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పొగాకు సాగులో సస్యరక్షణ పాటిస్తూ రసాయన అవశేష నిర్మూలన పాటిస్తే అధిక దిగుబడితోపాటు మంచి ధరను పొందవచ్చని 27వ వేలం కేంద్రం నిర్వాహన అధికారి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని వీర్ కోట గ్రామంలో పొగాకు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు పంటలో సీటీఆర్ఐ అధికారులు సూచించిన పురుగు మందులను మాత్రమే అవసరమైన మోతాదుల్లో పిచికారి చేయాలన్నారు. సీనియర్ గ్రేడింగ్ అధికారి రాజగోపాల్ మాట్లాడుతూ పురుగు మందుల అవశేషాలు, పొగాకు యేతర అన్యపదార్థాలు లేని పొగాకును పండించడం ద్వారా మంచి దిగుబడితో పాటు అధిక ధరలు పొందవచ్చన్నారు. ప్రస్తుతం అతర్జాతీయంగా వాతావరణ పరిస్థితుల కారణంగా బ్రెజిల్, చైనా దేశాలలో పొగాకు ఉత్పత్తి అధికంగా ఉందన్నారు. అందువలన ఈ సంవత్సరం మదేశంలో పొగాకు ధరలలో హెచ్చు తగ్గులు ఉండొచ్చన్నారు. రైతులు అధిక ధరకలు బ్యారెన్‌లను, పొలాలను కౌలుకు తీసుకొని పొగాకు పంటను సాగు చేసి నష్టపోవద్దన్నారు. ఐటీసీ మేనేజర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ తాము సరఫరా చేసే నేలలో కరిగే ఎరువులను అందరు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీపీఐ కంపెనీ ప్రతినిధి ఉన్నం శ్రీనివాసులు, క్షేత్ర సహాయకులు సిపింద్రి, జోత్స్న, మౌష్మిన్, నాగేంద్ర, ఆశ్చర్యబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ

బిట్రగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతలోని ఆర్ఎస్ఆర్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కొండబిట్రగుంటలో బుధ వారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం, గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చెత్త తొలగించి కాల్చివేశారు. వర్షపు నీరు నిల్వ ఉన్న చోట్ల, మురికి కాలువల్లో బ్లీచింగ్ చల్లారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎన్ రెడ్డి మాట్లాడుతూ కొండబిట్రగుంటలో వారం రోజుల పాటు స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏ.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉప్పుచెరువు ప్రాంత వాసులకు న్యాయం చేయాలి



సబ్‌కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కందుకూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉప్పుచెరువు ప్రాంతంలో రోడ్లను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆప్రాంతంలో రోడ్లను అభివృద్ధిచేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం సీపీఐ నాయకులు సబ్ కలెక్టరు దామెర హిమవంశీని కలిసి ఉప్పుచెరువుప్రాంత ప్రజల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ ఉప్పుచెరువు ప్రాం తంలో దాదాపు 20 ఏళ్ల నుంచి నివాసముంటు న్న ప్రజలకు రోడ్డు మార్గం లేకుండా కొందరు దురాక్రమణకు పాల్పడ్డారని, అడ్డుకున్న వారిపై ఆక్రమణదారులు దాడులకు తెగబడ్డారంటే పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఇరిగేషన్ చెరువును ఆక్రమించి ప్రైవేటు వ్యక్తులు వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారని, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకునే విషయంలో అధికారులు నిమ్మకునీరెత్తినట్లు ఉంటున్నారని ఫిర్యా దు చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు పేదప్రజలకు ఒకన్యాయం, ధనవంతులకు మరో న్యా యం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఉప్పుచెరువు ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం తక్షణం చర్యలు చేపట్టకుంటే స్థానికులతో కలిసి సీపీఐ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యర్రంశెట్టి ఆనంద్‌మోహన్, చేవూరి దుర్గాప్రసాద్, ఉప్పుటూరి మాధవరావు, బొల్లోజుల బాలబ్రహ్మచారి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- రైతులను ఆదుకోవాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని, భూమిలేని కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు మాట్లాడుతూ రైతులు పండించే ఏ పంటలకూ గిట్టుబాటు ధరలు దక్కటం లేదని, కేంద్రం ప్రకటించే మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ కలిపి కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రాక కోల్డ్‌స్టోరేజీలలో నిల్వపెట్టుకుని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అనంతరం సబ్ కలెక్టరుకు వినతి పత్రం అందజేశారు.

టీకాలు వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి



గర్భిణీకి మందులు అందచేస్తున్న డాక్టర్ ప్రతిమ

కావలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలలకు వేసే టీకాలు షెడ్యూల్ ప్రకారం వేయించాలని, అవి అనేక ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించి వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని సర్వాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి పీ.ప్రతిమ తెలిపారు. కావలిరూరల్ మండలం చెన్నాయపాలెం, పాముగుంటపాలెం ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలలకు వ్యాక్సినేషన్, ఆరోగ్య అవగాహన కార్యక్రమం జరిగింది. అలాగే డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ పీ. ప్రతిమ మాట్లాడుతూ గర్భిణులు, బాలలు క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయించుకుంటే ధనుర్వాతం, గొరింత దగ్గు, పోలియో, మీజిల్స్, గవదబిళ్లలు, రుబెల్లా, తట్టు, న్యుమోనియా వంటి అనేక రకాల వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయన్నారు. వైద్యశిబిరం అనంతరం ఐరన్, ఫోలిక్ కాల్షియం సిరప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ ఛైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ కే. తాతిరెడ్డి, ఏఎన్ఎంలువిజయమ్మ, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

అదే స్వరం.. నిరసన గళం



కలువాయి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కలువాయి మండలాన్ని తిరుపతిలో కలపొద్దని జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండులో చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం కూడా కొనసాగింది. శిబిరం వద్దకు విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది వచ్చి తమ మద్దతు తెలియజేశారు. జిల్లా మార్పు నిర్ణయానికి వ్యతిరేకంగా అంగన్‌వాడీ సిబ్బంది నినాదాలు చేశారు. 'తిరుపతి వద్దు.. నెల్లూరు ముద్దు, సేవ్ కలువాయి..' అంటూ వారు నినాదాలతో హోరెత్తించారు. ప్రభుత్వం నుంచి తమకు అనుకూలంగా స్పష్టమైన ప్రకటన వచ్చే వరకు దీక్ష విరమించబోమని తెలిపారు. పలు గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి దీక్షలో పాల్గొన్న వారికి సంఘీభావం తెలియజేశారు.

ఆటోపై పడిన విద్యుత్ స్తంభం



కందుకూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆటోపై విద్యుత్ స్తంభం విరిగి పడటంతో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. ఈ దుర్ఘటన కందుకూరు పట్టణంలోని పడమర వడ్డెపాలెంలో బుధవారం జరిగింది. రోడ్డుపై వెళ్తున్న ఆటోపై విద్యుత్ స్తంభం విరిగి పడగా ఆ సమయంలో డ్రైవరు మాత్రమే ఉండటం, విద్యుత్ తీగల కారణంగా స్తంభం పూర్తిగా పడిపోకపోవటంతో పెనుప్రమాదం తప్పింది. డ్రైవరు చాకచక్యంగా ఆటో లోంచి బయటకు రాగా స్థానికులు అందించిన సమాచారంతో అధికారులు తక్షణం విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

సముద్ర తాబేళ్లను పరిరక్షించండి

నెల్లూరు(వెంకటేశ్వరపురం) డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సముద్ర తాబేళ్లను పరిరక్షించాలని, ఇందుకోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని గుంటూరు రేంజ్ సీఎఫ్(కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) ఐకేవీ రాజు పిలుపునిచ్చారు. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో ఐదు జిల్లాల అధికారులతో సముద్ర తాబేళ్ల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎఫ్ మాట్లాడుతూ ఈ నెల చివరి వారం నుంచి మే నెల వరకు సముద్ర తాబేళ్లు తీరానికి చేరుకొని గుడ్లు పెడతాయని చెప్పారు. అటవీశాఖ, మత్స్యశాఖ, మెరైన్ పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, తీరానికి వచ్చే సముద్ర తాబేళ్లను పరిరక్షించాలని సూచించారు. ఈ



కార్యక్రమంలో మాట్లాడుతున్న కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఐకేవీ రాజు

కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్ బాషా, గుంటూరు, తిరుపతి, ప్రకాశం, పల్నాడు డీఎఫ్‌వోలు కృష్ణప్రియ, సాయిబాబా, హారిక, శైలజ, ఫిషరీస్ జేడీ డాక్టర్ శాంతి, ట్రీ ఫౌండేషన్ సభ్యురాలు సుప్రజ ధరణి, సబ్ డీఎఫ్‌వోలు, రేంజర్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై పురుగు మందులు

జిల్లా వ్యవసాయశాఖాధికారి సత్యవాణి

కలువాయి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన పురుగుమందులు 50 శాతం రాయితీతో అందజేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి సత్యవాణి తెలిపారు. బుధవారం తోపుగుంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నిర్వహించి క్లస్టర్ డెమోలో ఆమె పాల్గొన్నారు. గ్రామంలో సాగులో ఉన్న వరి, జొన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయశాఖ అధికారులు పొలాలను సందర్శించి తెగుళ్ల నివారణకు అవసరమైన సలహాలు అందిస్తుంటారని చెప్పారు. రబీ సీజన్‌లో జిల్లాలో 5 లక్షల ఎకరాల్లో వరి సాగులో ఉండగా ఇప్పటికే రైతులకు 35వేల టన్నుల యూరియా అందించామని, వచ్చే రెండు నెలల్లో 65 వేల టన్నుల యూరియా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలోని 425 రైతు సేవా కేంద్రాలు, 56 సొసైటీల ద్వారా యూరియా పంపిణీ చేస్తామన్నారు. కలువాయి మండలానికి కూడా ఇప్పటికి 591 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పొదలకూరు ఏడీఏ శివనాయక్, ఏవోలు కళారాణి, మంజుల, రైతులు పాల్గొన్నారు.



తోపుగుంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయశాఖాధికారి సత్యవాణి, సిబ్బంది

మత్స్యశాఖ జేడీ ఆకస్మిక తనిఖీ

సంగం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్వీఆర్ పురంలో చేపల చెరువుల సాగును మత్స్యశాఖ జేడీ శాంతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కోళ్ల వ్యర్థాలు వినియోగించే చెరువులకు విద్యుత్తు శాఖ అధికారులతో మాట్లాడి సరఫరాను నిలిపివేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆక్వా సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధర కల్పించి చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆక్వా సాగు చేసే రైతులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం 30 రోజులు గడువివ్వగా.. ప్రస్తుతం రెండు నెలలైనా చాలా మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని తెలిపారు. జిల్లాలో 39 వేల చేపల చెరువులకు 20 వేల చెరువులకు మాత్రమే అనుమతులు పొందారని, మిగతా వాటికి విద్యుత్తు సరఫరా నిలిపివేయాలని ఆశాఖ అధికారులకు సూచించామని పేర్కొన్నారు. చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలు వినియోగించే సాగుదారుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా సాగు చేసే రైతులకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆమె వెంట ఏడీ చాన్‌బాషా, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



చేపల చెరువులను పరిశీలిస్తున్న మత్స్యశాఖ జేడీ శాంతి, అధికారులు

గంజాయి, మత్తు పదార్థాలపై ఉద్యమించాలి

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డీ రమాదేవి పిలుపునిచ్చారు. గంజాయి ముఠా చేతిలో ఇటీవల హత్యకు గురైన పెంచలయ్య సంతాప కార్యక్రమం బుధవారం ఆర్‌డీటీ కాలనీలో జరిగింది. రమాదేవి మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడకుండా యువతలో చైతన్యం తీసుకు రావాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించే, రవాణా చేసే వారిపై అటువంటి వారికి అండగా నిలిచే వారిపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని కోరారు. పెంచలయ్య కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్, మోహన్‌రావు, పుల్లయ్య, పెంచల నరసయ్య, కొండా ప్రసాద్, కత్తి శ్రీనివాసులు, జనసేన నాయకుడు గునుకుల కిశోర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి

బస్సు నుంచి దూకి బంగాల్‌వాసి దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన బంగాల్‌కు చెందిన సుజన్‌సంత్రా

చేజర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి). చేజర్ల మండలంలోని పడమటికండ్రిక వద్ద బుధవారం మధ్యాహ్నం బస్సు లోంచి దూకి బెంగాల్‌కు చెందిన సుజన్‌సంత్రా (34) అనే వ్యక్తి మృతిచెందాడు. చేజర్ల ఎస్సై తిరుమలరావు వివరాల మేరకు.. బుధవారం మధ్యాహ్నం కుల్లూరు నుంచి నెల్లూరుకు వస్తున్న నెల్లూరు ఒకటో డిపో బస్సులో ఆదూరుపల్లి స్టాప్ వద్ద ఒక వ్యక్తి ఎక్కి నెల్లూరుకు టికెట్ తీసుకున్నాడు. పడమటి కండ్రిక గ్రామం వద్దకు బస్సు చేరుకోగా.. ఉన్నట్లుండి ఆ వ్యక్తి బస్సు లోంచి కిందకు దూకేశాడు. దీన్ని గమనించిన బస్సు డ్రైవర్ వెంటనే బస్సును ఆపి 108 వాహనానికి సమాచారమిచ్చారు. సంఘటనా స్థలికి చేరుకున్న 108 వాహన సిబ్బంది ఆ వ్యక్తిని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా ఆయన పశ్చిమ బంగా రాష్ట్రం నడియా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడి బంధువుల కోసం ఆరా తీస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

కండలేరు స్పిల్‌వే కాలువ

నిర్మాణం జరిగేనా ?

- ప్రాధాన్యమున్న నిర్మాణాన్ని గాలికొదిలేసిన గత ప్రభుత్వం
- సీఎం చంద్రబాబు దృష్టికి సమస్య
- రూ.95కోట్లు కోరిన నేతలు

పొదలకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కండలేరు జలాశయం నిండుకుండలా తొణికిసలాడుతోంది. ఇది సర్వత్రా ఆనందాన్ని నింపుతుండగా.. కొన్ని గ్రామాల్లోని ప్రజలకు మాత్రం ఆవేదన మిగుల్చుతోంది. ముంపునకు గురవుతున్న తోటలు, గ్రామాలను చుట్టుముడుతున్న నీటితో కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. డ్యాం నుంచి అత్యవసర పరిస్థితుల్లో నీరు బయటకు పంపే స్పిల్‌వే కాలువ శాశ్వత నిర్మాణం జరగకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.

● **వరదనీరు పంపే మార్గమేది ?**

కండలేరు డ్యాం పూర్తయి మూడు దశాబ్దాలు అవుతున్నది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదను అత్యవసర పరిస్థితుల్లో బయటకు పంపే వెసులుబాటు లేకుంది. ఇటీవల మొంథా, దిత్వా తుఫాన్ వర్షాల కారణంగా డ్యాంలో 60 టీఎంసీల నీరు దాటినా, బయటకు వదలడం వీలుకాక అధికారులు అవస్థలు పడ్డారు. ఈనేపథ్యంలో కలెక్టర్, ఎమ్మెల్యే సోమిరెడ్డి సహకారంతో తాత్కాలికంగా యుద్ధప్రాతిపదికన కాలువలు తీసి జనరేటర్ సాయంతో కండలేరు స్పిల్ వే గేట్లు ఎత్తి నీటిని వదిలారు.ఎంతో కీలకమైన జలాశయం స్పిల్‌వే కాలువ నిర్మాణంలో ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి.

● **ఇవేం పనులు..?**

గత ప్రభుత్వం స్పిల్‌వే పనులు కాకుండా కమీషన్ల కోసం కండలేరు ఎడమ కాలువ లైనింగ్ పనులు చేపట్టింది. అవి పూర్తి కాకుండానే సగంలోనే గాలికి వదిలేసిందనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం 60 టీఎంసీలు ఉన్న కండలేరు పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురిస్తే స్పిల్‌వే గేట్లు తెరవని పరిస్థితి నెలకొంది. గేట్లు తెరిస్తే వరద జలాలు ఇక్కడి నుంచి 14 కి.మీ మేర ప్రవహించి డేగపూడి వద్ద కండలేరు వాగులో కలవాల్సి ఉంది. స్పిల్‌వే దిగువ ప్రాంతంలో 560 మీటర్ల మేర అటవీ భూమి ఉందని కాలువ తవ్వేందుకు అటవీశాఖ అభ్యంతరం చెబుతోంది. ఇప్పటి వరకు జరిగిన పనులు కాకుండా వరద నీరు సాఫీగా వెళ్లి కండలేరు వాగులో కలిసేందుకు కొత్తగా రూ.95 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉంది. ఇది ఎంతో అత్యవసరమైన పని. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందనే ఆరోపణలున్నాయి. కీలకమైన స్పిల్‌వే కాలువల పనులతోపాటు అటవీ అనుమతుల సాధనను గాలికి వదిలి కండలేరు ఎడమ కాలువ లైనింగ్ పనులపై మక్కువ చూపారనే విమర్శలు ఉన్నాయి. ఈ తీరును పలు సందర్భాల్లో ఎమ్మెల్యే సోమిరెడ్డి తప్పుబట్టారు.



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కండలేరు స్పిల్ వే కాలువ

● **సీఎం దృష్టి సమస్య**

స్పిల్‌వే పనులు, అటవీశాఖ అనుమతుల కోసం రూ.95 కోట్ల ప్రతిపాదనలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని ఇటీవల ఎమ్మెల్యే సోమిరెడ్డి తెలిపారు. అటవీశాఖకు 560 మీటర్ల మేర భూమికి ప్రత్యామ్నాయంగా ఉదయగిరిలో భూములు చూపించారు. కండలేరు జలాశయం స్పిల్‌వే కాలువ శాశ్వత నిర్మాణం జరిగితే కండలేరు ముందున్న గ్రామాలకు, వెనక వైపున్న గ్రామాలకు ఇబ్బందులు ఉండవు.

మూడు దశాబ్దాలైనా.. పట్టించుకోలేదు

డ్యాం కట్టి 30 ఏళ్లు అవుతున్నా అత్యవసర పరిస్థితుల్లో నీటిని వదలడానికి స్పిల్ వే కాలువ నిర్మాణం జరగకపోవడం దారుణం. ఇటీవల కురిసిన వర్షాలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి, కలెక్టర్ చొరవ చూపకుంటే మా గ్రామాలు మునిగిపోయేవి. అప్పటికప్పుడు కాలువ పనులు చేపట్టి గ్రామాలను ముంపు నుంచి కాపాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపాలి.

- పులిపాటి వెంకటరత్నంనాయుడు, పులికల్లు



కమీషన్ల కోసమే ఆ పనులు

గత ప్రభుత్వంలో కమీషన్లపై చూపిన శ్రద్ధ పనులపై చూపలేదు. స్పిల్‌వే కాలువ నిర్మాణం గాలికి వదిలి లైనింగ్ పనులు ప్రారంభించారు. వాటిని కూడా పూర్తి చేయకుండానే మధ్యలో వదిలివేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 60 టీఎంసీల పైన నీరు చేరుకున్న సందర్భాలున్నా స్పిల్ వే కాలువ గురించి ఏనాడు ఆలోచించలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా చొరవచూపి కాలువ శాశ్వత నిర్మాణం చేపడితే సమస్యలు తీరుతాయి.

- నెల్లెం పెంచలయ్య, వావింపర్తి



చెరువు తూములో అడ్డుగా గోడ కట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



పొదలకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు - లింగంపల్లి చెరువు తూములో అడ్డుగా గోడ కట్టిన గుర్తు తెలియని వ్యక్తులపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని ఆయకట్టుదారులు అధికారులను కోరుతున్నారు. చెరువు కింద సుమారు 100 ఎకరాల వరిసాగుకు రైతులు నారులు పోసుకుని ఉన్నారు. గత వారం కురిసిన వర్షాలకు మొత్తం భాగంలో రైతుల నారు కొట్టుకొనిపోయి ఇబ్బందులకు గురవుతున్నారు. నీరు అవసరం ఉండి నీరు చెరువు తూము తెరవగా చెరువు నిండా నీరు ఉన్నా చుక్కనీరు బయటకు రాలేదు. దీంతో సమస్యను గుర్తించేందుకు తూములోకి వెళ్లి చేస్తే గుర్తుతెలియని వ్యక్తులు తూము లోపల నీరు బయటకు రాకుండా అడ్డుగా ఇటుకలతో గోడ కట్టివున్నారు. గోడ పగలగొట్టాలి అంటే నీటి ప్రవాహం ఎక్కువ కారణంగా ప్రాణాపాయం జరిగే ప్రమాదం ఉంది.

గుర్తించిన వారికి 'అమృత' కార్డులివ్వాలి : కలెక్టర్

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా పథకంలో భాగంగా అనాథలు, నిరాశ్రయులు, సీనియర్ సిటిజన్ల కోసం అమలు చేస్తున్న అమృత ఆరోగ్య కార్డులను అర్హులకు అందించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన చాంబర్‌లో పలువురు చిన్నారులకు అమృత కార్డులను అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి విడత జిల్లాలో ఈ పథకం కింద 518 మందిని ఎంపిక చేశారని, రెండో విడతలో 59 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద 3255 రకాల శస్త్రచికిత్సలు అందిస్తున్నారని ఏటా రూ.25 లక్షల ఉచిత వైద్యాన్ని ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ హేమాసుజన్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు అమృత ఆరోగ్య కార్డులు అందిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నిమ్మ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- కిలో రూ.15 కొనుగోలు చేయండి
- జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

పొదలకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దిగజారుతున్న నిమ్మ ధరలతో కోత కూలీలు కూడా గిట్టుబాటు కాక ఇబ్బందులు పడుతున్న రైతులను వ్యాపారులు ఆదుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం పొదలకూరు నిమ్మయార్డులో రైతులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమ్మకాయల ధరలు దారుణంగా పడిపోయాయన్నారు. కిలో ధర రూ.8 మించకపోవడంతో గిట్టుబాటు కాక రైతులు చెట్లకే వదిలేస్తున్నట్లు తెలుసుకున్న జేసీ రెండు నెలలు రైతులు మార్కెట్టుకు తెచ్చిన నిమ్మకాయలు కిలో రూ.15 వంతున కొనుగోలు చేయాలని కోరారు. దేశం అంతా చలి వాతావరణం ఉండడంతో కాయలకు డిమాండ్ లేదని వ్యాపారులు జేసీ దృష్టికి తెచ్చారు. అన్ని పంటల్లాగే నిమ్మకు కూడా రాయితీ సదుపాయాలు కల్పించాలని రైతులు కోరగా ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడతామని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో వచ్చే కాయల్లో నాణ్యత లోపించి దూర ప్రాంతాల ఎగుమతికి ఉపయోగించలేకున్నామని వ్యాపారులు చెప్పడంతో జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ వేసవి కాలంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కొన్ని రోజుల పాటు రైతులు తెచ్చే నిమ్మకాయలు రూ.15కే కొనుగోలు చేస్తామని చివరకు వ్యాపారులు సమ్మతించడంతో సమావేశం ముగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ అనీతకుమారి, పొదలకూరు మార్కెటింగ్ కార్యదర్శి ఇలియాజ్, మండల ఉద్యాన అధికారి ఆనంద్, రైతులు, వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.



జేసీకి తమ సమస్యలు చెబుతున్న నిమ్మ వ్యాపారులు

ఓబీసీ రిజర్వేషన్ల సాధనకు పార్లమెంటును ముట్టడిస్తాం

● **బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు**

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఓబీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈనెల 15, 16 తేదీలలో ఢిల్లీలో మహా ధర్నా, పార్లమెంటు ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. బుధవారం నెల్లూరులోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో హలో బీసీ - చలో ఢిల్లీ గోడపత్రికలను పలువురు బీసీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. రాజ్యాంగ సవరణలు చేసి ఓబీసీ రిజర్వేషన్లకు జనాభా దామాషా ప్రకారం చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పనమాల శ్రీహరి రావు మాట్లాడుతూ శీతాకాల సమావేశాల్లో ఓబీసీ రిజర్వేషన్ల బిల్లుకు చట్ట సవరణ చేసిన తరువాతే ఎన్నికలు జరపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మరి క్రాంతి కుమార్, రాష్ట్ర మహిళా కార్యదర్శి ముంగర శైలజ, నెల్లూరు జిల్లా సలహాదారు నాగశయనరావు, జిల్లా ఉపాధ్యక్షుడు రాముగౌడ్, యూత్ అధ్యక్షుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కేశన శంకరరావు, పనమాల శ్రీహరిరావు తదితరులు

నేటి నుంచి

అటల్, మోదీ సుపరిపాలన యాత్ర

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అటల్ మోదీ సుపరిపాలన యాత్ర జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీసారెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఈ యాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సుపరిపాలన యాత్రలో జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. నెల్లూరులో ఈ నెల 15వ తేదీ ఉదయం అయ్యప్పగుడి సెంటర్ నుంచి ప్రారంభమై మినీబైపాస్ మీదుగా హరనాథపురం జంక్షన్ వరకు సాగుతుందని చెప్పారు. అక్కడ బహిరంగ సభ జరుగుతుందని, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

జిల్లాలో ప్రశాంతతకు ప్రణాళికలు

- ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి
- పలు పోలీసు స్టేషన్ల తనిఖీ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి తెలిపారు. జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత నగరంలోని నవాబుపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆ తర్వాత బాలాజీనగర్, సంతపేట స్టేషన్లను కూడా తనిఖీ చేశారు. జిల్లాలో ఇటీవల కాలంలో వరుసగా నేరాలు జరుగుతున్నాయని, శాంతిభద్రతలను నెలకొల్పేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో గంజాయి సేవించే వారు, అమ్మేవారు, డెలివరీ చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అనంతరం కావలిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వెళ్లిన ఐజీ అక్కడ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఆ తర్వాత విజయవాడకు తిరిగి వెళ్లారు. ఈ తనిఖీల్లో ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నవాబుపేట పోలీసు స్టేషన్ వద్ద ఐజీకి వినతిపత్రం ఇచ్చి తమ బాధలు చెప్పుకుంటున్న ప్రజలు

సీఆర్‌సీ అభివృద్ధికి అన్నీ విధాలుగా కృషి

వెంకటాచలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీఆర్‌సీ (ప్రాంతీయ దివ్యాంగుల కేంద్రం) అభివృద్ధికి కృషి చేస్తానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ ఎర్రగుంట సమీపంలో ఉన్న సీఆర్‌సీలో బుధవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సోమిరెడ్డి విచ్చేసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా 828 మంది విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిళ్లు, బ్యాటరీ సైకిల్స్, మొబైల్ ఫోన్స్, ఆర్టిఫిషియల్ లెగ్స్ వంటి ఉపకరణ పరికరాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. సీఆర్‌సీ ఇక్కడికి వచ్చేందుకు పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కృషి ఎనలేనిదన్నారు. సీఆర్‌సీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను దివ్యాంగులు సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, చవటపాళెం సొసైటీ ఛైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడు, సర్వేపల్లి కెనాల్ ఛైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి, సీఆర్‌సీ అధికారులు, సిబ్బంది, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.